epaper.samayamdaily.net APTEL/2006/18267

# సమయం

మన గొంతుకే.. మన పత్రిక
తెలుగు దినపత్రిక

SAMAYAM

epaper.samayamdaily.net APTEL/2006/18267
సమయం
తెలుగు దినపత్రిక

## విలేకరులు కావలెను

తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ, విశేష ప్రజాదారణ పొందుతున్న 'సమయం న్యూస్' తెలుగు దినపత్రికలో పని చేయుటకు విలేకరులు కావలెను. ఆసక్తి, అనుభవం కలిగిన వారు సంప్రదించండి.

7036644111, 9490140565

సంపుటి: 19 | సంచిక: 201 | ఎడిటర్ : విక్రం కుమార్ | మంగళవారం 2 జూన్ 2026 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 14 | వెల:రూ.10 |

## పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు

శాంతి ఒప్పందం ఓ కొలిక్కి వచ్చిందనుకొనేలోపే పశ్చిమాసియా మళ్లీ పేలుళ్లతో దద్దరిల్లింది. అమెరికా దళాలు ఇరాన్ లోని గురుక్ నగరం, ఖేష్మ్ ద్వీపంలోని సైనిక లక్ష్యాలపై దాడులు చేశాయి.




4

## సుప్రీంకు కొత్తగా ఐదురుగు జడ్జిలు

4

- కేంద్రన్యాయశాఖ నోటిఫికేషన్



## నిరసనలకు సిద్ధం కండి

తాను జూన్ 6న భారత్‌కు రానున్నట్టు కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే సోమవారం తెలిపారు. పరీక్ష నిర్వహణ లోపాల నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలన్న డిమాండ్‌తో శాంతియుత నిరసన కార్యక్రమం చేపడతానని తెలిపారు. ఈ మేరకు సోషల్ మీడియాలో ఒక వీడియో రిలీజ్ చేశారు.

4





# రాష్ట్రంలో నడుస్తుంది పేదోడి ప్రభుత్వమే

- మొక్కవోని దీక్షతో ప్రజా సమస్యల పరిష్కారానికి అడుగులు
- ప్రతి నిరుపేద సొంతింటి కల నెరవేరుస్తూ ఆత్మగౌరవానికి రక్షణ
- గుడిసెలు లేని ఉమ్మడి ఆదిలాబాద్ కోసం చిత్తశుద్ధితో కృషి
- ఐటీడీఏ పరిధిలో గిరిజనుల కోసం ప్రత్యేకంగా 21 వేల పక్కా ఇండ్లు
- రైతులు ఆందోళన చెందొద్దు.. చివరి గింజ వరకు కొంటాం
- ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి స్పష్టం

వివరాలు 2వ పేజీలో

తెలంగాణ గడ్డపై ప్రస్తుతం సాగుతున్నది నూటికి నూరు శాతం ప్రజా ప్రభుత్వం – మీ పేదోడి ప్రభుత్వం! ఏసీ రూముల్లో కూర్చొని ఏదో ఒక బటన్ నొక్కితే సరిపోదు.. జనం మధ్యకు వచ్చి వారి కష్టసుఖాలు తెలుసుకున్నప్పుడే అసలైన పాలన అంటే ఏంటో తెలుస్తుంది.. అని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి పిడుగుల్లాంటి వ్యాఖ్యలతో గర్జించారు. సోమవారం ఆసిఫాబాద్ జిల్లా పర్యటనలో భాగంగా రెబ్బెన మండలం కాగజ్‌నగర్ ఎక్స్ రోడ్ వద్ద ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ఆయన లబ్ధిదారులు, జనసందోహాన్ని ఉద్దేశించి తనదైన దూకుడు శైలిలో ప్రసంగించారు. ఈ వేదికపై రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, గడ్డం వివేకానంద, దనసరి అనసూయ (సీతక్క)తో పాటు పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు.

- సమయం న్యూస్, హైదరాబాద్





# నేడు అవతరణ దినోత్సవం!

- పండుగలా పదేండ్ల రాష్ట్ర వేడుకలు
- పరేడ్ గ్రౌండ్స్ లో జాతీయ జెండా ఎగురవేయనున్న సీఎం రేవంత్ రెడ్డి
- వాడవాడలా అమరవీరుల స్మరణ
- జిల్లాల్లో మంత్రుల ఆధ్వర్యంలో..

3



# బటన్ నొక్కితే పైశాచిక ఆనందం

- స్వయంగా పేదలను కలిస్తే నిజమైన ఆనందం
- సుపరిపాలనను వెనక్కి లాగేందుకు గొడ్డలి పార్టీ కుతంత్రాలు
- తుని నియోజకవర్గం చామవరం 'పేదల సేవలో' సీఎం చంద్రబాబు

5

ప్రజల మధ్యకు వెళ్లి వారి కష్టసుఖాలు తెలుసుకోవడమే నిజమైన పాలన అని, కేవ లం బటన్ నొక్కడం వల్ల ప్రజల సమస్యలు పరిష్కారం కావని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. కాకినాడ జిల్లా తుని నియోజకవర్గం చామవ రం గ్రామంలో నిర్వహించిన 'పేదల సేవలో' కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేస్తూ గత వైసీపీ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పిం చారు. ప్రతిపక్ష పార్టీ పేరును ప్రస్తావించకుండానే "గొడ్డలి పార్టీ" అంటూ విమర్శలు చేసిన సీఎం, గత ఐదేళ్ల పాలన విధ్వంసకరంగా సాగిందన్నారు. కుట్రలు, డ్రామాలు, అసత్య ప్రచారాలతో రాష్ట్రాన్ని వెనక్కి లాగేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు.

# పవన్ కల్యాణ్‌కు పోలీసుల షాక్

- నేటి 'నవనిర్మాణ సభ'కు అనుమతి నిరాకరణ!
- శాంతిభద్రతలు, ఆవిర్భావ వేడుకల నేపథ్యంలో పోలీసుల బ్రేక్.. హైకోర్టును ఆశ్రయించిన జనసేన
- ఇది బహిరంగ సభ కాదు.. కేవలం ఇండోర్ సమావేశమే: జనసేన నేత మహేందర్‌రెడ్డి వివరణ
- తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాకే సభ పెట్టుకోవాలి: మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్
- ఆంధ్రాలో రాజధాని కట్టడం చేతకాకే ఇక్కడ డైవర్షన్ పాలిటిక్స్: మండిపడ్డ బీఆర్ఎస్ నేత కవిత
- టీఆర్ఎస్ 2.0తో పెట్టుకుంటే మాడు పగిలిపోతుంది.. కేసీఆర్ కుమార్తె స్ట్రాంగ్ వార్నింగ్





## ధాన్యం సేకరణలో ప్రభుత్వం విఫలం

బీజేపీ అధ్యక్షుడు రాంచందర్‌రావు




# ఆన్‌లైన్‌లోనే టీజీపీఎస్సీ పరీక్షలు!

- గంట ముందే ప్రశ్నాపత్రం తయారీ.. లీకేజీలకు చెక్
- నిరుద్యోగులకు పెద్ద శుభవార్త చెప్పిన చైర్మన్
- ఆర్థిక శాఖ నుంచి 3,800 పోస్టులకు అనుమతి
- మూడు నెలలకోసారి మీడియాతో మాట్లాడుతామన్న బుర్రా

ఇకపై నిర్వహించే నియామక పరీక్షలన్నీ పూర్తిగా కంప్యూటర్ ఆధారిత ఆన్‌లైన్ మోడ్‌లోనే జరుగుతాయని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ బుర్ర వెంకటేశం తెలిపారు. దీనివల్ల పేపర్ లీకేజీలకు అవకాశం ఉండదని, పరీక్ష పేపర్‌ను ముందే తయారు చేయడం అనేది ఇకపై ఉండదని చెప్పారు. వీలైతే అభ్యర్థులు పరీక్ష రాసిన వెంటనే ఎన్ని ప్రశ్నలకు సరైన సమాధానాలు రాశారో కూడా తెలిసిపోయేలా సాంకేతికతను తీసుకువస్తున్నట్లు హింట్ ఇచ్చారు. ఉద్యోగ నియామకాల్లో మొదట నోటిఫికేషన్, తర్వాత పరీక్ష, ఆపై మెరిట్ లిస్ట్, చివరిగా సెలక్షన్ లిస్ట్ అనే పారదర్శక విధానాన్ని కచ్చితంగా పాటిస్తామన్నారు.

వివరాలు 3వ పేజీలో



# మండిపోతున్న రాష్ట్రం!

- నిరుటితో పోలిస్తే పెరిగిన ఎండల తీవ్రత
- పలు జిల్లాల్లో 45 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు
- సాయంత్రానికి చల్లబడిన వాతావరణం

2



# నేడు అవతరణ దినోత్సవం!

## పండుగలా పదేండ్ల రాష్ట్ర వేడుకలు

### పరేడ్ గ్రౌండ్స్ లో జాతీయ జెండా ఎగురవేయనున్న సీఎం

**హైదరాబాద్, జూన్ 2:** దశాబ్దాల పోరాటం, ఎందరో అమరుల త్యాగాల పునాదుల మీద ఏర్పడిన స్వరాష్ట్రం నూతన వసంతంలోకి అడుగుపెట్టింది. పదేండ్ల ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను మంగళవారం అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. అణువణువునా తెలంగాణ భావజాలం ఉట్టిపడేలా ప్రత్యేక కార్యక్రమాలను రూపొందించింది. రాజధాని హైదరాబాద్ తో పాటు ఆదిలాబాద్ తదితర అన్ని జిల్లాల కేంద్రాల్లో జాతీయ జెండా పండుగను ఘనంగా నిర్వహిస్తున్నారు. రాష్ట్రస్థాయి ప్రధాన వేడుకలకు సికింద్రాబాద్ లోని పరేడ్ గ్రౌండ్స్ ముస్తాబైంది. ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరవుతారు. ఉదయం ఆయన పరేడ్ గ్రౌండ్స్ లో జాతీయ జెండాను ఆవిష్కరించి, పోలీసు బలగాల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తారు. అనంతరం రాష్ట్ర ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించడంతో పాటు భవిష్యత్ కార్యాచరణపై కీలక దిశానిర్దేశం చేయనున్నారు. వివిధ రంగాల్లో విశేష సేవలు అందించిన ప్రముఖులకు ఈ వేదిక పైనుంచే పురస్కారాలు ప్రదానం చేస్తారు. రాష్ట్ర సాధన కోసం తమ ప్రాణాలను తృణప్రాయంగా వదిలేసిన అమరవీరులను ప్రతి గ్రామం, ప్రతి పట్టణంలో స్మరించుకునేలా ఏర్పాట్లు చేశారు. పరేడ్ గ్రౌండ్స్ వేడుకల కంటే ముందు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గన్ పార్క్ వద్దకు చేరుకొని తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద ఘనంగా నివాళులు అర్పిస్తారు. అదే విధంగా జిల్లాల్లోనూ మంత్రులు, అధికారులు అమరవీరుల స్థూపాల వద్ద పుష్పాంజలి ఘటిస్తారు. హైదరాబాద్ తో పాటు అన్ని జిల్లాల్లోనూ అధికారిక వేడుకలు అంగరంగ వైభవంగా జరగనున్నాయి. జిల్లాల ప్రధాన కేంద్రాల్లో మంత్రులు, ప్రభుత్వ విప్ లు, ఇతర ప్రజాప్రతినిధులు ముఖ్య అతిథులుగా హాజరై జాతీయ జెండాను ఎగురవేస్తారు. అనంతరం ప్రభుత్వ సందేశాన్ని స్థానిక ప్రజలకు చేరవేస్తారు. జిల్లా కలెక్టరేట్లు, ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, స్థానిక సంస్థల కార్యాలయాల్లో ఉదయమే ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని సచివాలయం, అసెంబ్లీ, హైకోర్టు సహా ప్రధాన ప్రభుత్వ కార్యాలయాలు, చారిత్రక కట్టడాలను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. హైదరాబాద్ లోని ట్యాంక్ బండ్ పరిసరాలు త్రివర్ణ పతాకాలు, ఆకర్షణీయమైన అలంకరణలతో శోభాయమానంగా మారాయి. సాయంత్రం వేళ బాణసంచా వెలుగులతో నగరాలు మరింత ఆకర్షణీయంగా కనిపించనున్నాయి. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీస్ యంత్రాంగం పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేసింది. కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల నడుమ రాష్ట్ర పండుగను జరుపుకునేందుకు తెలంగాణ ప్రజానీకం సన్నద్ధమైంది.

# పవన్ కల్యాణ్‌కు పోలీసుల షాక్

### నేటి నవనిర్మాణ సభకు అనుమతి నిరాకరణ

**హైదరాబాద్,జూన్1:** జనసేనాని,ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు తెలంగాణ పోలీసులు భారీ షాక్ ఇచ్చారు. హైదరాబాద్‌లో మంగళవారం తలపెట్టిన జనసేన నవనిర్మాణ సభకు పోలీసులు అనుమతి నిరాకరించారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు, శాంతిభద్రతల దృష్ట్యా జనసేన సభకు అనుమతి ఇవ్వలేమని స్పష్టం చేశారు. ఈ క్రమంలో కోర్టును ఆశ్రయించారు జనసేన నేతలు. నవనిర్మాణ సభకు కోర్టులో అనుమతి లభిస్తుందా లేదా అన్న ఉత్కంఠ నెలకొంది. జనసేన నేత మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. తాము సభ పెట్టట్లేదని, సమావేశం నిర్వహించుకుంటున్నామని చెప్పారు. కన్వెన్షన్ సెంటర్లలో కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. ఈ సమావేశంపై పోలీసులకు సమాచారం ఇస్తే సరిపోతుంది.. అనుమతి ఎందుకు తీసుకోవాలని ప్రశ్నించారు. సరైన కారణాలు చెప్పకుండా పోలీసులు అనుమతి నిరాకరించారని, సమావేశం అనుమతి కోసం కోర్టును ఆశ్రయించామని చెప్పారు. అయితే.. జనసేన సభను అటు అధికార కాంగ్రెస్, విపక్షాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. జనసేన సభను ఉద్దేశించి ఘాటైన వ్యాఖ్యలు చేశారు మంత్రి పొన్నం ప్రభాకర్. పవన్ కళ్యాణ్ తెలంగాణ ప్రజలకు క్షమాపణలు చెప్పిన తర్వాతే ఇక్కడ నవ నిర్మాణ సభ పెట్టుకోవాలని డిమాండ్ చేశారు. అనువణువునా తెలంగాణపై వ్యతిరేకతను నింపుకున్న పవన్... ఇప్పుడు తెలంగాణ అస్తిత్వాన్ని, ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా బీజేపీ ఎజెండాను మోస్తున్నారని మండిపడ్డారు. ఇదిలా ఉండగా.. పవన్ కళ్యాణ్ కు వార్నింగ్ ఇచ్చారు టీఆర్ఎస్ చీఫ్ కవిత. పవన్ కళ్యాణ్ ముందు మీ సెక్రటేరియట్ లోకి నీళ్లు రాకుండా చూసుకోండి.. ఆ తర్వాత తెలంగాణ నవ నిర్మాణ సభ పెట్టుకోండని అన్నారు కవిత. టీఆర్ఎస్ 2.0తో పెట్టుకుంటే మూతి పళ్లు రాలుతాయని..ఒకసారి పెట్టుకుంటే తెలంగాణ తెచ్చుకున్నామని..మళ్లీ మా జోలికొస్తే మూతి పళ్లు రాలుతాయని అన్నారు కవిత. ఆంధ్రాలో రాజధాని కట్టడం చేతకాకే డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని మండిపడ్డారు కవిత. తెలంగాణలో ఏపీ ఏజెంట్ సీఎంగా ఉండటంతో డ్రామాలు చేస్తున్నారని అన్నారు.

# టెట్ షెడ్యూల్ విడుదల

### జూన్ 16 నుంచి జూన్ 22 వరకు పరీక్షలు

**హైదరాబాద్, జూన్ 1:** తెలంగాణ ఉపాధ్యాయ అర్హత పరీక్ష -2026 షెడ్యూల్‌ను పాఠశాల విద్యాశాఖ విడుదల చేసింది. ఈ పరీక్షలు జూన్ 16 నుంచి జూన్ 22 వరకు నిర్వహించనున్నారు. ప్రతిరోజూ ఉదయం, మధ్యాహ్నం రెండు షిఫ్టుల్లో పరీక్షలు జరగనున్నాయి. ఉదయం షిఫ్ట్ 9 గంటల నుంచి 11:30 గంటల వరకు, మధ్యాహ్నం షిఫ్ట్ 2 గంటల నుంచి 4:30 గంటల వరకు ఉంటుంది. పరీక్షలను పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో నిర్వహించనున్నారు. పేపర్-1, పేపర్-2 పరీక్షల తేదీలతో పాటు ఉత్తీర్ణత ప్రమాణాలను కూడా అధికారులు వెల్లడించారు. దీంతో పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు తమ ప్రణాళికలను మరింత మెరుగ్గా రూపొందించుకునే అవకాశం లభించింది. టీఎస్ టెట్ పరీక్ష మొత్తం 150 మార్కులకు నిర్వహిస్తారు. జనరల్ కేటగిరీ అభ్యర్థులు కనీసం 60 శాతం మార్కులు సాధించాలి.బీసీ అభ్యర్థులు 50 శాతం మార్కులు పొందాలి. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులు 40 శాతం మార్కులు సాధిస్తే అర్హత పొందుతారు.

# రాష్ట్రంలో నడుస్తుంది పేదోడి ప్రభుత్వమే

- మొక్కవోని దీక్షతో ప్రజా సమస్యల పరిష్కారానికి అడుగులు
- ప్రతి నిరుపేద సొంతింటి కల నెరవేరుస్తూ ఆత్మగౌరవానికి రక్షణ
- గుడిసెలు లేని ఉమ్మడి ఆదిలాబాద్ కోసం చిత్తశుద్ధితో కృషి
- ఐటీడీఏ పరిధిలో గిరిజనుల కోసం ప్రత్యేకంగా 21 వేల పక్కా ఇండ్లు
- రైతులు ఆందోళన చెందొద్దు.. తడిసిన ధాన్యానీ చివరి గింజ వరకు కొంటాం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ ప్రతినిధి:** తెలంగాణ గడ్డపై ప్రస్తుతం సాగుతున్నది నూటికి నూరు శాతం ప్రజా ప్రభుత్వం - పేదోడి ప్రభుత్వమేనని, నిరుపేదల ఆత్మగౌరవాన్ని కాపాడటమే తమ పరమావధి అని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఎలాంటి వివక్ష, రాజకీయ విభేదాలు లేకుండా కేవలం 'పేదరికం' అనే ఒకే ఒక్క ప్రాతిపదికన ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపు జరుగుతుందని భరోసా ఇచ్చారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాను గుడిసెలు లేని ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు తమ ప్రభుత్వం మొక్కవోని దీక్షతో పని చేస్తుందని ప్రతినబూనారు. సోమవారం ఆసిఫాబాద్ జిల్లా పర్యటనలో భాగంగా రెబ్బెన మండలం కాగజ్ నగర్ ఎక్స్ రోడ్ వద్ద ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభకు ముఖ్యమంత్రి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ వేదికపై రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, గడ్డం వివేకానంద, దనసరి అనసూయ (సీతక్క)తో పాటు పలువురు ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పోరాటాల పురిటిగడ్డ అని, కొమురం భీం 'జల్-జంగల్-జమీన్' నినాద స్ఫూర్తితో ఆదివాసీల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి అన్నారు. ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో అభివృద్ధికి, సంక్షేమానికి పెద్దపీట వేశామని చెప్పారు. ఇందులో భాగంగానే రాష్ట్రవ్యాప్తంగా నేడు రికార్డు స్థాయిలో 1 లక్ష 20 వేల ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించామని, ఆసిఫాబాద్ జిల్లా కొలం కొారి పంచాయతీ కొత్తగూడ గ్రామంలో ఇండ్లను ప్రారంభించి, 2వ విడత పథకానికి శ్రీకారం చుట్టామని వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇండ్ల చొప్పున మొత్తం 4 లక్షల 50 వేల ఇండ్లను కేటాయించామని, ఐటీడీఏ పరిధిలోని గిరిజన ప్రాంతాల కోసం ప్రత్యేకంగా 21 వేల పక్కా ఇండ్లను మంజూరు చేయనున్నట్లు ప్రకటించారు. ఇల్లు రాని ఆదివాసీలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఏడాది తిరిగేసరికి అర్హులైన ప్రతి ఒక్కరికీ పక్కా ఇల్లు నిర్మించి ఇస్తామని భరోసా ఇచ్చారు. రాబోయే సెప్టెంబర్ 17వ తేదీ నాటికి మరో లక్ష ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాలకు చర్యలు తీసుకుంటున్నట్లు సీఎం వివరించారు. రైతు సంక్షేమానికి తమ ప్రభుత్వం ప్రథమ ప్రాధాన్యత ఇస్తుందని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఉమ్మడి ఆదిలాబాద్‌ను సస్యశ్యామలం చేసేందుకు వీలుగా తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు పూర్తి చేసే విషయమై మహారాష్ట్ర ప్రభుత్వంతో చర్చలు జరుపుతామన్నారు. ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 62 లక్షల క్వింటాళ్ల ధాన్యం సేకరించామని, జూన్ 15 నాటికి ఈ లక్ష్యాన్ని 75 లక్షల క్వింటాళ్లకు పెంచుతామన్నారు. వరితో పాటు మొక్కజొన్న, జొన్న, పొద్దుతిరుగుడు పంటలను కూడా కొనుగోలు చేస్తున్నామని, అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని సైతం మద్దతు ధరతో చివరి గింజ వరకు కొంటామని, రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని పిలుపునిచ్చారు. ఈ సభలో పాల్గొన్న రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో అసంపూర్తిగా నిలిచిపోయిన ఇండ్లను గుర్తించి, నిర్మాణ పరిస్థితిని బట్టి నిధులు మంజూరు చేసి 2వ విడత ఇందిరమ్మ పథకం ద్వారా పూర్తి చేస్తామని తెలిపారు. ఐటీడీఏ పరిధిలోని ప్రతి నియోజకవర్గానికి అదనంగా మరో వెయ్యి ఇండ్లను కేటాయిస్తున్నట్లు చెప్పారు. అనంతరం మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ, రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని సక్రమంగా నిర్వహిస్తూనే.. ఇచ్చిన మాట ప్రకారం ఇందిరమ్మ ఇండ్లు, రైతు రుణమాఫీ, మహాలక్ష్మి, గృహజ్యోతి వంటి గ్యారంటీలను అమలు చేస్తున్నామని, తెలంగాణను గుడిసెలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని ధీమా వ్యక్తం చేశారు. మరో మంత్రి గడ్డం వివేకానంద మాట్లాడుతూ, గత పదేళ్లలో నిర్లక్ష్యానికి గురైన రేషన్ కార్డులు, పెన్షన్ల మంజూరుపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు నియోజకవర్గానికి ఒకటి చొప్పున 12 అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లను స్థాపిస్తున్నామని, ఇప్పటికే ప్రభుత్వ ఆధ్వర్యంలో దాదాపు 1 లక్ష ఉద్యోగాలను నిరుద్యోగులకు అందించామని గుర్తుచేశారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ, ఆదివాసీల జీవితాల్లో కూడు, గుడ్డ, గూడు కల్పించి వెలుగులు నింపడానికే ప్రభుత్వం పనిచేస్తోందని, మారుమూల గిరిజన గూడాల అభివృద్ధికి, అర్హులైన వారికి పోడు భూముల పట్టాల పంపిణీకి కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. కాగా, సివిల్ సప్లై కార్పొరేషన్ చైర్ పర్సన్, మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు మాట్లాడుతూ.. ఆసిఫాబాద్ జిల్లాలోని ప్రభుత్వ వైద్య కళాశాలకు 'కొండా లక్ష్మణ్ బాపూజీ వైద్య కళాశాల'గా నామకరణం చేయాలని, అలాగే మంచిర్యాల ప్రాంతంలో ఒక విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. ఈ పర్యటనలో స్థానిక ఎమ్మెల్యేలు కోవలక్ష్మి, పాల్వాయి హరీష్ బాబుతో పాటు పెద్ద సంఖ్యలో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# తెలంగాణ రైతును చులకన చేస్తే ఊరుకోం



- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెచ్చరిక
- ఎంత ఖర్చైనా సరే.. మహారాష్ట్రలో 2 వేల ఎకరాల భూ సేకరణకు మేం సిద్ధం
- ధాన్యం, మొక్కజొన్నల కొనుగోలుపై కేంద్రం వెనకడుగు వేయొద్దు
- జూన్ 15 నుండి కేంద్రంపై యుద్ధమే

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ ప్రతినిధి:** ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పదేళ్ల టిఆర్ఎస్ (బీఆర్ఎస్) పాలనలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైందని, ఈ ప్రాంత రైతులకు ఘోర అన్యాయం జరిగిందని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఆరోపించారు. సోమవారం ఆసిఫాబాద్ జిల్లా పర్యటనలో భాగంగా రెబ్బెన మండలం కాగజ్ నగర్ ఎక్స్ రోడ్ వద్ద ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభకు రాష్ట్ర మంత్రులు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ముఖ్యమంత్రి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాకు పంచాయతీ కంటే పరిష్కారమే ముఖ్యం కానీ పరిష్కారం దొరకనప్పుడే పంచాయతీ పెడతానని ఎంతటి వారైనా వదిలిపెట్టేది ఉండదని కేంద్ర ప్రభుత్వం పై, మహారాష్ట్ర ముఖ్యమంత్రి వైఖరిపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు.

### పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో నిర్లక్ష్యం

గత కాంగ్రెస్ పాలనలో, దివంగత వైఎస్సార్ హయాంలో తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజ్ నిర్మాణంతో రెండు లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలని సంకల్పించామని సీఎం గుర్తుచేశారు. కానీ, గత పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వం ఆ ప్రాజెక్టును పూర్తి చేయకుండా, ఉమ్మడి ఆదిలాబాద్ ప్రయోజనాలను పూర్తిగా నీరుగార్చిందని మండిపడ్డారు.

### ఎంత ఖర్చైనా భరిస్తాం.. మహారాష్ట్ర చిన్నచూపు తగదు

తుమ్మిడిహెట్టి బ్యారేజీ ద్వారా తెలంగాణ రైతులకు నీరందించేందుకు మహారాష్ట్రలోని 2,000 ఎకరాల భూసేకరణ కోసం ఎంత ఖర్చైనా భరించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. "భూసేకరణ కోసం మహారాష్ట్ర ప్రభుత్వానికి అనేకసార్లు లేఖలు రాసినా అక్కడి ముఖ్యమంత్రి ఫడ్నవీస్ స్పందించకపోవడం దారుణం. తెలంగాణలో తీవ్రమైన సాగునీటి సమస్య ఉన్నప్పటికీ కనీసం అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వకపోవడం, తెలంగాణ ముఖ్యమంత్రిని అంత చులకనగా చూడడం సిగ్గుచేటు" అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రాణహిత సమస్యపై మహారాష్ట్ర ప్రభుత్వం చిన్నచూపు చూస్తే తెలంగాణ రైతాంగం ఊరుకోదని, తిరగబడాల్సి ఉంటుందని హెచ్చరించారు.

### కిషన్ రెడ్డి దూతగా వ్యవహరించాలి

తెలంగాణకు చెందిన కిషన్ రెడ్డి కేంద్ర మంత్రిగా ఉన్నారని, ఆయన మహారాష్ట్ర ముఖ్యమంత్రికి, తనకు మధ్య దూతగా (మధ్యవర్తిగా) వ్యవహరించి ఈ భూసేకరణ సమస్యను పరిష్కరించాలని సీఎం డిమాండ్ చేశారు. గతంలో ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణకు సంబంధించిన ఏడు గ్రామాలను కేంద్రం కలిపినప్పుడు కేంద్రం జోక్యం చేసుకుంది, మరి ఇప్పుడు మహారాష్ట్ర సహకరించకపోతుంటే కేంద్రం ఎందుకు మౌనంగా ఉంటుందని ప్రశ్నించారు.

### జూన్ 15 నుండి కేంద్రంపై యుద్ధమే

తెలంగాణలో రైతులు పండించిన ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు చేసేందుకు కేంద్రం ముందుకు రాకపోవడంపై సీఎం తీవ్రంగా మండిపడ్డారు. ముఖ్యంగా ఇటీవల కురిసిన వర్షాలకు తడిసిన ధాన్యాన్ని కేంద్రం కచ్చితంగా కొనుగోలు చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. ఒకవేళ కేంద్ర ప్రభుత్వం, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఈ విషయాలపై స్పందించకపోతే.. జూన్ 15వ తేదీ నుండి కేంద్రంపై యుద్ధం ప్రకటించాల్సి వస్తుందని ఘాటుగా హెచ్చరించారు. రైతుల పంటలను కేంద్రం కొనుగోలు చేయని పక్షంలో జూన్ 15 నాడు ప్రత్యక్ష కార్యాచరణను ప్రకటిస్తామని సీఎం రేవంత్ రెడ్డి తేల్చిచెప్పారు. ఈ బహిరంగ సభలో రాష్ట్ర మంత్రులు, నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

# జలాల్లో మన వాటా మనకే దక్కాలి

- గోదావరి వరద మళ్లింపునకు స్పష్టమైన విధానం తేవాలి
- డ్యామ్‌ల గేట్ల మరమ్మతులకు ఎన్ని నిధులైనా ఇస్తాం
- విపత్తుల నిర్వహణకు రూ. వెయ్యి కోట్లు ఖర్చు చేయాలి
- ఇబ్బందులు తలెత్తితే అధికారులపై కఠిన చర్యలు తప్పవు
- వాతావరణ శాఖ అంచనాల మేరకే పంటల సాగు
- రామగుండం యూరియా మొత్తం తెలంగాణకే దక్కాలి
- వర్షాకాల సన్నద్ధత, విపత్తుల నిర్వహణపై సీఎం సమీక్ష



**హైదరాబాద్, జూన్ 1:** వర్షాభావ పరిస్థితులపై రైతులకు అవగాహన కల్పించాలని అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. తక్కువ నీరు వినియోగించుకునే పంటలపై రైతులకు వివరించాలన్నారు. పంట మార్పిడి ప్రాధాన్యాన్ని అన్నదాతలకు తెలియజేయాలని సీఎం ఆదేశించారు. వర్షాకాల సన్నద్ధతపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో సమీక్ష జరిగింది. ఈ సమావేశానికి వ్యవసాయ, నీటి పారుదల, పట్టణాభివృద్ధి, పంచాయతీరాజ్, ఆరోగ్య, హోం, హైడ్రా, విపత్తు నిర్వహణ, అగ్నిమాపక శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు. నైరుతి రుతుపవనాలతో వచ్చే వర్షపాతం, ఎల్‌నినో ప్రభావం, ఇతర అంశాలపై వాతావరణ శాఖ అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. తెలంగాణలో ప్రాజెక్టుల మెయింటెనెన్స్ పనులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరా తీశారు. గేట్లు, నిర్వహణ పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రాజెక్టుల మెయింటెనెన్స్‌కు అవసరమైన నిధులు తక్షణమే విడుదల చేయాలని ఆదేశాలు జారీ చేశారు. విపత్తు నిర్వహణ శాఖ వద్ద ఉన్న రూ.1000కోట్లను నిబంధనల ప్రకారం వినియోగించాలన్నారు. దెబ్బతిన్న రోడ్లు, కూలిపోయిన వంతెనల నిర్మాణానికి అవసరమైన నిధులు వెంటనే విడుదల చేయాలని ఆదేశించారు. విపత్తుల సమయంలో ప్రాణ నష్టం, ఆస్తి నష్టం, పశు నష్టం వాటిల్లినప్పుడు తక్షణమే అధికారులు స్పందించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశంలో వ్యవసాయ, నీటి పారుదల, పట్టణాభివృద్ధి, పంచాయతీ రాజ్, ఆరోగ్య, హోమ్, హైడ్రా, విపత్తు నిర్వహణ, అగ్నిమాపక శాఖల అధికారులు పాల్గొన్నారు. సమీక్ష సందర్భంగా రైతులకు వర్షాభావ పరిస్థితులపై ముందస్తు అవగాహన కల్పించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. తక్కువ నీటితో సాగు చేయగల పంటలపై రైతులకు స్పష్టమైన సమాచారం అందించాలని సూచించారు. అలాగే పంటల మార్పిడి, పంటల వైవిధ్యీకరణ వల్ల కలిగే ప్రయోజనాలను అన్నదాతలకు వివరించాలని అన్నారు. రాష్ట్రంలోని ప్రాజెక్టుల నిర్వహణ, మరమ్మతుల పనులపై కూడా సీఎం ప్రత్యేకంగా ఆరా తీశారు. ప్రాజెక్టుల గేట్లు, ఇతర నిర్వహణ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ పనులకు అవసరమైన నిధులను వెంటనే విడుదల చేయాలని సంబంధిత శాఖలకు సూచించారు. భారీ వర్షాలు, ప్రకృతి వైపరీత్యాల కారణంగా దెబ్బతిన్న రోడ్లు, కూలిపోయిన వంతెనల పునర్నిర్మాణానికి అవసరమైన నిధులను తక్షణమే విడుదల చేయాలని ఆదేశించారు. విపత్తుల సమయంలో ప్రాణనష్టం, ఆస్తి నష్టం, పశువుల నష్టం వంటి ఘటనలు చోటుచేసుకున్నప్పుడు అధికారులు వెంటనే స్పందించి సహాయక చర్యలు చేపట్టాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అదేవిధంగా రామగుండం ఫెర్టిలైజర్స్ ఫ్యాక్టరీలో ఉత్పత్తి అయ్యే యూరియా మొత్తం తెలంగాణ రైతుల అవసరాల కోసం కేటాయించాలని కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయనున్నట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు.

# ధాన్యం సేకరణలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

- రైతులను ఆదుకోవడంలో పూర్తిగా నిర్లక్ష్యం
- ప్రభుత్వ తీరుపై మండిపడ్డ రామచంద్రరావు
- నేడు ఢిల్లీలో ఆవిర్భావ దినోత్సవాలు నిర్వహిస్తామని వెల్లడి



**న్యూఢిల్లీ, జూన్ 1 :** రేవంత్‌రెడ్డి ప్రభుత్వం.. రైస్ మిల్లర్లతో కుమ్మక్కైందని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రాంచందర్‌రావు విమర్శించారు. చివరి గింజ వరకు ధాన్యం కొంటానని సీఎం చెప్పారని.. మరి ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని ప్రశ్నించారు. వడ్లను కేంద్రం ఎప్పుడు కొనదని.. ఆయా రాష్ట్రాలు కొన్న దానికి మాత్రమే రీయింబర్స్‌మెంట్ చేస్తుందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ సర్కార్ నిర్లక్ష్యం వల్లే తెలంగాణలో ఈ పరిస్థితి వచ్చిందని చెప్పారు. ధాన్యం రోడ్లపై కుప్పలు కుప్పలుగా పడి ఉందని అన్నారు. బీజేపీ ఆందోళనతో రాష్ట్ర ప్రభుత్వం దిగి వచ్చిందని తెలిపారు. సోమవారం ఢిల్లీలో రాంచందర్‌రావు మీడియాతో మాట్లాడారు. ధాన్యం కొనుగోళ్లు చేయడంలో కాంగ్రెస్ సర్కార్ విఫలమైందని రాంచందర్‌రావు ధ్వజమెత్తారు. రాష్ట్రంలో ఎంత పంట పడిందనే సమాచారం కేంద్రానికి ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. రైతుల వద్ద ఉన్న పంటను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మొద్దునిద్ర పోవడంతోనే ధాన్యం కొనుగోళ్ల సమస్యలు వచ్చాయని విమర్శించారు. ధాన్యం కొనుగోళ్లపై బీజేపీ పోరాటంతోనే ఆయా కొనుగోలు కేంద్రాలకు లారీలను రేవంత్ ప్రభుత్వం పంపుతోందని చెప్పారు. తెలంగాణ నుంచి కేంద్ర కమిటీలోకి ఎవరు వెళ్తారనే విషయంపై కేంద్ర హైకమాండ్ ఓ నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు. నేడు ఢిల్లీలో బీజేపీ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు నిర్వహిస్తామని రాంచందర్‌రావు తెలిపారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ సహా బీజేపీ జాతీయ నాయకులు తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో పాల్గొంటారని చెప్పారు. తెలంగాణ, కర్ణాటకలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే దిశగా తమ పార్టీ జాతీయ నాయకత్వం కార్యాచరణ రూపొందిస్తుందని తెలిపారు. తెలంగాణపై బీజేపీ జాతీయ నాయకత్వం దృష్టి సారించిందని అన్నారు. బీజేపీ మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్‌పై పెట్టిన పోస్టర్లకు.. పార్టీలో గ్రూప్ తగాదాలకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. బీజేపీలో అంతర్గత కలహాలు సృష్టించాలనే ఈటలపై ఎవరో పోస్టర్లు పెట్టారని మండిపడ్డారు. పోస్టర్లు పెట్టిన వారిపై పార్టీపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇప్పటికే ఈ విషయంపై డీజీపీ, కమిషనర్‌కి ఫిర్యాదు చేశామని రాంచందర్‌రావు పేర్కొన్నారు.

# తెలంగాణపై విషం చిమ్ముతున్న పవన్!

- హైదరాబాద్ లో నవ నిర్మాణ సభ ఏంటి?
- తెలంగాణ ఆవిర్భావం నాడు పదిహేను రోజులు అన్నం మానేశాడట!
- బీజేపీ ప్రాపకం కోసమే జనసేనాని యాక్టింగ్
- ముందుగా ప్రజలకు క్షమాపణలు చెప్పాలన్న మంత్రి పొన్నం ప్రభాకర్



**సిద్దిపేట, జూన్ 1 :** ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ పై తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్ లో పవన్ కల్యాణ్ నవ నిర్మాణ సభ పెట్టడాన్ని ఆయన తీవ్రంగా ఆక్షేపించారు. బీజేపీతో ఒప్పందం మేరకే పవన్ ఈ కొత్త నాటకానికి తెరతీశారని ఆరోపించారు. తెలంగాణను బీజేపీకి తాకట్టు పెట్టడమే ఆయన చెప్పే నవ నిర్మాణమా అని ప్రశ్నించారు. తెలంగాణ ప్రజల దృష్టి తగిలితే కోనసీమ కొబ్బరి చెట్లు ఎంకిపోతాయని గతంలో పవన్ అన్నారని, ఆ వ్యాఖ్యలపై రాష్ట్ర ప్రజలకు ముందుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత పదకొండు రోజులు తాను అన్నం తినలేదని పవన్ స్వయంగా చెప్పారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పవన్ కల్యాణ్ పై తీవ్ర విమర్శలు గుప్పించారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా గతంలో వ్యాఖ్యలు చేసిన పవన్.. ముందుగా ఇక్కడి ప్రజలకు క్షమాపణ చెప్పాలని, ఆ తర్వాతే హైదరాబాద్ లో నవ నిర్మాణ సభ నిర్వహించుకోవాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఏర్పాటును వ్యతిరేకిస్తూ గతంలో ఆయన మాట్లాడారని, తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పుడు తాను పదకొండు రోజుల పాటు అన్నం తినలేదని బహిరంగంగానే చెప్పారని మంత్రి గుర్తు చేశారు. తెలంగాణపై విషం కక్కుతూ, ఇక్కడి ప్రజల భావోద్వేగాలను దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేసిన వ్యక్తికి ఇక్కడ సభ నిర్వహించే నైతిక హక్కు లేదన్నారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో పవన్ పాల్గొంటే తమకు ఎలాంటి అభ్యంతరం లేదని, అయితే అదే రోజు హైదరాబాద్ లో నవ నిర్మాణ సభ నిర్వహించడం వెనుక రాజకీయ ఉద్దేశాలు ఉన్నాయని ఆరోపించారు. తెలంగాణలో విద్వేషాలను రెచ్చగొట్టి రాజకీయ లబ్ధి పొందాలనే ప్రయత్నం జరుగుతోందని, ఇందులో బీజేపీతో పవన్ కు లోపాయికారీ ఒప్పందం ఉందని విమర్శించారు. తెలంగాణ ప్రజలపై గతంలో చేసిన వ్యాఖ్యలకు పవన్ కల్యాణ్ బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని మంత్రి డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసిన వ్యక్తి ఇక్కడికి వచ్చి సభలు నిర్వహించడం సమంజసం కాదన్నారు. తెలంగాణ వాళ్ల దృష్టి పడితే కోనసీమ కొబ్బరి చెట్లు ఎంకిపోతాయి అని చెప్పిన పవన్ కల్యాణ్.. తెలంగాణ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అలాగే నవ నిర్మాణ సభను గుజరాత్, ఉత్తరప్రదేశ్, తమిళనాడు లేదా కేరళలో కాకుండా హైదరాబాద్ లోనే ఎందుకు నిర్వహిస్తున్నారో ప్రజలకు చెప్పాలని ప్రశ్నించారు. బీజేపీ నాయకత్వాన్ని మెప్పించడానికే తెలంగాణలో సభలు పెడుతున్నారా అని నిలదీశారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలు పవన్ కు అధికార బాధ్యతలు అప్పగించారని, అక్కడి సమస్యలపై ఆయన దృష్టి సారించాలని మంత్రి సూచించారు. విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణ వంటి కీలక అంశాలపై పోరాడకుండా తెలంగాణలో రాజకీయాలు చేయడం సరైన విధానం కాదన్నారు. తెలంగాణపై వ్యతిరేక భావజాలంతో వ్యవహరించిన పవన్ కల్యాణ్ తక్షణమే తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని, లేకపోతే ప్రజలు దీనిని తీవ్రంగా వ్యతిరేకిస్తారని మంత్రి పొన్నం ప్రభాకర్ హెచ్చరించారు. అణువణువునా తెలంగాణపై వ్యతిరేకతను నింపుకున్న పవన్.. ఇప్పుడు తెలంగాణ అస్తిత్వాన్ని దెబ్బతీసేలా బీజేపీ ఎజెండాను మోస్తున్నారని మండిపడ్డారు.

# మా జోలికొస్తే మూతి పళ్లు రాలుతాయి

- ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కు కవిత మాస్ వార్నింగ్
- రాజధాని కట్టడం చేతకాకే ఇక్కడ డైవర్షన్ పాలిటిక్స్
- ఆంధ్రా ప్రజలతో పేచీ లేదు.. నాయకులు పెత్తనం చేస్తే ఊరుకోం



**హైదరాబాద్, జూన్ 1:** ఆంధ్ర ప్రజలతో తమకు ఏనాడు పేచీ లేదని, ఉన్నదల్లా అక్కడ రాజకీయ నాయకులతోనే అని తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. వారు ఇక్కడ పెత్తనం చేయాలని చూస్తే ఊరుకునేది లేదని ఘాటుగా హెచ్చరించారు. మలి దశ తెలంగాణ ఉద్యమంలో అనేక పోరాటాలు చేశామని ఆమె గుర్తు చేశారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. ఆంధ్ర, తెలంగాణ ప్రజల మధ్య ఎలాంటి విభేదాలు లేవని, కేవలం ఆంధ్ర రాజకీయ నాయకులతోనే తమ పంచాయితీ అని తేల్చి చెప్పారు. ఆంధ్ర రాజకీయ నాయకుల ఏజెంట్ ఇక్కడ ముఖ్యమంత్రిగా ఉన్నారని కవిత తీవ్ర ఆరోపణలు చేశారు. రాష్ట్రంలో ఎక్కడ పడితే అక్కడ ఆంధ్ర వాళ్ల విగ్రహాలు పెడుతున్నారని, తెలంగాణపై ఏది పడితే అది మాట్లాడుతున్నారని మండిపడ్డారు. దీని వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని ఆమె ఆరోపించారు. తెలంగాణ అస్తిత్వాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఇప్పుడు మళ్లీ ఏర్పడిందని వ్యాఖ్యానించారు. తాము అధికారంలోకి ఖచ్చితంగా వస్తామని, అప్పుడు ఇక్కడ ఉన్న ఆంధ్రా నాయకుల విగ్రహాలను కూల్చేస్తామని సంచలన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో ఉన్న సెటిలర్లు అంతా తమ వాళ్లేనని కవిత స్పష్టం చేశారు. వారు ఇక్కడికి రావచ్చు, పోవచ్చు, రొయ్యలు అమ్ముకోవచ్చని, సినిమాల షూటింగ్‌లు చేసుకొని వెళ్లవచ్చని ఆమె సూచించారు. కానీ, సెక్రటేరియట్ లో ఏపీ నాయకులు గరిటె తిప్పుతామంటే మాత్రం ఊరుకోబోమని హెచ్చరించారు. “మేము టీఆర్ఎస్ రెండు పాయింట్ సున్నా అని గుర్తు పెట్టుకోండి. మా విధానాల్లో వేలు పెడతాం.. మా అస్తిత్వాన్ని దెబ్బకొడతామంటే ఊరుకునే ప్రసక్తే లేదు“ అని ఆమె తేల్చి చెప్పారు. మరోవైపు ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తెలంగాణ పర్యటన రాష్ట్రంలో రాజకీయ వేడిని పెంచుతోంది. మంగళవారం తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా.. తెలంగాణ నవ నిర్మాణ సభ పేరుతో జనసేన నేతలతో పవన్ కల్యాణ్ సమావేశం నిర్వహిస్తున్న క్రమంలో కవిత ఘాటైన వ్యాఖ్యలు చేశారు. “పవన్ కల్యాణ్.. ముందు మీ సెక్రటేరియట్ లోకి నీళ్లు రాకుండా చూసుకోండి. ఆ తర్వాత తెలంగాణలో నవ నిర్మాణ సభ పెట్టుకోండి“ అని ఎద్దేవా చేశారు. మూతి పళ్లు రాలుతాయని తీవ్ర స్థాయిలో హెచ్చరించారు. గతంలో ఒకసారి పెట్టుకుంటే తెలంగాణ తెచ్చుకున్నామని, మళ్లీ తమ జోలికొస్తే మూతి పళ్లు రాలుతాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆంధ్రాలో రాజధాని కట్టడం చేతకాకే ఇక్కడ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని, తెలంగాణలో ఏపీ ఏజెంట్ సీఎంగా ఉండటంతో నాటకాలు ఆడుతున్నారని కవిత ధ్వజమెత్తారు.



# తెలంగాణ ప్రజలకు కేసీఆర్ శుభాకాంక్షలు!

**రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గులాబీ బాస్ సందేశం**

**హైదరాబాద్, జూన్ 1:** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మాజీ ముఖ్యమంత్రి, భారత రాష్ట్ర సమితి అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు రాష్ట్ర ప్రజలకు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలంగాణ బిడ్డలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర సాధన పోరాటంలో అసువులు బాసిన అమరవీరుల త్యాగాలను స్మరించుకున్న కేసీఆర్ వారికి ఘనంగా నివాళులు అర్పించారు. తెలంగాణ ప్రజల మీద దశాబ్దాల పాటు సాగిన అణచివేతపై పోరాడి, అనేక అవాంతరాలను అధిగమించి, శాంతియుతమైన పార్లమెంటరీ పంథాలో, ప్రజాస్వామ్యయుతంగా కొట్లాడి స్వరాష్ట్రాన్ని సాధించుకున్నామని కేసీఆర్ తెలిపారు. ఉమ్మడి పాలనలో తీవ్ర వివక్షకు గురై, దిక్కుతోచని స్థితిలో ఉన్న తెలంగాణను స్వయం పాలనలో ఒక దిక్సూచిగా మార్చుకున్నామని, పరిపాలన చేతకాదు అని విమర్శించిన నోళ్లు మూతపడేలా ప్రగతి పాలనను అందించామని గులాబీ అధినేత గుర్తు చేశారు. ప్రగతికి చిరునామాగా మారిన తెలంగాణ అస్తిత్వం తిరిగి మరోసారి ప్రమాదంలో పడకుండా అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ సమాజాన్ని ఈ సందర్భంగా కేసీఆర్ హెచ్చరించారు. ప్రతీప శక్తుల నుండి తెలంగాణను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిదని కేసీఆర్ సూచించారు. తెలంగాణకు బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ రక్షణ కవచంగా నిలుస్తుందని కేసీఆర్ పునరుద్ఘాటించారు. స్వరాష్ట్ర సాధనలోనూ, ఆ తర్వాతి పదేండ్ల పునర్నిర్మాణంలోనూ చూపిన స్ఫూర్తిని నిరంతరం కొనసాగించాలని కోరిన ఆయన.. అన్ని వర్గాల ప్రజల జీవన ప్రమాణాలు మరింత గుణాత్మకంగా పెరిగే దిశగా పాలనా ప్రాధాన్యతలను ఎంచుకోవాలని సూచించారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని చిత్తశుద్ధితో అమలు చేస్తూ, వారిలో విశ్వాసం నింపాల్సిన బాధ్యత ప్రస్తుత పాలకులపై ఉందని కేసీఆర్ మరోసారి స్పష్టం చేశారు. తెలంగాణ రైతన్న సంక్షేమం, వ్యవసాయాభివృద్ధి నిరంతరం కొనసాగించాల్సిన బాధ్యతను పాలకులు విస్మరించకూడదని హితవు పలికారు. తెలంగాణ రాష్ట్రం నిరంతరం ప్రగతి పథంలో దూసుకుపోవాలని, పచ్చని పాడి పంటలతో వర్ధిల్లాలని కేసీఆర్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆకాంక్షించారు. రైతాంగం, శ్రమజీవులు, సబ్బండ వర్గాలు, సకల జనుల జీవితాలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకుంటున్నట్లు కేసీఆర్ పేర్కొన్నారు.

# ఆన్ లైన్ లోనే టీజీపీఎస్సీ పరీక్షలు!


**గంట ముందే ప్రశ్నాపత్రం తయారీ.. లీకేజీలకు చెక్**

**నిరుద్యోగులకు పెద్ద శుభవార్త చెప్పిన చైర్మన్**

**ఆర్థిక శాఖ నుంచి 3,800 పోస్టులకు అనుమతి**

**మూడు నెలలకోసారి మీడియాతో మాట్లాడుతామన్న బుర్రా**

**హైదరాబాద్, జూన్ 1:** తెలంగాణలోని నిరుద్యోగులకు టీజీపీఎస్సీ చైర్మన్ బుర్రా వెంకటేశం ఒక పెద్ద శుభవార్త చెప్పారు. ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో వేగం పెంచడంతో పాటు ఎలాంటి అవకతవకలకు తావులేకుండా సరికొత్త మార్పులు తీసుకువస్తున్నట్లు ఆయన ప్రకటించారు. నిరుద్యోగుల్లో నమ్మకం కలిగించేలా పలు కీలక నిర్ణయాలను వెల్లడించారు. తమది చాలా క్లిష్టమైన ఉద్యోగమని, అందరినీ మెప్పించడం సాధ్యం కాదని బుర్రా వెంకటేశం అన్నారు. హైదరాబాద్ లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. అందరికీ ఉద్యోగాలు ఇవ్వడం ఎప్పటికీ సాధ్యం కాదని, టీజీపీఎస్సీపై అసత్యాలు ప్రచారం చేసేవారు ఎప్పుడూ ఉంటారని స్పష్టం చేశారు. ఈ నెలలో 5 నుంచి 6 నోటిఫికేషన్లు విడుదల చేస్తామని చెప్పారు. ప్రభుత్వం నుంచి ప్రస్తుతం 3,800 ఉద్యోగ పోస్టుల భర్తీకి అనుమతులు వచ్చాయని చైర్మన్ తెలిపారు. అటవీ శాఖలో 3,093 పోస్టులను భర్తీ చేస్తామన్నారు. ఇందులో 1,393 ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ పోస్టులు ఉన్నాయని వెల్లడించారు. ప్రస్తుతం 28 రకాల పోస్టులకు ఒక్కో ఖాళీ ఉందని, ఇంకో 25 రకాల పోస్టుల్లో 5 కంటే తక్కువ ఖాళీలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ పోస్టుల భర్తీ కోసం ఇకపై క్రమం తప్పకుండా రెగ్యులర్‌గా నోటిఫికేషన్లు విడుదల చేస్తామన్నారు. ఇందులో భాగంగా ప్రతి నెల సగటున రెండు, మూడు నోటిఫికేషన్లు ఇస్తామని, జూన్ 2న మూడు కొత్త నోటిఫికేషన్లను విడుదల చేస్తున్నామని ఆయన ప్రకటించారు. ఉద్యోగ నియామక ప్రక్రియ ఏది ప్రారంభించినా, దాన్ని గరిష్టంగా ఒక ఏడాది లోపే పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు బుర్రా వెంకటేశం స్పష్టం చేశారు. ఇకపై నిర్వహించే నియామక పరీక్షలన్నీ పూర్తిగా కంప్యూటర్ బేస్డ్ (ఆన్ లైన్) మోడ్ లోనే జరుగుతాయని తెలిపారు. దీనివల్ల పేపర్ లీకేజీలకు అవకాశం ఉండదని, పరీక్ష పేపర్ ను ముందే తయారు చేయడం అనేది ఇకపై ఉండదని చెప్పారు. వీలైతే అభ్యర్థులు పరీక్ష రాసిన వెంటనే ఎన్ని ప్రశ్నలకు సరైన సమాధానాలు రాశారో కూడా తెలిసిపోయేలా సాంకేతికతను తీసుకువస్తున్నట్లు హింట్ ఇచ్చారు. ఓఎంఆర్ పద్ధతిలో పరీక్షల నిర్వహణ చాలా క్లిష్టమైనదని, అందుకే కంప్యూటర్ బేస్డ్ పరీక్షల నిర్వహణే ఉత్తమమైందని అభిప్రాయపడ్డారు. ఈ విధానంలో పరీక్షకు గంట ముందు కూడా ప్రశ్నాపత్రం రూపొందించవచ్చని స్పష్టం చేశారు. టీజీపీఎస్సీ పరీక్షలన్నీ కంప్యూటర్ బేస్డ్ విధానంలో నిర్వహించే దిశగా వెళ్తున్నామన్నారు. ఉద్యోగ నియామకాల్లో మొదట నోటిఫికేషన్, తర్వాత పరీక్ష, ఆపై మెరిట్ లిస్ట్, చివరగా సెలక్షన్ లిస్ట్ అనే పారదర్శక విధానాన్ని ఖచ్చితంగా పాటిస్తామన్నారు. ఇదే సమయంలో ఆయన ఒక ప్రాధాన్యత గల విషయాన్ని గుర్తుచేశారు. దరఖాస్తు చేసుకున్న వారందరికీ ఉద్యోగం ఇవ్వడం సాధ్యం కాదని, కేవలం 0.1 శాతం మందికి మాత్రమే ఉద్యోగాలు లభిస్తాయని అన్నారు.



# తెలంగాణ మేధావులు ఆలోచించాలి!

తెలంగాణ ఆవిర్భావంపై మేధావులు ఆత్మవిమర్శ చేసుకోవాలి. ఆవిర్భావం తరవాత తెలంగాణ లక్ష్యాలను సాధించిందా అన్నది లెక్కలు వేయాలి. ఉమ్మడి ఎపిలో ఉన్న పరిస్థితులకన్నా ఇప్పుడు ఉభయ తెలుగు రాష్ట్రాల్లో కొత్తగా సాధించిన పురోగతి అంటూ ఏమీ లేదు. నీళ్లు, నిధులు, నియామకాలు అన్న ట్యాగ్ లైన్ కట్టుతప్పింది. నీళ్లు లేవు. నిధులు, నియామకాలు మాత్రం పాలక పార్టీలకు చేరాయి. మృత్యువు నోట్లో తలకాయ పెట్టి తెలంగాణ తెచ్చానన్న కెసిఆర్ కుటుంబం బాగుపడింది. ఆయనను నమ్ముకుని నడిచిన వారు బాగుపడ్డారు. తరవాత కాంగ్రెస్ అధికారం చేపట్టాక ఇప్పుడు, ఆ పార్టీ నేతలు బాగు పడ్డారు. వారిలో కొందరికి పదవులు వచ్చాయి. కానీ కోరుకున్న తెలంగాణ మాత్రం సాకారం కాలేదు. ప్రొఫెసర్ కోదండరామ్ లాంటి వారు మౌనం దాల్చారు. ఆయన ఓ ఎమ్మెల్సీ పదవితో పెదవి విప్పడం లేదు. ఇప్పుడు మేధావులు మరోమారు గళం విప్పాల్సిన సమయమిది. ఎందుకంటే జనం కోరుకుని త్యాగాలు చేస్తే, రాజకీయ నాయకులు అధికారం అనుభవిస్తున్నారు. పదవులు చేపట్టారు. అంతే తప్ప మరోటి కాదన్నది నగ్న సత్యం. అన్నింటికి మించి తెలంగాణ అప్పులపాలయ్యింది. లక్షల కోట్లు అప్పులు చేసి సాధించింది శూన్యం. రాజకీయ నాయకులు, కాంట్రాక్టర్లు మాత్రమే బాగుపడ్డారు. అప్పులు తీర్చే మార్గం కనపడడం లేదు. సంక్షేమం పేరిట చేస్తున్న కిలో రూపాయి బియ్యం, ఉచిత బస్సు, ఉచిత గ్యాస్, ఉచిత కరెంట్ మాత్రమే అభివృద్ధి కాదు. దీంతో అభివృద్ధి చేశామని చెప్పుకుంటే సరిపోదు. సంక్షేమ హాస్టళ్లు దినదినగండంగా సాగుతున్నాయి. విద్య, వైద్య రంగంలో అభివృద్ధి జరగడం లేదు. ప్రవైటు విద్యారంగం, వైద్యరంగం మాఫియాలా తయారయ్యింది. ఇవన్నీ పెద్ద సమస్యలే. వీటిని పరిష్కరించడం లేదు. అటు ఎపి కూడా అప్పుల్లో కూరుకు పోయింది. అమరావతి నిర్మాణం ప్రహసనంఅ సాగుతోంది. పోలవరం అంచనాలు పెంచుకుంటూ దోచుకుంటున్నారు. తెలంగాణలో కాలేశ్వరం లాంటి భారీ ప్రాజెక్ట్ చేపట్టి దోపిడీకి గురి చేశారు. భూములు మాయం అవుతున్నాయి. ఇసుక మాఫియా, మట్టి మాఫియా, గ్రనూట్ మాఫియాలు చెలరేగుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా పెద్దగా అభివృద్ధి పనులు చేయలేక పోతోంది. నిష్పాక్షికంగా గమనిస్తే ప్రభుత్వపరంగా తీసుకోవాల్సిన చర్యలు అనేకం ఉన్నాయి. ముందుగా ప్రభుత్వంలో సమన్వయం, జవాబుదారీతనం పెంపొందించాలి. అదే సమయంలో ప్రభుత్వంలో వివిధ స్థాయి-ల్లో అవినీతి పెచ్చరిల్లుతోంది. ప్రభుత్వ యంత్రాంగంలో అవినీతిని తగ్గించడానికి తక్షణ చర్యలు తీసుకోవాలి. ఉద్యోగులు లంచం ముట్టనిదే ఫైలు కదల్చడం లేదు. మంత్రుల తీరు కూడా ఎవరికి వారే యమునా తీరే అన్నట్టుగా ఉంటోంది. తెలంగాణ ఏర్పడిన తర్వాత కూడా తొమ్మిదిన్నరేళ్ల కేసీఆర్ పాలనను ప్రజలు చూశారు. అప్పుడు అధికారం అంతా ఆయన చుట్టూనే కేంద్రీకృతం అయి ఉండేది. ప్రభుత్వం అంటే కేసీఆర్, కేసీఆర్ అంటే ప్రభుత్వం అన్న అభిప్రాయం ప్రచారం చేశారు. అభివృద్ధి పేరుతో నయవంచన చేశారు. చెరువుల బాగుపడకున్నా, ఇంటింటికీ నల్లారాకున్నా ఊదరగొట్టారు. కాళేశ్వరం పేరుతో లక్ష ఎకరాలని నమ్మించారు. ఇవన్నీ ఎత్తి చూపి అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి కూడా పెద్దగా ప్రభావం చూపట్టలేకపోతున్నారు. ఫ్యూచర్ సిటీ పేరుతో ఆర్భాటం చేస్తున్నారు. 2029లో జరిగే ఎన్నికల తర్వాత కూడా తానే ముఖ్యమంత్రిగా ఉంటానని... పదిన్నరేళ్లు సీఎంగా పనిచేసి రికార్డు సృష్టిస్తానని రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఇది ఆషామాషీ వ్యవహారం కాదు. ఇది ప్రజల చేతుల్లో ఉన్న నిర్ణయం. తెలంగాణలో గణనీయమైన మార్పు చేఇస, ప్రల జీవితాలు మర్చగలిగిన నాడే ప్రజలు మరోమారు అధికారం కోసం ఆలోచిస్తారు. వచ్చే ఎన్నికల తర్వాత కూడా తానే ముఖ్యమంత్రి అని రేవంత్‌రెడ్డి ప్రకటించుకున్న రేవంత్ రెడ్డి అందుకు అనుగుణంగా తెలంగాన ప్రజల జీవితాల్లో ఏ మార్పు తీసుకుని వచ్చారో ఆత్మపరిశీలన చేసుకోవాలి. ఇప్పటికీ మంత్రి పదవుల కోసం చాలామంది వెంపర్లాడుతున్నారు. ప్రస్తుతానికి కోమటిరెడ్డి రాజగోపాలరెడ్డి ఒక్కరే బయటపడ్డారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధించినంత మాత్రాన సార్వత్రిక ఎన్నికల్లోనూ ఇవే ఫలితాలు పునరావృతం అవుతాయని భావించడానికి లేదు. ఇప్పటికే రెండున్నరేళ్లు గడుస్తోంది. ఈ క్రమంలో తెలంగాణ పురోగతికి సంబంధించి కీలక నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంది. ఉద్యోగ క్యాలెండర్ ప్రకటిస్తామని ప్రకటించలేదు. కొత్తగా ఉద్యోగాల కల్పనకు గట్టి చర్యలు తీసుకోవాలి. సాగు, తాగునీటి సమస్యలు పరిష్కరించేందుకు పెద్ద ఎత్తు చర్యలు తీసుకోవాలి. ధాన్యం కొనుగోళ్ల ప్రహసనం లేకుండా చేయగలగాలి. ఉద్యమకారులకు న్యాయం చేస్తామని చెప్పినా ఇప్పటికీ అతీగతీ లేదు. ఇప్పుడు కేశవరావు కమిటీ ఏం చేస్తుందో చూడాలి. 2029లో జమిలి ఎన్నికలు వస్తాయని చెబుతున్నారు. ప్రభుత్వం పట్ల ప్రజల్లో వ్యతిరేకత ఏర్పడకుండా చూసుకోవాలంటే అనేక పనులు చేయాల్సి ఉంది. ఇప్పటికే రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందన్న అభిప్రాయం ప్రచారం అవుతోంది. రాజకీయ వర్గాల్లో బలంగా వ్యాపించిన తరుణంలో దీనిపై ఆత్మవిమర్శ చేసుకోవాలి. ఇచ్చిన హామీలు, అమలు చేస్తున్నామా లేదా అన్నది చూడాలి. మరోవైపు కాంగ్రెస్‌లో సీనియర్లం అని భావిస్తున్న వాళ్లు రేవంత్‌రెడ్డి నాయకత్వాన్ని ఇప్పటికీ అంగీకరించడం లేదు. కాంగ్రెస్ పార్టీ పరిస్థితి ఎవరికి వారే యమునా తీరే అన్నట్టుగా సాగుతోంది. ఇవన్నీ అధిగమించి తెలంగాణ అభివృద్ధికి నడుం బిగిస్తే రేవంత్ రెడ్డి చరిత్రలో నిలుస్తారు. లేకుంటే అందరిలాగే ఆయన చరిత్రా మట్టిలో కలుస్తుంది. ఇవన్ఈన గమనించి కూడా మేధావి వర్గం మౌనంగా ఉంటోంది. వీటిపై గళం ఎత్తాలి. తెలంగాణ పునర్నిర్మాణం కోసం ముందుకు రావాలి. లేకుంటే మళ్లీ దగపడుతుందని గుర్తించాలి.

# పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్తతలు

■ ఆమెరికా దళాల దాడులతో మొదటికొచ్చిన వ్యవహారం



**వాషింగ్టన్, జూన్ 1:** శాంతి ఒప్పందం ఓ కొలిక్కి వచ్చిందనుకొనేలోపే పశ్చిమాసియా మళ్లీ పేలుళ్లతో దద్దరిల్లింది. అమెరికా దళాలు ఇరాన్ లోని గురుక్ నగరం, ఖేష్మ్ ద్వీపంలోని సైనిక లక్ష్యాలపై దాడులు చేశాయి. ఆత్మరక్షణ కోసం ఈ దాడులు చేపట్టినట్లు అమెరికా సెంట్రల్ కమాండ్ ఎక్స్ వేదికగా పోస్టు చేసింది. అంతర్జాతీయ జలాలపై ప్రయాణిస్తున్న తమ ఎంక్యూ1 డ్రోన్‌ను కూల్చివేయడం, ఇతర దుందుడుకు చర్యలకు ప్రతిస్పందనగానే తాము ఈ దాడి చేసినట్లు వెల్లడించింది. తమ దాడిలో ఇరాన్ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థ, గ్రౌండ్ స్టేషన్, రెండు అటాక్ డ్రోన్లు ధ్వంసమైనట్లు పేర్కొంది. వీటి నుంచి తమ యుద్ధ నౌకలకు ముప్పు పొంచి ఉన్నట్లు తెలిపింది. సిరిక్ ద్వీపంలోని టెలికామ్ టవర్స్‌పై అమెరికా దాడి చేసిందని ఇరాన్ ఐఆర్‌జీసీ వెల్లడించింది. దీనికి ప్రతిగా అగ్రరాజ్యం దాడికి వాడిన ఎయిర్‌బేస్‌ను తాము లక్ష్యంగా చేసుకొన్నామని ప్రకటించింది. ఐఆర్‌జీసీ ఏరోస్పేస్ ఫైటర్స్ ప్రతిదాడి చేశారని తెలిపింది. కానీ, ఏ బేస్‌పై దాడి చేశారో మాత్రం వెల్లడించలేదు. అయితే అంతకు కొన్ని గంటల ముందు కువైట్ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థ దాడులను గుర్తించి యాక్టివేట్ అయినట్లు వార్తలొచ్చాయి. హర్మూజ్‌ను నియంత్రించాలంటే ఇరాన్ ఖేష్మ్ మిసైల్ సిటీని కూడా ధ్వంసం చేయడం అమెరికాకు చాలా ముఖ్యం. ఇక్కడ అండర్‌గ్రౌండ్ సిటీలో యాంటీ షిప్ క్రూజ్ క్షిపణులు ఉన్నాయి. జలసంధిలోని నౌకలను లక్ష్యంగా చేసుకోవడం కోసం వీటిని వాడతారు. గడా 380, హెచ్‌వై-2 సిల్క్‌వార్మ్‌ను ఇరాన్ ఇక్కడ సిద్ధంగా ఉంచింది. ఇక బాలిస్టిక్ క్షిపణుల్లో 800 కిలోమీటర్ల రేంజ్ ఉన్న ఖియామ్-1, ఖైబర్ షెకన్, ఘద్ర, ఎమాద్ మిసైల్స్‌ను భద్రపర్చింది. వీటితోపాటు వేగంగా దాడి చేసే స్పీడ్‌బోట్స్, తీరప్రాంత క్షిపణి బ్యాటరీలు కూడా ఉన్నాయి.

# సుప్రీంకోర్టుకు కొత్తగా ఐదురుగు జడ్జిలు

సుప్రీంకోర్టుకు కొత్తగా ఐదురుగు జడ్జిలు

కేంద్రన్యాయశాఖ నోటిఫికేషన్ విడుదల



**న్యూఢిల్లీ, జూన్ 1:** సుప్రీం కోర్టులో ఐదుగురు కొత్త న్యాయమూర్తులను నియమించినట్లు కేంద్ర న్యాయశాఖ సోమవారం నోటిఫికేషన్ వెలువరించింది. ఈ జాబితాలో సీనియర్ న్యాయవాది వి మోహన, ప్రస్తుతం బాంబే హైకోర్టు సీజే జస్టిస్ చంద్రశేఖర్, ప్రస్తుత పంజాబ్ హరియాణా హైకోర్టు సీజే జస్టిస్ షీల్ నాగు,ప్రస్తుత మధ్యప్రదేశ్ హైకోర్టు సీజే జస్టిస్ సంజీవ్ సచ్‌దేవ్, జమ్మూకశ్మీర్ హైకోర్టు సీజే జస్టిస్ అరుణ్ పల్లి ఉన్నారు. ఇటీవలే సీజేఐ నేతృత్వంలోని కొలీజియం వీరి పేర్లను కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. వీరిలో వి. మోహన ఒక్కరే సీనియర్ న్యాయవాది. న్యాయవాది మోహన 1988లో కోయంబత్తూరు లా కాలేజీ నుంచి న్యాయశాస్త్ర పట్టా పొందారు. అయిదేళ్ల లా డిగ్రీ మొదటి బ్యాచ్ విద్యార్థి. సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాదులు ఇందు మల్హోత్రా, సీఎస్ వైద్యనాథన్‌ల వద్ద జూనియర్‌గా ఉన్నారు. 1996లో ఏఓఆర్ పరీక్ష పాసైన తర్వాత దిల్లీ హైకోర్టు, సుప్రీంకోర్టుల్లో స్వతంత్రంగా ప్రాక్టీస్ ప్రారంభించారు. వివిధ కేసుల్లో సీనియర్ న్యాయవాదులు కపిల్‌సిబల్, కె.కె.వేణుగోపాల్, పి.చిదంబరం, అరుణ్‌జైట్లీ, అంద్యార్జునలతో కలిసి పనిచేశారు. 2015 ఏప్రిల్ 23న సీనియర్ న్యాయవాది హోదా పొందారు. ఈమె చేరికతో సుప్రీం కోర్టులో మహిళా జడ్జిల సంఖ్య 2కు చేరినట్లయింది.

# నిరసనలకు సిద్ధం కండి..

నేను వస్తున్నా: కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు




**న్యూఢిల్లీ, జూన్ 1:** తాను జూన్ 6న భారత్‌కు రానున్నట్టు కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే సోమవారం తెలిపారు. పరీక్ష నిర్వహణ లోపాల నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలన్న డిమాండ్‌తో శాంతియుత నిరసన కార్యక్రమం చేపడతానని తెలిపారు. ఈ మేరకు సోషల్ మీడియాలో ఒక వీడియో రిలీజ్ చేశారు. ఢిల్లీలో చేపట్టనున్న ఈ నిరసనలో విద్యార్థులు, తన మద్దతుదారులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. 'మనందరం ఏకమయ్యేందుకు టైమ్ వచ్చింది. రాజ్యాంగం చూపించిన దారిలో ముందుకు సాగుతూ శాంతియుత మార్గంలో గొంతెత్తాలి. కేంద్ర మంత్రి రాజీనామా చేయాలి. కలిసికట్టుగా ముందడుగు వేస్తే వాళ్లు మన మాట వినకతప్పదు' అని చెప్పారు. 'జూన్ 6న ఢిల్లీకి వద్దామని అనుకుంటున్నాను. ఎయిర్‌పోర్టుకు మీరందరూ రావాలి. అక్కడి నుంచి మనం పార్లమెంటు స్ట్రీట్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి శాంతియుత నిరసన కార్యక్రమం కోసం అనుమతి తీసుకుందాం. జంతర్‌మంతర్ వద్ద ఈ నిరసన కార్యక్రమం చేపడదాము' అని చెప్పారు. పరీక్ష నిర్వహణలో లోపాలు, అవాంతరాల కారణంగా విద్యార్థులు ఆందోళనలో కూరుకుపోయారని అభిజీత్ అన్నారు. ప్రభుత్వం బాధ్యత తీసుకోవాలని స్పష్టం చేశారు. చీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియా చేసిన కాక్రోచ్ వ్యాఖ్యల నేపథ్యంలో పుట్టుకొచ్చిన కాక్రోచ్ జనత పార్టీ అనతి కాలంలో ఊహించని స్థాయిలో పాప్యులర్ అయిన విషయం తెలిసిందే. అయితే, ఫేక్, బోగస్ డిగ్రీలతో న్యాయవృత్తిలోకి ప్రవేశిస్తున్న కొందరిని ఉద్దేశించే తాను ఆ వ్యాఖ్యలు చేశానని చీఫ్ జస్టిస్ స్పష్టం చేశారు. తన వ్యాఖ్యలను వక్రీకరించారని అన్నారు. ఇక జాతీయ భద్రతా కారణాల రీత్యా కాక్రోచ్ జనతా పార్టీ ఎక్స్ అకౌంట్‌ను కేంద్రం స్తంభింపజేసింది. దీన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై ప్రస్తుతం ఢిల్లీ హైకోర్టు విచారణ చేట్టింది.

# కాంట్రాక్టర్లకు నితిన్ గడ్కరీ వార్నింగ్



**న్యూఢిల్లీ, జూన్ 1:** జాతీయ రహదారుల నిర్మాణంలో నాణ్యత లోపిస్తే సహించేది లేదని కాంట్రాక్టర్లకు కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ గట్టిగా హెచ్చరించారు. సోమవారం న్యూఢిల్లీలో జాతీయ రహదారుల నిర్వహణపై కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. సోషల్ మీడియా, పత్రికల్లో వచ్చిన ప్రజల ఫిర్యాదుల ఆధారంగా కేంద్ర ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టింది. అందులో భాగంగా మంత్రి గడ్కరీ అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. ఆంధ్రప్రదేశ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లోని జాతీయ రహదారుల నాణ్యతపై ఈ సందర్భంగా కేంద్ర మంత్రి గడ్కరీ ప్రత్యేకంగా చర్చించారు.ఆంధ్రప్రదేశ్‌లో 8,512 కిలోమీటర్ల జాతీయ రహదారుల నెట్‌వర్క్‌పై నితిన్ గడ్కరీ కీలక ఆదేశాలు జారీ చేశారు. వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో రోడ్డు భద్రతపై ముందస్తు చర్యలు చేపట్టాలని ఉన్నతాధికారులకు మంత్రి స్పష్టం చేశారు. ప్రమాదాలు జరిగే ప్రాంతాల గుర్తించి.. తక్షణమే నివారణ చర్యలకు ఉపక్రమించాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. ఆధునిక సాంకేతికతను వినియోగించి రహదారుల మన్నికను మరింత పెంచాలని అధికారులకు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ సూచించారు.

# యువకుల మధ్య గొడవ

యువతిని కారుతో ఢీకొని చంపిన దుండగులు

**చెన్నై, జూన్ 1:** ఓ బార్‌లో రెండు వర్గాల మధ్య జరిగిన గొడవ 18 ఏళ్ల యువతి ప్రాణం తీసింది. ఈ ఘటన చెన్నై నగరంలో చోటుచేసుకుంది. నిందితులైన బాలమురుగన్ (21), జోశ్వ (19), కిషోర్ కుమార్ (19) లను పోలీసులు అరెస్టు చేశారు. మృతురాలు విల్లుపురం జిల్లాలో నివసిస్తున్న శ్రీలంక శరణార్థి యాన్సీ (18)గా గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... విల్లుపూరం జిల్లాలో నివాసం ఉండే యాన్సీ, ఆమె స్నేహితులు చెన్నైలోని ఓ ప్రైవేట్ బార్‌కి వెళ్లారు. అక్కడ యాన్సీ గ్రూప్ డ్యాన్స్ చేస్తుండగా.. అక్కడే ఉన్న మరో పురుషుల బృందం వాగ్వాదం పెట్టుకుంది. చిన్నపాటి గొడవ చిలికి చిలికి పెద్ద ఘర్షణగా మారింది. ఈ క్రమంలోనే బౌన్సర్లు జోక్యం చేసుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ఇరు వర్గాలకు సర్ది చెప్పి బయటకు పంపించారు. ఆర్ బయట వెళ్లిన తర్వాత కూడా వారి మధ్య మరోసారి వివాదం చోటుచేసుకుంది. బౌన్సర్లు కూడా మరోసారి రంగంలోకి దిగి రెండు వర్గాలను అక్కడి నుంచి వెళ్లిపోమని కోరారు. దీంతో యాన్సీ, తన స్నేహితురాలితో కలిసి ద్విచక్ర వాహనంపై తన నివాసానికి బయలుదేరింది. మార్గం మధ్యలో వారి బైక్‌ను ప్రత్యర్థులు కారుతో ఢీకొట్టారు. అయితే యాన్సీ స్నేహితులు కారుపై రాళ్లు విసరడంతోనే ..వారు ఢీకొట్టారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఘటనలో తీవ్రంగా గాయపడిన యాన్సీ అక్కడికక్కడే మృతి చెందగా.. ఆమె స్నేహితురాలు తీవ్రంగా గాయపడింది. నిందితులను కఠిన శిక్ష విధించాలని మృతురాలి కుటుంబం కోరింది. 18 ఏళ్లలోపు వారిని బార్‌లోకి అనుమతించినందుకు అధికారులు ఆ ప్రైవేట్ బార్‌ను సీజ్ చేశారు. పరారీలో ఉన్న మిగిలిన నిందితుల కోసం గాలింపు చేపట్టేందుకు ప్రత్యేక పోలీసు బృందాన్ని ఏర్పాటు చేశారు.

# సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ ఆత్మహత్య

అదనపు కట్నం వేధింపులే అంటున్న కుటుంబ సభ్యులు

**లక్నో, జూన్ 1:** పెళ్లైన రెండేళ్లకే సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ అనుమానాస్పద స్థితిలో మరణించిన సంఘటన బిహార్‌లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. లఖ్‌నవూకు చెందిన సాగర్ రాజ్‌పుత్‌కు 2024లో కాన్పూర్‌కు చెందిన మాన్సితో పెళ్లయింది. మాన్సి తల్లిదండ్రులు వరకట్నం కింద 7 లక్షల నగదు, ఇంటి సామాన్లు, ఇతర బహుమతులు ఇచ్చారు. కొంతకాలం వీరి కాపురం బాగానే సాగింది. ఇద్దరూ సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లుగా స్థానికంగా మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. సాగర్‌కు ఇన్‌స్టాలో 8 లక్షల మంది ఫాలోవర్స్ ఉన్నారు. భార్యాభర్తలిద్దరూ కలిసి వీడియోలు చేసే వారు. ఏమైందో ఏమో తెలీదు కానీ, మాన్సి అత్తింట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కూతురి మరణంపై మాన్సి తల్లిదండ్రులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అదనపు కట్నం కోసం తమ కూతురిని చంపి, ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో.. 'పెళ్లి సమయంలో వరకట్నం కింద 7 లక్షల నగదు, ఇంటి సామాన్లు, ఇతర బహుమతులు ఇచ్చాం. అయినా వాళ్లకు సంతృప్తి కలగలేదు. అదనపు కట్నం కోసం నా కూతురిని హింసిస్తున్నారు. కారు కావాలని అడుగుతున్నారు. తక్కువ కట్నం తెచ్చిందని అంటూ మాన్సిని మానసికంగా, శారీరకంగా వేధింపులకు గురిచేస్తున్నారు'.. వేధింపుల గురించి మాతో చెప్పుకుని మాన్సి చాలా ఏడ్చేది. మాన్సి అత్తింటి వారికి సర్ది చెప్పటం కోసం పలుమార్లు లఖ్‌నవూ వెళ్లి వచ్చాము. మా కూతురు ఆత్మహత్య చేసుకుని చనిపోయిందని శనివారం ఫోన్ కాల్ వచ్చింది. మా కూతురిది ముమ్మాటికీ హత్యే. మాన్సిని హత్య చేసి, ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారు' అని అన్నారు. పోలీసులు సాగర్‌తో పాటు మరో ఐదుగురిపై వరకట్న వేధింపుల కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.



# పవన్ కల్యాణ్‌కు పోలీసుల షాక్

**నేటి 'నవనిర్మాణ సభ'కు అనుమతి నిరాకరణ!**

**హైదరాబాద్, జూన్ 1:** జనసేనాని,ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు తెలంగాణ పోలీసులు భారీ షాక్ ఇచ్చారు. హైదరాబాద్‌లో మంగళవారం తలపెట్టిన జనసేన నవనిర్మాణ సభకు పోలీసులు అనుమతి నిరాకరించారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు, శాంతిభద్రతల దృష్ట్యా జనసేన సభకు అనుమతి ఇవ్వలేమని స్పష్టం చేశారు. ఈ క్రమంలో కోర్టును ఆశ్రయించారు జనసేన నేతలు. నవనిర్మాణ సభకు కోర్టులో అనుమతి లభిస్తుందా లేదా అన్న ఉత్కంఠ నెలకొంది. జనసేన నేత మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. తాము సభ పెట్టట్లేదని, సమావేశం నిర్వహించుకుంటున్నామని చెప్పారు. కన్వెన్షన్ సెంటర్లలో కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. ఈ సమావేశంపై పోలీసులకు సమాచారం ఇస్తే సరిపోతుంది.. అనుమతి ఎందుకు తీసుకోవాలని ప్రశ్నించారు. సరైన కారణాలు చెప్పకుండా పోలీసులు అనుమతి నిరాకరించారని, సమావేశం అనుమతి కోసం కోర్టును ఆశ్రయించామని చెప్పారు. అయితే.. జనసేన సభను అటు అధికార కాంగ్రెస్, విపక్షాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. జనసేన సభను ఉద్దేశించి ఘాటైన వ్యాఖ్యలు చేశారు మంత్రి పొన్నం ప్రభాకర్. పవన్ కళ్యాణ్ తెలంగాణ ప్రజలకు క్షమాపణలు చెప్పిన తర్వాతే ఇక్కడ నవ నిర్మాణ సభ పెట్టుకోవాలని డిమాండ్ చేశారు. అనువణువునా తెలంగాణపై వ్యతిరేకతను నింపుకున్న పవన్... ఇప్పుడు తెలంగాణ అస్తిత్వాన్ని, ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా బీజేపీ ఎజెండాను మోస్తున్నారని మండిపడ్డారు. ఇదిలా ఉండగా.. పవన్ కళ్యాణ్ కు స్టాం÷-రగ్ వార్నింగ్ ఇచ్చారు టీఆర్ఎస్ చీఫ్ కవిత. పవన్ కళ్యాణ్ ముందు మీ సెక్రటేరియట్ లోకి నీళ్లు రాకుండా చూసుకోండి.. ఆ తర్వాత తెలంగాణ నవ నిర్మాణ సభ పెట్టుకోండని అన్నారు కవిత. టీఆర్ఎస్ 2.0తో పెట్టుకుంటే మూతి పళ్లు రాలుతాయని..ఒకసారి పెట్టుకుంటే తెలంగాణ తెచ్చుకున్నామని..మళ్లీ మా జోలికొస్తే మూతి పళ్లు రాలుతాయని అన్నారు కవిత. ఆంధ్రాలో రాజధాని కట్టడం చేతకాకే డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని మండిపడ్డారు కవిత. తెలంగాణలో ఏపీ ఏజెంట్ సీఎంగా ఉండటంతో డ్రామాలు చేస్తున్నారని అన్నారు.

# వైఎస్ విగ్రహ ధ్వంసం గొడ్డలి పార్టీ కుట్ర

**ఆపార్టీ కార్యకర్తతో చేయించి, కూటమిపై నెట్టే యత్నం**

**నంద్యాల ఘటనపై మంత్రి అనగాని ఘాటు విమర్శలు**

**అమరావతి, జూన్ 1:** నంద్యాలలో వైఎస్ విగ్రహం విధ్వంసం ఘటనపై మంత్రి అనగాని సత్యప్రసాద్ స్పందించారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. నంద్యాలలో వైఎస్ విగ్రహం తలకాయను గొడ్డలి పార్టీ కార్యకర్త జంబులయ్యతో తీయించి.. దాన్ని టీడీపీ మీద నెట్టే ప్రయత్నం చేశారని మండిపడ్డారు. జంబులయ్య భార్యకు మెప్మాలో గత ప్రభుత్వంలో ఉద్యోగం ఇచ్చారని.. నాటి వైసీపీ ఎమ్మెల్యేనే ఆ ఉద్యోగం ఇప్పించారని తెలిపారు. మనుషుల తలకాయలే తీసిన గొడ్డలి పార్టీ నేతలకు.. విగ్రహాల తలలు తీయడం ఓ లెక్క కాదన్నారు. విగ్రహం తలకాయను గొడ్డలి పార్టీ నేతలే తీయించడం.. మళ్లీ ధర్నాలు చేయడం ఆ పార్టీకే చెల్లిందంటూ దుయ్యబట్టారు. శవం, సింపతీ, స్టాట్యూ అనేది గొడ్డలి పార్టీ విధానమంటూ వ్యాఖ్యానించారు. వైఎస్ మరణంతో రాష్ట్ర వ్యాప్తంగా విగ్రహాలు పెట్టి రాజకీయం చేశారని.. ఇప్పుడు అదే విగ్రహాలను విధ్వంసం చేసి రాజకీయం చేస్తున్నారని మంత్రి విమర్శించారు. గతంలోనూ అంబేద్కర్ విగ్రహానికి నిప్పు పెట్టి తెలుగుదేశం పార్టీపై నెపం నెట్టే ప్రయత్నం చేశారన్నారు. నంద్యాలలో వైఎస్ విగ్రహం విషయంలో కుట్రలు బయటపడ్డాయి కాబట్టి... సాక్షిలో పెద్దగా కవరేజ్ ఇవ్వలేదని తెలిపారు. రాష్ట్రం అభివృద్ధి చెందకూడదని గొడ్డలి పార్టీ లక్ష్యంగా పెట్టుకుందని ఆరోపించారు. పెట్టుబడులు పెద్ద ఎత్తున వస్తుంటే.. డీఎస్సీలో తప్పిదాలు జరిగాయని ఆరోపణలు గుప్పించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అవినీతి వ్యవహారాలు బయటపడుతుండడంతో డైవర్షన్ రాజకీయాలకు పాల్పడే కుట్రలు చేస్తున్నారని అన్నారు. ఏడాది క్రితం జరిగిన డీఎస్సీ నిర్వహణకు సంబంధించి ఇప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. కుట్రలు పన్నడం, అసత్య ప్రచారం చేయడం గొడ్డలి పార్టీ డీఎన్ఏలోనే ఉందంటూ వ్యాఖ్యానించారు. జెన్-జీ, జెన్-అల్ఫా భవితకు అవసరమైన అభివృద్ధి చర్యలు చేపడుతున్నామని అనగాని తెలిపారు. ఎన్నో పెట్టుబడులు వస్తున్నాయని.. ఉద్యోగ అవకాశాలు అందుబాటులోకి వస్తున్నాయన్నారు. రాష్ట్ర ముఖచిత్రం మారుతోందని.. దీన్ని చూసి గొడ్డలి పార్టీ ఓర్వలేకపోతోందని విమర్శించారు. రాష్ట్రం అగ్రస్థానంలోకి వెళ్తున్నప్పుడు.. అనిశ్చితి సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ల్యాండ్‌స్కాం.. లిక్కర్ స్కాంలు బయటకొస్తుంటే గొడ్డలి పార్టీలో వణుకు పుడుతోందన్నారు. తానిచ్చే బిర్యానికి కార్యకర్తలు ఎదురు చూస్తూ ఉండాలనే ఆలోచన గొడ్డలి పార్టీ నాయకుడిదంటూ దుయ్యబట్టారు. ప్రజలు చక్కటి ఉపాధి, ఉద్యోగాలు, వ్యాపారాలు చేసుకుని మెరుగైన జీవితాన్ని పొందాలనేది తమ నాయకుడి ఆలోచన అని తెలిపారు. ఓ డీఎస్సీని అద్భుతంగా నిర్వహించి.. మళ్లీ ఇంకో డీఎస్సీని నిర్వహించు కునేందుకు సిద్ధమవుతుంటే.. కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. యువకులు నిర్వీర్యమైపోవాలనేది గొడ్డలి పార్టీ ఆలోచన అని.. యువతకు ఉద్యోగాలు కల్పించాలనేది కూటమి సంకల్పమని మంత్రి అనగాని సత్యప్రసాద్ స్పష్టం చేశారు.



# బటన్ నొక్కితే పైశాచిక ఆనందం

- స్వయంగా పేదలను కలిస్తే నిజమైన ఆనందం
- సుపరిపాలనను వెనక్కి లాగేందుకు గొడ్డలి పార్టీ కుతంత్రాలు
- తుని నియోజకవర్గం చామవరం 'పేదల సేవలో' సీఎం చంద్రబాబు




**తుని / కాకినాడ, జూన్ 1** ప్రతిపక్ష పార్టీ పేరు ఎక్కడా ప్రస్తావించకుండా..గొడ్డలి పార్టీ అని ప్రస్తావిస్తునే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని, మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి పాలనను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దుమ్మెత్తిపోశారు. కాకినాడ జిల్లా తుని నియోజకవర్గం చామవరం గ్రామంలో సోమవారం నిర్వహించిన 'పేదల సేవలో' కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు. కార్యక్రమానికి తగ్గట్టుగా ప్రజల మధ్యలో ఎక్కువ సేపు గడిపారు. పేదల కష్టాలు, వారి ప్రస్తుత జీవన స్థితిగతులను తెలుసుకునేందుకు ఎక్కువ ఆసక్తి చూపారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్లను సీఎం చంద్రబాబు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రాన్ని బాగు చేసేందుకు రాత్రింబవళ్ళు తాము పని చేస్తుంటే..గత పాలకులు మాత్రం విధ్వంసాన్ని కొనసాగిస్తున్నారని మండిపడ్డారు. అందుకే ప్రస్తుతం ఉన్న ప్రతిపక్షాన్ని గొడ్డలి పార్టీ అంటున్నాం అన్నారు. బాబాయి వివేకానంద రెడ్డిని హత్యచేసి గుండెపోటు అన్నారని, పోస్టు మార్టం తరువాత తెలిసింది గొడ్డలితో నరికి చంపారని..మా నాన్న చనిపోయారు, ఇప్పుడు చిన్నాన్నను కూడా చంపేశారని ఎక్కడికక్కడ డ్రామాలు ఆడారన్నారు. ఒక్క ఛాన్స్ అన్నారు..మోసం చేశారు. కోడికత్తి, గులకరాయి డ్రామాలు కూడా ఆడారన్నారు. సుపరి పాలన వైకుంఠపాళీ కాకూడదన్నదే మా విజ్ఞప్తి అంటూ..గత జగన్ ప్రభుత్వం, తమ 'కూటమి' పాలనలో వ్యత్యాసాలను వివరించే ప్రయత్నం చేశారు. గత పాలకులు విద్యా వ్యవస్థను నిర్లక్ష్యం చేశారని, ఆ అయిదేళ్ల పాలనలో ఒక్క టీచర్ పోస్టును కూడా భర్తీ చేయలేదన్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక 241 కేసులు వేసినా వాటిని పరిష్కరించి ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేశామని చెప్పుకొచ్చారు. గత పాలకులు జాబ్ క్యాలెండర్ అని దానిని ఎగ్గొట్టారు. మళ్లీ మా ప్రభుత్వం వచ్చాకే జాబ్ క్యాలెండర్ విడుదల చేశామని చెప్పారు. అత్యంత ప్రతిష్ఠంగా ఈ ఉద్యోగాల భర్తీ ప్రక్రియ చేపట్టాం. కంప్యూటర్ సిస్టమ్ ద్వారా ఎంపిక ప్రక్రియ చేపట్టామని తెలిపారు. 40 వేల ప్రశ్నలు, 25 రకాల ప్రశ్నా పత్రాలు వెరసి ఎక్కడా అక్రమాలు జరక్కుండా చూశామని..కానీ ఫ్రస్టేషన్‌లో ఉన్న వైసీపీ దానిని వివాదం చేసి రాజకీయ లబ్ధి పొందాలని ఆలోచన చేస్తోందని ఆరోపించారు.

వైసీపీ దీనిని వివాదం చేసి సమాజంలో అశాంతిని రేపేందుకు ప్రయత్నాలు చేసిందని, జాగ్రత్తగా ఉండబట్టే దీనికి గట్టిగా సమాధానం ఇవ్వగలిగామన్నారు. ప్రతిపక్షంలో పరామర్శలకు వెళ్తూ సొంత కార్యకర్త సింగయ్యను కారు కింద తొక్కి చంపేసి పొదల్లోకి విసిరేసి పోయారని, కడపకు చెందిన ఓ పాస్టర్‌ను పంపి హత్యాయత్నం డ్రామాలు ఆడారు. దానిని మాపై నెట్టేందుకు ప్రయత్నించారన్నారు. పాస్టర్ ప్రవీణ్ మద్యం తాగి మోటారు సైకిల్ నడుపుతూ ప్రమాదంలో చనిపోతే దానిని కూడా మాపై నెట్టడానికి ప్రయత్నాలు జరిగాయన్నారు. సీసీ కెమెరాల సాయంతో ఈ కుట్రను బట్టబయలు చేయగలిగామని చంద్రబాబు తెలిపారు. పవిత్ర ఆధ్యాత్మిక క్షేత్రం తిరుమలలోని కౌస్తుభం గెస్ట్ హౌస్ దగ్గర సాక్షి మీడియా మద్యం బాటిళ్లు తీసుకెళ్లి వేసి అపవిత్రం చేసేందుకు ప్రయత్నం చేశారు. భగవంతుడిని అప్రతిష్ట పాల్జేసేందుకు ప్రయత్నం చేసిన వారిని ఏమనాలని ప్రశ్నించారు. వారిది వేరే మతం కావచ్చు.. దానికి మేం తప్పు పట్టటం లేదు..కానీ కుట్రలతో హిందూ దేవాలయాలపై దాడులు అపవిత్రం చేయటం సరికాదని చంద్రబాబు హెచ్చరించారు. అందుకే ఎక్కడికక్కడ సీసీ కెమెరాలు పెట్టి వారిని పట్టుకుని ప్రజల ముందు నిలబెడతామని చెప్పారు. కడపలో పెద్ద దస్తగిరిని వైసీపీ వారే ఆస్తుల వివాదంలో హత్యచేసి టీడీపీ వారిపై నెట్టేందుకు ప్రయత్నం చేశారని, నంద్యాలలో రాజశేఖర రెడ్డి విగ్రహాన్ని ధ్వంసం చేసింది వైసీపీ కార్యకర్తే. అయినా మేం 20 నిముషాల్లో నిందితున్ని పట్టుకున్నామని చెప్పారు. వైసీపీ వాళ్లే చేశారు కాబట్టే సాక్షి పత్రికలో ఆ వార్తే రాయలేదని, కేవలం సానుభూతి పొందడానికే ఈ కుట్రపన్నారన్నారు. రాక్షసులు, దుర్మార్గులతో యుద్ధం చేస్తూనే సుపరిపాలన యజ్ఞం చేస్తున్నాం. కాకినాడలోనే వైసీపీ ఎమ్మెల్సీ దళితుడైన డ్రైవర్ ను చంపి డోర్ డెలివరీ చేశారు. కానీ వైసీపీ ఆ ఎమ్మెల్సీకి సన్మానాలు చేసింది. ఇన్ని కుట్రలకు కుతంత్రాలకు పాల్పడుతున్న వారి ఆటలు సాగనీయబోమని చంద్రబాబు హెచ్చరించారు. రాజకీయ పార్టీగా ఈ తంతును సరిచేసుకోవాల్సింది పోయి ఎదురు దాడి చేస్తున్నారని మండిపడ్డారు. ఈ తరహా ఘటనల్ని ప్రజలు గమనించాలని చంద్రబాబు కోరారు. రాజకీయాల్లో విలువలు చాలా ముఖ్యమని, హత్య చేసి డోర్ డెలివరీ చేసిన వ్యక్తిని కనీసం పార్టీ నుంచి సస్పెండు కూడా చేయకుండా వెనక తిప్పుకుంటున్నారని సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు.

**బటన్ నొక్కితే పైశాచిక ఆనందం..**

బటన్ నొక్కితే పైశాచిక ఆనందం ఉంటుంది తప్ప ప్రజలను కలిసి వారి కష్ట సుఖాలు తెలుసుకునే పరిస్థితి ఉండదని చంద్రబాబు అన్నారు. అందుకే ప్రతి నెలా 1వ తేదీన ప్రజలను నేరుగా కలుసుకుని పెన్షన్లు అందిస్తున్నామని చెప్పారు. "జూన్ 4వ తేదీ చరిత్రలో నిలిచిపోయే రోజని రాష్ట్రంలో విధ్వంసక పాలకుల నుంచి విముక్తి కలిగిన రోజు.. కూటమిగా మీ అందరి మద్దతుతో అధికారం చేపట్టిన రోజు. గత పాలన అంతా విధ్వంసకర పాలన, బహిరంగంగా నవ్వాలనుకున్నా ప్రజలంతా భయపడే పరిస్థితి..ప్రజలు సమావేశాల నుంచి వెళ్లి పోకుండా కందకాలు తవ్వి, ఫెన్సింగ్‌లు వేసి మరీ సమావేశాలు నిర్వహించే పరిస్థితి ఉండేది. మన ప్రభుత్వం ఏర్పడిన తొలి రోజు నుంచి పేదల కోసం పనిచేస్తున్నాం. దానికి నిదర్శనమే పింఛన్ల పెంపు. పేదరికం లేని సమాజం చూడాలనేది నా కల. పేదల కనీస అవసరాలు తీర్చాలని నేనూ ఎప్పుడూ భావిస్తాను. రూ.10 లక్షల కోట్ల అప్పులు, బకాయిలు ఉన్నా... తొలి నెల నుంచే పింఛన్లు పెంచి ఇచ్చాను. పెన్షన్లు ఒకేసారి రూ.1,000 పెంచి రూ.4 వేలు చేశాం. దివ్యాంగులకు రూ.6 వేలు చేశాం. ఆరోగ్య పెన్షన్లు రూ.10 వేలకు, రూ.15 వేలకు పెంచాం. 2024 జూలై నుంచి ఇప్పటి వరకు మొత్తం రూ.65,887 కోట్లు ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల రూపంలో అందించాం. ఏడాదికి దాదాపు రూ.32 వేల కోట్లు ఈ ఒక్క పథకానికే ఖర్చు పెడుతున్నాం. దేశంలోని మరే రాష్ట్రంలోనూ ఇంత పెద్ద మొత్తంలో, ఇంత ఎక్కువ మందికి పింఛన్లు ఇవ్వడం లేదు. బటన్ నొక్కితే పైశాచిక ఆనందం ఉంటుంది తప్ప ప్రజలను కలిసి వారి కష్ట సుఖాలు తెలుసుకునే పరిస్థితి ఉండదు. అందుకే ప్రతీ నెలా 1 తేదీన ప్రజలను నేరుగా కలుసుకుని పెన్షన్లు అందిస్తున్నాం. ఈ నెలలో రాష్ట్రంలో 62.34 లక్షల మందికి, రూ.2,729 కోట్లు పెన్షన్ల రూపంలో పంపిణీ చేస్తున్నాం. ఒకటీ రెండు నెలల పాటు ఏ కారణం చేత అయినా పెన్షన్లు తీసుకోకపోయినా మూడో నెల అన్నీ కలిపి ఇస్తున్నాం" అని సీఎం చంద్రబాబు తెలిపారు. "ఈ నెల కొత్తగా మరో 5,606 మందికి రూ.2.24 కోట్లు స్పౌజ్ పెన్షన్ల కోసం మంజూరు చేశాం. రాష్ట్రంలో చాలా మంది పేద కుటుంబాలకు 2 నుంచి 4 సంక్షేమ పథకాలు అందుతోన్నాయి. తల్లికి వందనం, స్త్రీశక్తి, అన్నదాత సుఖీభవ, ఆటోడ్రైవర్ సేవలో, మత్స్యకారుల సేవలో ఇలా వేర్వేరు పథకాలు వస్తున్నాయి. దివ్యాంగ శక్తి పేరిట దివ్యాంగులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తున్నాం. చేనేత కుటుంబాలకు 200 యూనిట్లు, పవర్ లూమ్స్‌కు 500 యూనిట్ల విద్యుత్ ఉచితంగా అందిస్తున్నాం. ఈ పథకాలన్నీ పేదల జీవన ప్రమాణాలు పెంచాలన్నదే కూటమి ప్రజాప్రభుత్వ లక్ష్యం. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనతో పాటు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కూడా కల్పించేలా చర్యలు చేపట్టాం. 23 నెలల్లో రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. వాటి ద్వారా 23 లక్షల ఉద్యోగాలు కూడా మన యువతకు వస్తాయి. మన రాష్ట్ర యువత ఎవరూ ఇతర ప్రాంతాలకు వలస వెళ్లాల్సిన అవసరం లేకుండా ప్రణాళికలు చేస్తున్నాం. కాకినాడ సమీపంలో గ్రీన్ అమ్మోనియో రూ.80 వేల కోట్లతో పరిశ్రమ ఏర్పాటు చేస్తోంది. తుని పక్కనే అనకాపల్లి వద్ద ఆర్సెలార్ మిట్టల్ ఓ స్టీల్ సిటీని ఏర్పాటు చేస్తోంది. విశాఖలో గూగుల్ డేటా సెంటర్ వస్తోంది. మన యువత ఈ అవకాశాలను వినియోగించుకోవాలని కోరుతున్నాం. పీఎం సేతు కింద యువతకు స్కిల్ డెవలప్‌మెంట్ చేస్తున్నాం ఏడాదికి 25 వేల మంది యువతకు శిక్షణను పీఎం సేతు కింద ఇస్తాం. విశాఖ స్టీల్ ప్లాంట్ కేంద్ర సహకారంతో తిరిగి పునరుద్ధరించాం. అలాగే విశాఖ రైల్వే జోన్ కల కూడా సాకారమైంది" అని సీఎం చంద్రబాబు తెలిపారు.

**పీ4లో భాగంగా మార్గదర్శులు బంగారు కుటుంబాలతో సంభాషించిన సీఎం**

పేదల జీవన ప్రమాణాలు పెంచటంతో పాటు ఆర్థిక అసమానతలు తొలగించేందుకే పీ4 కార్యక్రమాన్ని ప్రారంభించామని సీఎం చంద్రబాబు తెలిపారు. సమాజం లేకుండా మన అస్తిత్వం ఉండదు. ఆర్థికంగా పేదరికం లేని సమాజం రూపకల్పన కోసమే నేను పాటుపడుతున్నాను అన్నారు. వెయ్యి కోట్లో, లక్ష కోట్ల సంపద ఉన్నా మనుషులుగా మన అందరి జీవన విధానం ఒక్కటే. అందుకే ఆర్థిక అసమానతలు తొలగాలని ఆకాంక్షిస్తున్నాను అన్నారు. బంగారు కుటుంబాల్లో అంతా విద్యాధికులుగా, ఆదాయం ఆర్జించే వ్యక్తులుగా మారాలన్నదే తన ఆకాంక్ష అని, దీనికి అనుగుణంగా మార్గదర్శులు కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఆ కుటుంబాలను పైకి తీసుకువచ్చేలా చూడాలని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు కోరారు.

**ఓ దివ్యాంగ యువకుడిని ఆప్యాయంగా పలకరించిన సీఎం చంద్రబాబు..**

ముఖ్యమంత్రి స్వయంగా వచ్చి భుజంపై చేయి వేసి ఫోటో దిగటంతో ఓ దివ్యాంగ యువకుడు సంతోషంతో ఉప్పొంగి పోయాడు. మీరు అంటే అతనికి ఎంతో అభిమానమని ఆ యువకుడి తల్లిదండ్రులు ముఖ్యమంత్రి చంద్రబాబుకు తెలిపారు. ప్రభుత్వం తరపున ఆ దివ్యాంగ యువకుడికి సహకారం అందించాలని కాకినాడ జిల్లా కలెక్టర్ ను సీఎం చంద్రబాబు ఆదేశించారు. అనంతరం ప్రజా వేదిక సమీపంలో వివిధ ప్రభుత్వ శాఖలు ఏర్పాటు చేసిన స్టాళ్లను ముఖ్యమంత్రి చంద్రబాబు సందర్శించారు. తూర్పు గోదావరి జిల్లాలో వ్యవసాయ, ఉద్యాన శాఖల ద్వారా సాగవుతున్న పంటల గురించి సీఎం వివరాలు అడిగి తెలుసుకున్నారు. మైక్రో న్యూట్రియంట్స్ తో పాటు ప్రకృతి సేద్యం పెంచేందుకు కృషి చేయాలని సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేశారు.

# స్థానిక సంస్థల ఎన్నికలే లక్ష్యంగా వైసీపీ అడుగులు

**వరుస ప్రెస్‌మీట్లు.. లెక్కలతో విమర్శలు**

**కేడర్‌కు యుద్ధ సన్నాహాలు చేస్తున్న జగన్**

**గ్రామస్థాయి నుంచి పార్టీ శ్రేణుల సమీకరణ**

**(సమయం న్యూస్, అమరావతి)**

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ప్రతిపక్ష నేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి దూకుడు పెంచినట్లు కనిపిస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తీసుకున్న నిర్ణయాలు, అమలు చేస్తున్న విధానాలు, ఎన్నికల హామీల అమలు పరిస్థితులపై జగన్ వరుసగా స్పందిస్తూ రాజకీయంగా దాడి తీవ్రతను పెంచుతున్నారు. ప్రెస్‌మీట్లు, సమీక్ష సమావేశాలు, పార్టీ నేతలతో భేటీలు, సోషల్ మీడియా వేదికల ద్వారా ప్రభుత్వం పనితీరుపై ప్రశ్నలు సంధిస్తూ వైసీపీని మళ్లీ ప్రజల్లో చురుకుగా ఉంచే ప్రయత్నం చేస్తున్నట్లు రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

**వరుస ప్రెస్‌మీట్లు.. లెక్కలతో విమర్శలు**

ఇటీవలి కాలంలో జగన్ నిర్వహిస్తున్న మీడియా సమావేశాల్లో ప్రభుత్వ హామీలు, ఆర్థిక పరిస్థితి, రైతు సమస్యలు, మహిళా సంక్షేమ పథకాలు, ఉద్యోగాల భర్తీ, ధరల పెరుగుదల వంటి అంశాలపై గణాంకాలు, పాత ప్రకటనలు, ఎన్నికల హామీలను ప్రస్తావిస్తూ విమర్శలు గుప్పిస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఎంతవరకు అమలయ్యాయి? ఎన్నికల ముందు చెప్పింది ఏమిటి? ఇప్పుడు పరిస్థితి ఎలా ఉంది? అనే అంశాలను పోల్చుతూ ప్రజల్లో చర్చకు దారి తీసే ప్రయత్నం చేస్తున్నారని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.

**స్థానిక సంస్థల ఎన్నికలే లక్ష్యమా?**

రాజకీయంగా చూస్తే వైసీపీ దృష్టి ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికలపైనే కేంద్రీకృతమైందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. గ్రామ పంచాయతీలు, మండల పరిషత్‌లు, జిల్లా పరిషత్‌లు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో పార్టీ బలాన్ని మరోసారి నిరూపించుకోవాలన్న లక్ష్యంతో జగన్ కేడర్‌ను సమాయత్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రతి నియోజకవర్గంలో పార్టీ పరిస్థితిపై సమీక్షలు నిర్వహించడం, స్థానిక నాయకులకు బాధ్యతలు అప్పగించడం, కార్యకర్తల్లో ఆత్మవిశ్వాసం పెంచడం వంటి చర్యలు కూడా అదే వ్యూహంలో భాగంగా కనిపిస్తున్నాయి. 2024 ఎన్నికల ఫలితాల తర్వాత కొంత నిరాశలో ఉన్న పార్టీ శ్రేణులను మళ్లీ చైతన్యవంతం చేయడంపై జగన్ ప్రత్యేక దృష్టి పెట్టినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. "ప్రజల మధ్య ఉండాలి... ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలి... గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేయాలి" అనే సందేశాన్ని కార్యకర్తలకు ఇస్తున్నట్లు సమాచారం. స్థానిక సమస్యలపై పోరాటాలు, నిరసనలు, వినతిపత్రాలు, ప్రజా సమావేశాల ద్వారా కేడర్‌ను చురుకుగా ఉంచే ప్రయత్నం జరుగుతోందని అంటున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గణనీయమైన విజయాన్ని సాధించడం ద్వారా రాష్ట్ర రాజకీయాల్లో వైసీపీ ఇంకా ప్రధాన శక్తిగానే ఉందని నిరూపించుకోవాలని జగన్ భావిస్తున్నట్లు రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

స్థానిక ఎన్నికల ఫలితాలు భవిష్యత్ రాజకీయాలకు దిక్సూచిగా మారే అవకాశం ఉండటంతో ఈ ఎన్నికలను



వైసీపీ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంటోందని అభిప్రాయపడుతున్నారు.

**కూటమికి సవాల్**

ప్రభుత్వంపై నిరంతర విమర్శలు, కేడర్ సమీకరణ, స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహకాలు వంటి చర్యలతో జగన్ రాజకీయ ఒత్తిడి పెంచుతున్నారని పరిశీలకులు భావిస్తున్నారు. మరోవైపు అధికార కూటమి మాత్రం అభివృద్ధి, పాలనా కార్యక్రమాల ద్వారా ప్రజల్లోకి వెళ్లాలని చూస్తోంది. రాబోయే నెలల్లో స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో అధికార కూటమి - వైసీపీ మధ్య రాజకీయ పోరు మరింత ఉత్కంఠభరితంగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. "ప్రభుత్వాన్ని నిరంతరం ప్రశ్నిస్తూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆధిక్యం సాధించడమే జగన్ తాజా రాజకీయ వ్యూహంగా కనిపిస్తోంది."

# ఉమ్మడి మండల కేంద్రంలో వైభవంగా ఇందిరమ్మ ఇండ్ల గృహ ప్రవేశాలు

**కోటగిరి/పోతంగల్, జూన్ 01: (సమయం న్యూస్ ):** కోటగిరి - పోతంగల్ ఉమ్మడి మండల కేంద్రంలో లబ్ధిదారుల కల సాకారమైంది. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల గృహ ప్రవేశాల కార్యక్రమం సోమవారం స్థానికంగా అత్యంత వైభవంగా నిర్వహించారు. నూతనంగా నిర్మించిన గృహాల్లోకి లబ్ధిదారులు తమ కుటుంబ సభ్యులతో కలిసి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి, ఉత్సాహంగా అడుగుపెట్టారు. ఈ కార్యక్రమానికి స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు ముఖ్య అతిథులుగా హాజరై, రిబ్బన్ కట్ చేసి గృహ ప్రవేశాలను అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుపేదలకు నీడను



కల్పించాలనే ఉన్నత లక్ష్యంతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని ముమ్మరంగా ముందుకు తీసుకెళ్తోందని, ఎలాంటి ఒడిదొడుకులు లేకుండా పారదర్శకంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇండ్లను కేటాయించడం జరిగిందని వివరించారు. చాలా కాలంగా సొంత ఇల్లు లేక అద్దె ఇండ్లలో ఎన్నో ఇబ్బందులు పడ్డామని, ఈ రోజు తమ సొంత ఇంట్లోకి అడుగుపెట్టడం చాలా ఆనందంగా ఉందని లబ్ధిదారులు ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్, ఎంపీటీసీలు, మండల పరిషత్ అధికారులు, రెవెన్యూ సిబ్బంది, రాజకీయ నాయకులు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కోటగిరి పీఎస్ పరిధిలో అంతర్రాష్ట్ర పశువుల దొంగల ముఠా అరెస్ట్

**వివరాలు వెల్లడించిన ఏసీపీ**

**కోటగిరి, జూన్ 01 (సమయం న్యూస్ ) :** కోటగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో పశువుల దొంగతనాలకు పాల్పడుతున్న ఐదుగురు అంతర్రాష్ట్ర దొంగలను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ శ్రీనివాస్ రావు విలేకరుల సమావేశంలో తెలియజేశారు. సోమవారం రోజున మధ్యాహ్నం ఎన్టీఆర్ చౌరస్తా వద్ద వాహనాల తనిఖీ చేస్తుండగా పోతంగల్ వైపు నుండి రెండు బొలెరో వాహనాలు, ఒక పల్సర్ బైక్‌పై వస్తూ పోలీసులను చూసి పారిపోవడానికి ప్రయత్నించిన మహారాష్ట్ర మరియు నిజామాబాద్ జిల్లాలకు చెందిన ఫరీద్ నవాట్ సాట్ ఖురేషి A-4), అస్లాం ఖురేషి A-5), ఇలియాస్ నవాట్ ఖురేషి (A-6), షేక్ రఫీక్ A-7), మరియు ముహమ్మద్ రెహమత్ (A-8)లను పోలీసులు వెంబడించి పట్టుకున్నారు. నిందితులు కోటగిరి, వర్ని, బోధన్, జగిత్యాల తదితర ప్రాంతాల్లో మొత్తం 11 కేసులలో పశువులను, గేదెలను దొంగిలించి, బోధన్‌కు చెందిన ఖురేషి అబ్దుల్లా అనే వ్యక్తికి ఒక్కో దాన్ని రూ. 7000 నుండి 8000 లకు అమ్మినట్లు విచారణలో అంగీకరించారు. వారి వద్ద నుండి రూ. 20,000 నగదు, 5 సెల్ ఫోన్లు, 2 బొలెరో వాహనాలు మరియు ఒక పల్సర్ మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నామని, ఈ కేసులో పరారీలో ఉన్న మిగతా నిందితులు A-1 సోహైల్ పటేల్,




A-2 సయ్యద్ సైఫ్,A-3 జియా ఖురేషి, A-9 అబుసద్, A-10 డీల్, మరియు A-11 అబ్దుల్ అజీజ్‌ల కోసం గాలింపు చర్యలు చేపడుతున్నామని ఏసీపీ శ్రీనివాస్ రావు లేకరుల సమావేశంలో వెల్లడించారు.

# తెలంగాణ అవతరణ దినోత్సవ వేడుకలకు అన్ని ఏర్పాట్లు పూర్తి

- **జూన్ 2న కలెక్టరేట్ ప్రాంగణంలో ఘనంగా వేడుకలు**
- **జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక ఐఏఎస్.**

**నారాయణపేట, జూన్,01(సమయం న్యూస్) :** జూన్ 2 తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను నారాయణపేట జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ ప్రాంగణంలో నిర్వహించే తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలకు రాష్ట్ర పశుసంవర్ధక మత్స్య క్రీడలు యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఉదయం 8.00



గంటలకు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి గౌరవ వందనం స్వీకరిస్తారు. వేడుకల నిర్వహణకు సంబంధించి వేదిక, కూర్చునే ఏర్పాట్లు, తాగునీరు, విద్యుత్, పారిశుధ్యం, ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా ఏర్పాట్లు, పార్కింగ్ తదితర అంశాలపై సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు కలెక్టర్ తెలిపారు.కార్యక్రమానికి హాజరయ్యే ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు సౌకర్యవంతంగా పాల్గొనేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని పేర్కొన్నారు.తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అమరులైన వీరుల త్యాగాలను స్మరించుకుంటూ రాష్ట్ర ప్రగతి, అభివృద్ధి, సంక్షేమ ఫలితాలను ప్రజలకు చాటిచెప్పేలా వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లా ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని తెలంగాణ అవతరణ దినోత్సవ వేడుకలను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కోరారు....

# ధారూర్ పోలీస్ స్టేషన్ ను క్షుణ్ణంగా తనిఖీ నిర్వహించిన జిల్లా ఎస్పీ



**ధారూర్ మండలం, జూన్,01(సమయం న్యూస్) :** ప్రజలకు మరింత సమర్థవంతమైన, పారదర్శకమైన పోలీసింగ్ సేవలను అందించడమే లక్ష్యంగా వికారాబాద్ జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ స్నేహ మెహ్రా, ఐపీఎస్ సోమవారం ధారూర్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి, క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా స్టేషన్ ఆవరణ పరిశుభ్రత, కార్యాలయ నిర్వహణ, రికార్డుల భద్రత, సిబ్బంది విధి నిర్వహణ తీరును ఆమె పరిశీలించారు. ముఖ్యంగా స్టేషన్ డైరీలు, పెండింగ్ కేసుల పురోగతి, రౌడీ షీట్లు, సస్పెక్ట్ షీట్లు, హిస్టరీ షీట్లు, ఆర్డర్ బుక్, బీట్ బుక్స్, వారెంట్ల అమలు స్థితితో పాటు స్వాధీనం చేసుకున్న ఆస్తుల రికార్డులు, కేసు ప్రాపర్టీల భద్రత వంటి పలు కీలక అంశాలను నిశితంగా తనిఖీ చేశారు.అనంతరం జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, ప్రజలకు సత్వర న్యాయం అందించేందుకు మరియు పోలీసులకు-ప్రజలకు మధ్య ఎలాంటి అంతరాలు లేకుండా నిరంతరం అందుబాటులో ఉండే విధంగా పోలీసు అధికారులు పనిచేయాలని ఇప్పటికే సూచించినట్లు తెలిపారు. ప్రజలకు న్యాయం అందించడంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు పోలీస్ స్టేషన్లలో సిబ్బంది పనితీరు, సేవల అందజేత తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్న ట్లు పేర్కొన్నారు. ప్రజలకు సేవలు అందిం చడంలో ఎక్కడా అంతరాలు రాకుండా చూడటానికే ఈ తనిఖీలు నిర్వహి స్తున్నట్లు ఆమె స్పష్టం చేశారు. సాంకేతిక పరిజ్ఞాన వినియోగంపై ప్రత్యేక దృష్టి సారించాలని, డయల్-100 ట్యాబ్‌ల పనితీరు, సీసీటీఎన్ఎస్ (CCTNS) నమోదు విధానం, డేటా అప్‌డేషన్ ప్రక్రియలను క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని ఆదేశించారు. అలాగే పోలీస్ స్టేషన్లలో 5ఎస్ (5s) నిర్వహణను సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు ప్రతి ఫిర్యాదు, కేసు వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు.చివరగా స్టేషన్ సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించిన ఎస్పీ వారి పనితీరుపై సమీక్ష




జరిపారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుడిని మర్యాదపూర్వకంగా స్వాగతిస్తూ, వారి సమస్యలను ఓర్పుతో విని, చట్టపరమైన సహాయాన్ని వేగంగా అందించాలని స్పష్టం చేశారు. ప్రజల నమ్మకాన్ని, విశ్వాసాన్ని చూరగొనడం ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది యొక్క ప్రాథమిక బాధ్యత అని ఈ సందర్భంగా గుర్తుచేశారు.భవిష్యత్తులో జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లలో ఇటువంటి తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని, ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఎస్పీ సూచించారు.

# తహసీల్దార్లతో సమీక్షించిన జిల్లా కలెక్టర్ సీ. హెచ్ ప్రియాంక ఐఏఎస్



**నారాయణపేట, జూన్,01(సమయం న్యూస్) :** జిల్లా కలెక్టరేట్ లోని వీసీ హాల్ లో సోమవారం జిల్లా కలెక్టర్ జిల్లాలోని అన్ని మండలాల తహసీల్దార్లతో రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను తో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో భూ భారతి, సాదా బైనామా, ఎస్ ఐ ఆర్ ప్రగతి పై మండలాల వారీగా చర్చించారు.వీటితో పాటు ప్రజావాణి ఫిర్యాదులను వారం లోపు పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు.నారాయణ పేట, మక్తల్ నియోజక వర్గాలలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు ప్రతినిధులు తమ బూత్ స్థాయి ఏజెంట్ల జాబితాలు ఇచ్చారా లేదా అని ఎన్నికల విభాగం అధికారులను ప్రశ్నించారు.మక్తల్ నియోజక వర్గంలో ఆయా పార్టీల ప్రతినిధులు తమ బూత్ స్థాయి ఏజెంట్ల వివరాలు ఇచ్చారని, నారాయణ పేట నియోజక వర్గంలో ఇంకా అన్ని పార్టీలు తమ బూత్ స్థాయి ఏజెంట్ల జాబితాలు ఇవ్వలేదని సెక్షన్ అధికారిని జయసుధ కలెక్టర్ కు తెలిపారు.వెంటనే రెండు నియోజక వర్గాలలో అన్ని పార్టీల బీ ఎల్ ఏ ల జాబితాలు తప్పనిసరిగా తెప్పించుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.సమావేశంలో డీ ఆర్ వో రాజేశ్వరి, తహసీల్దార్లు పాల్గొన్నారు.

# ఘనంగా గంగమ్మ పండగ



**పోతంగల్, మే 01 ( సమయం న్యూస్ ) :** పోతంగల్ మండల కేంద్రంలోని కల్లూరు గ్రామంలో శ్రీ గంగమ్మ పండగ వేడుకలు (మత్స్యకరుల) గంగపుత్రుల కులస్తుల ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా జరిగాయి. పండగను పురస్కరించుకొని ఉదయం నుంచే గంగమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బంధుమిత్రులతో కలిసి, బాజాభజంత్రీల చప్పుళ్ల మధ్య ఆడపడుచులు అమ్మవారికి నైవేద్యాలు తీసుకొని చేరుకట్ట వద్దకు చేరుకున్నారు. అక్కడ గంగమ్మ గుడి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి, బోనాలతో మొక్కులు చెల్లించుకున్నారు. ప్రతి ఏటా తాము ఎంతో భక్తిశ్రద్ధలతో గంగమ్మ పండగను నిర్వహిస్తున్నామని. గ్రామస్తులందరూ సుఖసంతోషాలతో ఉండాలని, సకాలంలో వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని అమ్మవారిని వేడుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు, ఈ వేడుకల సందర్భంగా కల్లూరు గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో (మత్స్యకరుల) గంగపుత్రుల సంఘం అధ్యక్షులు కర్రోల్ల సాయిలు, ఉపాధ్యక్షులు పులకంటి బాలబోయి,పెండ్లా గంగారాం, బోడమీద గోపి,సీరియల భూమయ్య,కానిగేని సాయిలు,దాంబోయ్ సంతోష్ తదితరులు పాల్గొన్నారు

# అభివృద్ధి పనులపై సమీక్ష

**పరిగి ఎమ్మెల్యే టీ రామ్మోహన్ రెడ్డి.**



**పరిగి మండలం, జూన్,01(సమయం న్యూస్ :** పరిగి మండలంలోని గడిసింగాపూర్ గ్రామంలో పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి పర్యటించారు.ఈ సందర్భంగా స్థానిక నాయకులతో కలిసి గ్రామంలో నిర్మాణంలో ఉన్న అండర్ డ్రైనేజ్ మరియు సీసీ రోడ్డు పనులను పరిశీలించి, పనుల పురోగతిపై అధికారులతో చర్చించారు.అనంతరం గ్రామంలో నూతనంగా నిర్మించిన పాఠశాల కాంపౌండ్ వాల్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు.గ్రామ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందించేందుకు కృషి చేస్తున్నామని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# బీడీ కార్మికులకు రూ. 4 వేల పెన్షన్ ఇవ్వాలి

**కోటగిరి ఎంపీడీవో ఆఫీస్ ముందు టీయూసీఐ ధర్నా**




**కోటగిరి, జూన్ 01, (సమయం న్యూస్ ) :** 2023 డిసెంబర్ అసెంబ్లీ ఎన్నికల్లో రేవంత్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం.. పెన్షన్ రాని బీడీ కార్మికులకు రూ. 4,000 జీవన భృతి ఇవ్వాలని, ప్రస్తుతం రూ. 2,016 వస్తున్న వారికి రూ. 4,000కు పెంచాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ (టీయూసీఐ) బోధన్ ఏరియా కమిటీ ఆధ్వర్యంలో నిజాంబాద్ జిల్లా కోటగిరి ఎంపీడీవో కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే హామీలు నెరవేరుస్తామని చెప్పి, నేటికీ అమలు చేయకుండా మహిళా బీడీ కార్మికులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని యూనియన్ నాయకులు మండిపడ్డారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన మాట నిలబెట్టుకోవాలని డిమాండ్ చేస్తూ, డిమాండ్ల వినతిపత్రంతో పాటు కార్మికుల వ్యక్తిగత దరఖాస్తులను అధికారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో మహిళా బీడీ కార్మికులు పాల్గొన్నారు.


# మల్కాజిగిరిలో పరిపాలన గాడి తప్పింది

**స్పెషల్ ఆఫీసర్‌పై మాజీ కార్పొరేటర్ శ్రవణ్ ఆగ్రహం**



**మల్కాజీ గిరి జూన్1( సమయం న్యూస్) :** మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్‌లో పరిపాలన పూర్తిగా కుంటుపడిందని మాజీ కార్పొరేటర్ శ్రవణ్ ఆరోపించారు. శనివారం కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో జరిగిన స్టాండింగ్ కమిటీ సమావేశం వెలుపల స్పెషల్ ఆఫీసర్ జయశంకర్, కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డిని ఆయన ప్రజా సమస్యలపై నిలదీశారు.పాలక మండలి ఫిబ్రవరిలో ముగిసిన తర్వాత అధికారులు ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. వీధి దీపాలు, పారిశుధ్యం, పార్కుల అభివృద్ధి పనులు నిలిచిపోయాయని అన్నారు. సఫిల్‌గూడ చెరువు మురికినీటి శుద్ధీకరణ పనులకు నిధులు మంజూరైనా ఇంకా పనులు ప్రారంభించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంజినీరింగ్ అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లకుండా కార్యాలయాలకే పరిమితమవుతున్నారని ఆరోపించారు. అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని, లేకపోతే మల్కాజిగిరి ప్రజల ఆగ్రహాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. సమస్యలపై వెంటనే చర్యలు తీసుకోకపోతే ప్రజా ఉద్యమం చేపడతామని శ్రవణ్ స్పష్టం చేశారు.ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్, హార్టికల్చర్ అడిషనల్ కమిషనర్ సునంద, అడిషనల్ కమిషనర్ రఘు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్లతో పేదల సొంతింటి కల నెరవేరుతోంది: మంత్రి పొంగులేటి



**కాగజ్‌నగర్: జూన్1( సమయం న్యూస్) :** రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే 1.25 లక్షల ఇందిరమ్మ ఇళ్లు పూర్తయ్యాయని, మరో రెండు నెలల్లో 2 లక్షల ఇళ్లను లబ్ధిదారులకు అందజేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ప్రతి నియోజకవర్గానికి కనీసం 3,500 ఇళ్లు మంజూరు చేశామని, గిరిజన ప్రాంతాలకు అదనపు ఇళ్లు కేటాయించామని చెప్పారు.ఇళ్ల మంజూరులో కులం, మతం, పార్టీ భేదాలు లేవని, ప్రతి అర్హ పేద కుటుంబానికి ఇల్లు అందే వరకు పథకం కొనసాగుతుందని పేర్కొన్నారు. రెండో విడతలో ప్రతి నియోజకవర్గానికి 2 వేల ఇళ్లు మంజూరు చేస్తున్నామని, అసంపూర్తిగా ఉన్న ఇళ్లు, గృహలక్ష్మి ఇళ్లను పూర్తి చేసేందుకు నిధులు కేటాయిస్తున్నామని వెల్లడించారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేదల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

# 4న మక్తల్ కు ముఖ్యమంత్రి రాక

**ఏర్పాట్లను పర్యవేక్షించిన మంత్రి వాకిటి శ్రీహరి.**



**మక్తల్ మున్సిపల్,(మం)జూన్,01(సమయం న్యూస్) :** నారాయణ పేట జిల్లా మక్తల్ నియోజక వర్గ పరిధిలో కృష్ణా, భీమానది మీద రెండు బ్యారేజీల నిర్మాణం కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి ఏరియల్ సర్వే చేయడానికి ఈ నెల 4న మక్తల్ కు విచ్చేయున్న సందర్భంగా సోమవారం సాయంత్రం జిల్లా మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక ఐఏఎస్, ఎస్పీ డాక్టర్ వినీత్ ఐపీఎస్ తో కలిసి సీఎం పర్యటన ఏర్పాట్లను పర్యవేక్షించారు. మక్తల్ గురుకుల పాఠశాల సమీపంలో సీఎం హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలించారు. ఈ నెల 3 న కర్ణాటక ముఖ్యమంత్రి డీ. కే. శివ కుమార్ ప్రమాణ స్వీకారానికి సీఎం రేవంత్ రెడ్డి హాజరై, మరుసటి రోజు 4న కర్ణాటక నుంచి హెలికాప్టర్ లో నేరుగా మక్తల్ కు చేరుకుని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, జిల్లా మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి తో కలిసి కృష్ణా, భీమా నది పై నిర్మించే రెండు బ్యారేజీల నిర్మాణం కోసం ఏరియల్ సర్వే నిర్వహించనున్నారు. అనంతరం సీఎం మళ్ళీ మక్తల్ కు చేరుకుని నీటి పారుదల శాఖ ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశంలో పాల్గొననున్నారు.

# తెలంగాణ అవతరణ దినోత్సవ వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు: కలెక్టర్ హైమావతి



**సిద్దిపేట, జూన్ 1:( సమయం న్యూస్) :** జూన్ 2న నిర్వహించనున్న తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల కోసం సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో చేపట్టిన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ కె. హైమావతి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్య అతిథులు, తెలంగాణ అమరవీరుల కుటుంబాలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, మీడియా ప్రతినిధులు, విద్యార్థులు, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని ఆదేశించారు. జాతీయ జెండా ఆవిష్కరణ, పోలీస్ గౌరవ వందనం, అమరవీరుల కుటుంబాల సన్మానం, ముఖ్య అతిథి ప్రసంగం తదితర కార్యక్రమాలు ప్రోటోకాల్ ప్రకారం నిర్వహించాలని సూచించారు. అలాగే సీటింగ్, తాగునీరు, సౌండ్ సిస్టమ్ తదితర సౌకర్యాలను సమర్థంగా ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. పరిశీలనలో అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్, ఆర్డీవో సదానందం, అదనపు డీసీపీ సుభాష్ చంద్రబోస్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# లాటరీ పద్ధతి ద్వారా విద్యార్థుల ఎంపిక

**జిల్లా కలెక్టర్ ప్రియాంక అలా.**



**హైదరాబాద్ జూన్1( సమయం న్యూస్) :** హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ బేగం పేట నందు ఒకటవ తరగతి లో ప్రవేశాల కొరకు ఇద్దరు షెడ్యూల్ కులాలకు చెందిన విద్యార్థులను లాటరీ పద్ధతి ద్వారా ఎంపిక చేయటం జరిగిందని జిల్లా కలెక్టర్ ప్రియాంక అలా తెలిపారు. జిల్లా షెడ్యూల్ కులాల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ నందు పారదర్శకంగా డొక్కా లక్ష్మీ శ్రీ, ముత్యాల మోక్షిత్ లను లాటరీ పద్ధతి ద్వారా ఎంపిక చేయడం జరిగిందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో షెడ్యూల్ కులాల సంక్షేమ శాఖ ఉపసంచాలకులు ప్రవీణ్ కుమార్, పర్యవేక్షకులు , విద్యార్థులు వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ సలహాదారుని కలిసిన కలెక్టర్



రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలలో పాల్గొనడానికి జిల్లా కేంద్రానికి వచ్చిన ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ గారిని పెన్ గంగా గెస్ట్ హౌస్‌లో జిల్లా కలెక్టర్ రాజర్షి షా మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల ఏర్పాట్లు, కార్యక్రమ నిర్వహణ తదితర అంశాల పై చర్చించారు.

# రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా



**మహబూబ్ నగర్ జూన్1( సమయం న్యూస్) :** జూన్ 2న కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు చేపట్టిన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా సోమవారం ల పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె అధికారులకు పలు సూచనలు చేశారు. కలెక్టర్ కార్యాలయం ఎదుట ఉన్న ఖాళీ ప్రదేశంలో ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు సౌకర్యవంతంగా కూర్చునేందుకు ఏర్పాటు చేస్తున్న కుర్చీలు, నీడ కొరకు ఏర్పాటు చేసిన టెంట్లు, వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న ప్రదర్శన స్టాళ్లను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను పండుగ వాతావరణంలో, అంగరంగ వైభవంగా నిర్వహించాలని ఆమె సూచించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు హాజరుతున్నారని అన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతిబింబించేలా వివిధ శాఖల ద్వారా ఏర్పాటుచేస్తున్న స్టాళ్లను ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ . డి.ఓ నవీన్, జిల్లా పరిపాలన అధికారి సువర్ణరాజు, కలెక్టర్ కార్యాలయ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# తుమ్మిడిహెట్టి ప్రాజెక్టుపై సీఎం రేవంత్‌రెడ్డి కీలక ప్రకటనలు

- **ఆదిలాబాద్ అభివృద్ధి, గిరిజన గూడేలకు ఇండ్లు తుమ్మిడిహెట్టి ప్రాజెక్టుపై సీఎం రేవంత్‌రెడ్డి కీలక ప్రకటనలు**



**కాగజ్‌నగర్, ఆసిఫాబాద్ జూన్ 1( సమయం న్యూస్) :** ఆదిలాబాద్ జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రజా పాలన--ప్రగతి బాట బహిరంగ సభలో పాల్గొన్న ఆయన గిరిజన, ఆదివాసీ ప్రజల సంక్షేమం, ఇందిరమ్మ ఇండ్లు, సాగునీటి ప్రాజెక్టులు, ధాన్యం కొనుగోలు అంశాలపై కీలక ప్రకటనలు చేశారు. గిరిజన గూడేల్లో గుడిసెలకు బదులుగా పక్కా ఇండ్లు నిర్మించడమే ప్రభుత్వ లక్ష్యమని సీఎం తెలిపారు. నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇండ్లతో పాటు ఐటీడీఏ పరిధిలో అదనంగా 21 వేల ఇండ్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు. ఆదిలాబాద్ జిల్లాలో ఒక్క గుడిసె కూడా కనిపించకుండా అన్ని అర్హులైన కుటుంబాలకు ఇండ్లు అందజేస్తామని హామీ ఇచ్చారు. ఇండ్లు లేని కుటుంబాల జాబితాను సిద్ధం చేసి అందించాలని అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల బిల్లుల విడుదలలో ఎలాంటి జాప్యం జరగలేదని పేర్కొన్న సీఎం, ఏడాదిలో లక్ష ఇండ్లకు గృహప్రవేశాలు పూర్తిచేశామని చెప్పారు. సెప్టెంబర్ 17, 2026 నాటికి మరో లక్ష ఇండ్లకు గృహప్రవేశాలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని ఆదేశించినట్లు తెలిపారు. రెండో విడతలో మరో 2.50 లక్షల ఇండ్ల నిర్మాణ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు వెల్లడించారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా ఆదిలాబాద్ జిల్లాకు ప్రయోజనం చేకూరలేదని విమర్శించిన సీఎం, తుమ్మిడిహెట్టి వద్ద ప్రాజెక్టు నిర్మించి సుమారు రెండున్నర లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలనే నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించి మహారాష్ట్ర ముఖ్యమంత్రికి లేఖ రాసినా స్పందన లేదని పేర్కొన్నారు. రైతుల ప్రయోజనాల దృష్ట్యా మహారాష్ట్ర ప్రభుత్వం సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ విషయంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి చొరవ తీసుకుని మహారాష్ట్ర ప్రభుత్వంతో చర్చించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం 75 లక్షల క్వింటాళ్ల వరిధాన్యాన్ని సేకరించిందని సీఎం తెలిపారు. కనీస మద్దతు ధర ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం తెలంగాణలో సేకరించిన ధాన్యం, మక్కజొన్నలను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. జూన్ 15లోపు కేంద్రం స్పందించాలని, లేదంటే రైతులతో కలిసి ఉద్యమ కార్యాచరణ చేపడతామని హెచ్చరించారు. రైతులు ఎవరూ ఆందోళన చెందవద్దని, ఎన్ని క్వింటాళ్ల ధాన్యం ఉన్నా రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని సీఎం స్పష్టం చేశారు. తడిసిన ప్రతి గింజను కూడా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని రైతులకు భరోసా ఇచ్చారు.

# అట్టహాసంగా ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవం



- **లబ్ధిదారులతో గృహప్రవేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్**

**కామారెడ్డి జూన్1( సమయం న్యూస్) :** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా నిర్మాణాలు పూర్తిచేసుకున్న ఇళ్ల గృహప్రవేశాల మహోత్సవం సోమవారం జిల్లా వ్యాప్తంగా పండుగ వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని అడ్లూరి ఎస్సీ కాలనీ, వార్డు నంబర్-2లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, అదనపు కలెక్టర్ ఎన్.వి. గిరి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఉమారాణిలతో కలిసి లబ్ధిదారులు పెరుమాళ్ల లింగం, ఎల్లవ్వల నూతన గృహంలో గృహప్రవేశం నిర్వహించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించిన నేపథ్యంలో, కామారెడ్డి జిల్లాలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఇందిరమ్మ పథకం కింద నిర్మాణాలు పూర్తిచేసుకున్న ఇళ్లను ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సహకారం తో సొంత ఇంటి కలను సాకారం చేసుకున్న లబ్ధిదారులను జిల్లా కలెక్టర్ అభినందించారు. గృహ నిర్మా ణాలను విజయ వంతంగా పూర్తిచేసుకుని గృహప్రవేశం నిర్వహించుకోవడం ఆనందదాయకమని పేర్కొన్నారు. నూతన గృహాల్లోకి ప్రవేశించిన లబ్ధిదారులు తమ సొంతింటి కలను నెరవేర్చిన రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీడీ హౌసింగ్, తహసీల్దార్, సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ అవతరణ దినోత్సవ వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు

**ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్**



**కరీం నగర్ జూన్1( సమయం న్యూస్).** కరీంనగర్ పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో మంగళవారం నిర్వహించనున్న తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలకు జిల్లా యంత్రాంగం తరఫున పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టామని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం తెలిపారు. సోమవారం రాత్రి పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జరుగుతున్న ఏర్పాట్లను జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్ స్వయంగా పరిశీలించారు. వేదిక, సీటింగ్ ఏర్పాట్లు, పార్కింగ్, తాగునీరు, విద్యుత్ సదుపాయాలు, భద్రతా ఏర్పాట్లు తదితర అంశాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. వేడుకలకు హాజరయ్యే ప్రజాప్రతినిధులు, అధికారులు, అతిథులు, ప్రజలు ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా అన్ని ఏర్పాట్లు సమర్థవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, పారిశుద్ధ్యం, అత్యవసర సేవల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను జిల్లాలో అత్యంత వైభవంగా, ఘనంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి ప్రతి శాఖ తన బాధ్యతలను సమర్థంగా నిర్వర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ, పోలీస్, మున్సిపల్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పండుగ వాతావరణంలో ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవాలు

**గృహప్రవేశాలు చేసిన మంత్రి దామోదర రాజనర్సింహ**



**సంగారెడ్డి, జూన్ 1:( సమయం న్యూస్) :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా జిల్లాలో సోమవారం గృహప్రవేశాల మహోత్సవం పండుగ వాతావరణంలో ఘనంగా జరిగింది. రాష్ట్ర వ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవాలకు శ్రీకారం చుట్టిన నేపథ్యంలో సంగారెడ్డి జిల్లాలోనూ నిర్మాణాలు పూర్తి చేసుకున్న లబ్ధిదారుల ఇళ్లను ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రారంభించారు. ఆందోల్ మండలం మన్‌సాన్‌పల్లిలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించి లబ్ధిదారులు నీరుడి జ్యోతి, గొల్ల లావణ్య, వంగ సుజాత కుటుంబాలతో కలిసి గృహప్రవేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పేదలకు సొంతింటి కలను సాకారం చేయడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. ముఖ్యమంత్రి నాయకత్వంలో దశాబ్దాలుగా గూడు కోసం ఎదురుచూస్తున్న పేద కుటుంబాలకు గౌరవప్రదమైన జీవనం అందించేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఇల్లు అనేది కేవలం నాలుగు గోడలు కాదని, కుటుంబానికి భద్రత, ఆత్మవిశ్వాసం, సామాజిక గౌరవాన్ని అందించే ఆస్తి అని పేర్కొన్నారు. రాష్ట్రంలోని ప్రతి అర్హ కుటుంబానికి సొంత ఇంటి కలను నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. లబ్ధిదారులు మాట్లాడుతూ తమ సొంత ఇంటి కల నిజం కావడం జీవితంలో మరచిపోలేని ఆనందమని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల ద్వారా ప్రభుత్వం తమ కుటుంబాలకు శాశ్వత భద్రత కల్పించిందని, ఆత్మగౌరవంతో జీవించే అవకాశం కల్పించిందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్ పాండు, స్థానిక ప్రజాప్రతినిధులు, నియోజకవర్గ ప్రత్యేక అధికారి, తహసీల్దార్, ఎంపీడీవో తదితరులు పాల్గొన్నారు.

# రూ.3.02 కోట్ల అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు శ్రీకారం

- **వికారాబాద్ అభివృద్ధే లక్ష్యం: స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్**

**వికారాబాద్, జూన్ 1:( సమయం న్యూస్).** : వికారాబాద్ మండలంలోని మదన్‌పల్లి, మైలార్దేవరంపల్లి, గొట్టిముక్కుల, పులుసుమామిడి, కొటాలగూడ, సర్పన్‌పల్లి గ్రామాల్లో రూ.3.02 కోట్ల విలువైన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను తెలంగాణ రాష్ట్ర శాసనసభాపతి, వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మదన్‌పల్లిలో పలు అభివృద్ధి పనులు, మైలార్దేవరంపల్లి మరియు గొట్టిముక్కుల గ్రామాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పులుసుమామిడిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, గ్రామ పంచాయతీ భవనం, కొటాలగూడలో డ్వాక్రా మహిళా భవనం, సర్పన్‌పల్లిలో నూతన ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించారు. గొట్టిముక్కుల రైతు వేదికలో రైతులకు స్ప్రింక్లర్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్పీకర్ ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల మేరకు వికారాబాద్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో నియోజకవర్గానికి భారీగా నిధులు వస్తున్నాయని చెప్పారు. ప్రతి గ్రామంలో రూ.50 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టామని, రూ.650 కోట్లతో



ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ రహదారుల అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని వెల్లడించారు. ప్రజా ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్, కొత్త రేషన్ కార్డులు, సన్నబియ్యం పంపిణీ, ఇందిరమ్మ బీమా వంటి సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. రైతులకు పెద్ద ఎత్తున రుణమాఫీ చేశామని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఆశించిన స్థాయిలో అందలేదని, ప్రస్తుతం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పూర్తై గృహప్రవేశాలు జరుగుతున్నాయని తెలిపారు. ఇల్లు లేని ప్రతి అర్హ పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# జూలై నెలాఖరులోపు మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం పూర్తి చేయాలి



## మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**మణుగూరు జూన్1( సమయం న్యూస్) :** మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం పనులను రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సోమవారం పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, జిల్లా కలెక్టర్ అంకిత్, సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠలతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం సంబంధిత శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి పనుల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, జూన్ నాటికి పూర్తికావాల్సిన పనులు ఇప్పటికీ ఎందుకు పూర్తికాలేదని అధికారులను ప్రశ్నించారు. పనుల ఆలస్యానికి గల కారణాలను అడిగి తెలుసుకుని, నిర్దేశిత గడువుల్లో పనులు పూర్తి కాకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అధికారులు మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించి పెండింగ్‌లో ఉన్న పనులను వేగవంతం చేయాలని, జూలై నెలాఖరులోపు మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం పనులను పూర్తిచేసి రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. పినపాక నియోజకవర్గ రైతులే సీతారామ ఎత్తిపోతల పథకం కోసం తొలుత భూములు అందించారని గుర్తుచేసిన మంత్రి, ఈ ప్రాజెక్టు ద్వారా మొదటగా పినపాక నియోజకవర్గ రైతులకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, సాగునీటి వసతుల కల్పన ద్వారా వ్యవసాయాభివృద్ధికి కట్టుబడి ఉందన్నారు. సీతారామ ఎత్తిపోతల పథకం నిర్మాణానికి ఇప్పటివరకు రూ.10 వేల కోట్లు వ్యయం చేసినట్లు మంత్రి తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయిలో రైతులకు ప్రయోజనం చేకూర్చాలంటే ఇంకా రూ.9 వేల కోట్ల నిధులు అవసరమవుతాయని చెప్పారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి చొరవతో డిస్ట్రిబ్యూటరీ కాలువల నిర్మాణ పనుల కోసం ఇప్పటికే రూ.4 వేల కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ప్రజా ప్రతినిధులు అధికారులు సమన్వయంతో డిస్ట్రిబ్యూటరీ కాలువల నిర్మాణం, భూసేకరణ ప్రక్రియలను వేగవంతంగా పూర్తి చేస్తే వచ్చే ఏడాది నాటికి పినపాక, అశ్వారావుపేట, కొత్తగూడెం, సత్తుపల్లి, మధిర నియోజకవర్గాలకు సాగునీరు అందించే అవకాశం ఉంటుందని అన్నారు ఖమ్మం జిల్లాకు చెందిన సుమారు ఏడున్నర లక్షల ఎకరాలకు సాగునీరు అందించే సీతమ్మసాగర్ ప్రాజెక్టుకు సంబంధించి సుప్రీంకోర్టు అనుమతుల కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. సీతమ్మసాగర్ ప్రాజెక్టు పూర్తయితే 38 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం అందుబాటులోకి వచ్చి, ఉమ్మడి ఖమ్మం జిల్లాతో పాటు మహబూబాబాద్ జిల్లాలోని విస్తారమైన ఆయకట్టుకు సాగునీరు అందించగలమని తెలిపారు. సీతారామ ఎత్తిపోతల పథకం ప్రధాన కాలువను ప్రారంభ స్థానం నుంచి చివరి వరకు పూర్తిస్థాయిలో శుభ్రపరచాలని అధికారులను ఆదేశించారు. కాలువల్లో ఎక్కడైనా మట్టి పేరుకుపోయిన ప్రాంతాలు, జారిన గట్లు లేదా ఇతర అవరోధాలు ఉంటే వెంటనే తొలగించి నీటి ప్రవాహానికి ఎలాంటి అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. రానున్న వర్షాకాలంలో నీటి విడుదలకు ముందే కాలువలు పూర్తిగా సిద్ధంగా ఉండేలా నిర్వహణ పనులను వేగవంతం చేయాలని, రైతులకు సాగునీరు సకాలంలో అందేలా ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మర్రి సంధ్యా సంబంధిత శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# చీటింగ్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- **తక్కువ సమయంలో ఎక్కువ లాభాలు వస్తాయని నమ్మొద్దు.**
- **తెలియని వ్యక్తులకు డబ్బులు, వ్యక్తిగత వివరాలు ఇవ్వొద్దు.**
- **మోసాలకు గురైతే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి.**
- **జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్**

**నారాయణపేట, జూన్,01(సమయం న్యూస్) :** ప్రస్తుత సమాజంలో వివిధ రూపాల్లో జరుగుతున్న చీటింగ్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఖ్రూా తెలిపారు. అమాయక ప్రజలను లక్ష్యంగా చేసుకుని కొందరు వ్యక్తులు ఉద్యోగాలు, పెట్టుబడులు, రుణాలు, బంగారం, స్థలాలు, ఆన్‌లైన్ వ్యాపారాలు, లక్కీ డ్రాలు, విదేశీ ఉద్యోగాల పేరుతో మోసాలకు పాల్పడుతున్నారని తెలిపారు. ముఖ్యంగా తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు, సులభంగా లోన్, తక్షణ ఉద్యోగం, లాటరీ గెలుపు వంటి ఆశాజనక మాటలతో ప్రజలను నమ్మబలికి డబ్బులు వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. అలాంటి ప్రకటనలు,



సోషల్ మీడియా పోస్టులు, ఫోన్ కాల్స్, మెసేజ్‌లను నమ్మి ఎవరూ మోసపోవద్దని హెచ్చరించారు. ఇటీవల కొందరు ఫేక్ డాక్యుమెంట్లు, నకిలీ రిజిస్ట్రేషన్ పత్రాలు చూపించి స్థలాలు, ఇళ్లు అమ్ముతున్నట్లు నటిస్తూ మోసాలకు పాల్పడుతున్నారని తెలిపారు. ఆస్తుల కొనుగోలు సమయంలో సంబంధిత పత్రాలను పూర్తిగా పరిశీలించి, అధికారిక ధృవీకరణ తీసుకున్న తర్వాతే లావాదేవీలు చేయాలని సూచించారు. అలాగే సోషల్ మీడియా ద్వారా పరిచయాలు పెంచుకుని డబ్బులు అడగడం, ఫేక్ అకౌంట్లతో మోసాలు చేయడం, QR కోడ్ స్కాన్ చేయమని చెప్పి బ్యాంకు ఖాతాల నుంచి డబ్బులు దోచుకోవడం వంటి ఘటనలు పెరుగుతున్నాయని తెలిపారు. అపరిచితులపై నమ్మకం ఉంచి ఆర్థిక లావాదేవీలు చేయవద్దని సూచించారు. విద్యార్థులు, యువత ఉద్యోగాల కోసం ప్రయత్నించే సమయంలో ప్రభుత్వ గుర్తింపు ఉన్న సంస్థలను మాత్రమే సంప్రదించాలని, ముందస్తుగా డబ్బులు అడిగే సంస్థల పట్ల జాగ్రత్తగా ఉండాలని పేర్కొన్నారు. మహిళలు బంగారం, చిట్‌ఫండ్లు, ఆన్‌లైన్ షాపింగ్ వంటి విషయాల్లో ప్రత్యేక అప్రమత్తతతో వ్యవహరించాలని సూచించారు. ప్రజలు ఎవరైనా మోసాలకు పాల్పడుతున్నట్లు గుర్తిస్తే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. చీటింగ్ కేసులపై జిల్లా పోలీస్ శాఖ కఠిన చర్యలు తీసుకుంటుందని, మోసగాళ్లను చట్టపరంగా శిక్షిస్తామని తెలిపారు. ప్రజల అప్రమత్తతే మోసాలకు అడ్డుకట్ట వేయగలదు. అనుమానం వచ్చిన వెంటనే పోలీసులను సంప్రదించాలి అని జిల్లా ఎస్పీ పేర్కొన్నారు.

# అంతిమ సంస్కారాల కోసం ప్రత్యేక వసతుల ఏర్పాటుకు చర్యలు

- **పద్మాక్షి శివ ముక్తి ధామ్‌ను పరిశీలించిన ఎమ్మెల్యే నాయిని, కూడా చైర్మన్, కలెక్టర్.**

**హనుమకొండ జూన్ 1( సమయం న్యూస్) :** హనుమకొండ: సుదూర ప్రాంతాల నుంచి జీవనోపాధి కోసం వరంగల్ మహానగరానికి వచ్చి కిరాయి ఇళ్లలో నివసిస్తున్న కుటుంబాలు తమ ఆత్మీయులను కోల్పోయిన సమయంలో అంతిమ సంస్కారాలు నిర్వహించేందుకు సరైన వసతులు లేక ఇబ్బందులు పడుతున్న పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక సమస్యను గుర్తించిన అనురాగ్ హెల్పింగ్ సొసైటీ చైర్మన్ అనిత రెడ్డి విషయాన్ని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీ నాయిని రాజేందర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై వెంటనే స్పందించిన ఎమ్మెల్యే, సమస్యను జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో నేడు ఎమ్మెల్యే శ్రీ నాయిని రాజేందర్ రెడ్డి గారు, ఖఖణూ చైర్మన్ శ్రీ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి గారు, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ గారు, ఖఖణూ సంబంధిత అధికారులతో కలిసి పద్మాక్షి శివ ముక్తి ధామ్ స్థలాన్ని పరిశీలించారు. నిరుపేదలు, వలస కార్మిక కుటుంబాలు తమ ఆత్మీయులకు గౌరవప్రదంగా అంతిమ సంస్కారాలు నిర్వహించుకునేందుకు



అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించాలని అధికారులను ఆదేశించారు. పుల్లూరి నరసయ్య చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు, ప్రముఖ సామాజిక సేవావేత్త అనిత రెడ్డి, పలువురు స్వచ్ఛంద సేవకులు పాల్గొని తమ వంతు సహకారం అందించేందుకు ముందుకు వచ్చారు. ప్రజల అవసరాలను గుర్తించి మానవతా దృక్పథంతో స్పందించిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి గారు ఈ వసతులు అందుబాటులోకి వస్తే ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు ఎంతో ఊరట కలుగుతుందని, తమ ఆత్మీయులకు గౌరవప్రదంగా అంతిమ సంస్కారాలు నిర్వహించే అవకాశం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# పీఎం స్వనిధి పథకానికి ఆరు సంవత్సరాలు పూర్తి

## లబ్ధిదారులకు ప్రధాని మోదీ శుభాకాంక్షలు

**న్యూఢిల్లీ, జూన్ 1:( సమయం న్యూస్):** వీధి వ్యాపారుల జీవితాల్లో గణనీయమైన మార్పు తీసుకువచ్చిన పీఎం స్వనిధి (PM SVANidhi) పథకం ఆరు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రధాని ఛ్థితీవఅంతీఖ వీశీంఱ లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ పథకం ద్వారా లక్షలాది వీధి వ్యాపారులకు తాకట్టు లేని రుణాలు, ఆర్థిక సమ్మిళితం, వ్యాపారాభివృద్ధికి కొత్త అవకాశాలు లభించాయని ప్రధాని పేర్కొన్నారు. విశ్వాసం, గౌరవం, సాధికారత అనే సూత్రాలపై ఈ పథకం ఆధారపడిందని ఆయన తెలిపారు. దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తున్న వీధి వ్యాపారుల కృషిని ప్రశంసించిన ప్రధాని, వారి సంకల్పం, వ్యాపార నైపుణ్యం దేశాభివృద్ధికి దోహదపడుతున్నాయని అన్నారు.

# అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన



**ఆసిఫాబాద్ జూన్1( సమయం న్యూస్,) :** కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో పలు అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. మొత్తం రూ.112.14 కోట్ల వ్యయంతో విద్యుత్, సోలార్ పవర్, మున్సిపల్ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. కౌటాలలో రూ.56.55 కోట్లతో నిర్మించిన 132/33 కేవీ సబ్ స్టేషన్‌ను సీఎం ప్రారంభించారు. చింతలమనేపల్లి, గుడ్లబోరి, కాపువాడ, చింతకుంట, అంకుషాపూర్ ప్రాంతాల్లో 33/11 కేవీ సబ్ స్టేషన్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. రెబ్బెన మండలం నంబాల గ్రామంలో రూ.6 కోట్లతో 2 మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్‌కు శంకుస్థాపన చేశారు. ఆసిఫాబాద్ మున్సిపాలిటీలో రూ.15 కోట్లు, కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో రూ.18.7 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. ఈ పనులతో జిల్లాలో విద్యుత్ సరఫరా మెరుగుపడి, మున్సిపల్ ప్రాంతాల్లో మౌలిక వసతులు మరింత బలోపేతం కానున్నాయి.

# మల్లిఖార్జున ఖర్గేని కలిసిన గడ్డం ప్రసాద్



**న్యూఢిల్లీ :** రాజ్యసభ ప్రతిపక్ష నేత, ఏఐసీసీ అధ్యక్షులు శ్రీ మల్లిఖార్జున ఖర్గే గారిని ఈరోజు వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసిన తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి శ్రీ గడ్డం ప్రసాద్ కుమార్ గారు.

# విధుల్లో చేరిన CPO



ఈరోజు శ్రీ బి. సత్యనారాయణ రెడ్డి JD/CPO హన్మకొండ జిల్లా గారిని, ములుగు జిల్లా CPO గా ఇన్‌చార్జిగా నియమితులయ్యారు. విధుల్లో చేరిన అనంతరం సిబ్బందితో సమావేశం నిర్వహించి, శాఖా కార్యక్రమాలపై సమీక్ష చేపట్టారు.

# మరమ్మత్తుల పనులు చేపట్టాలి:కలెక్టర్ భవేశ్ మిశ్రా




**నిర్మల్ జూన్1( సమయం న్యూస్) :** రానున్న గోదావరి పుష్కరాలకు సంబంధించి, అవసరమైన నిర్మాణ పనులు, మరమ్మత్తుల పనులను చేపట్టాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో, జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా గోదావరి పుష్కరాల కు సంబంధించి వివిధ శాఖల ఆధ్వర్యంలో చేపట్టే నిర్మాణ పనులపై అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గోదావరి పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. పుష్కర ఘాట్లు, రహదారులు, త్రాగునీటి ట్యాంకులు, లైటింగ్ కొరకు అవసరమైన నిర్మాణాలు, మరమ్మతుల పనులు చేపట్టాలని పేర్కొన్నారు. పనులన్నీ నాణ్యవంతంగా ఉండాలని తెలిపారు. భక్తుల రద్దీకి అనుగుణంగా నిర్మాణాలు ఉండాలన్నారు. ఈ సమావేశంలో వివిధ విభాగాల ఇంజనీరింగ్ అధికారులు, ఈఈ ఆర్డబ్ల్యూఎస్ సందీప్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# దామరగిద్ద పోలీస్ స్టేషన్ నూతన ( SHO)గా బాధ్యతలు స్వీకరించిన ఎస్సై నరేష్



**దామరగిద్ద మండలం,జూన్,01(సమయం న్యూస్):** నారాయణపేట జిల్లా దామరగిద్ద పోలీస్ స్టేషన్ నూతన స్టేషన్ హౌస్ ఆఫీసర్ (SHO)గా ఎస్సై నరేష్ అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుముందు జిల్లా స్పెషల్ బ్రాంచ్ (ఎస్‌బీ)లో ఎస్సైగా విధులు నిర్వహించి బదిలీపై దామరగిద్ద పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. కాగా, దామరగిద్ద ఎస్సైగా పనిచేసిన ఎస్సై పి. రాజు బదిలీపై మక్తల్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు.బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఎస్సై నరేష్ మాట్లాడుతూ... జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్( IPS) ఆదేశాల మేరకు దామరగిద్ద మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను చట్టబద్ధంగా పరిష్కరించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.మహిళలు, చిన్నారుల భద్రత, సైబర్ నేరాల నివారణ, మత్తు పదార్థాల నిర్మూలన, ట్రాఫిక్ నియమాల అమలు, గ్రామాల్లో నేర నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపడతామని తెలిపారు. ప్రజలు పోలీస్ శాఖకు సహకరించి, ఏవైనా అనుమానాస్పద వ్యక్తులు లేదా సంఘటనలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.పోలీస్-ప్రజల మధ్య సత్సంబంధాలను మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రజలకు సత్వర సేవలు అందించే దిశగా కృషి చేస్తామని ఎస్సై నరేష్ వెల్లడించారు.ఈ సందర్భంగా పోలీస్ సిబ్బంది నూతన ఎస్సై నరేష్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు.

# నిరుపేదల సొంతింటి కలను సాకారం చేస్తున్న ప్రభుత్వం-మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు



**కాటారం, జూన్ 1( సమయం న్యూస్) :** నిరుపేదల సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు.సోమవారం కాటారం మండలం దన్వాడ గ్రామంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి మంత్రి ఇందిరమ్మ ఇళ్లను, నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు నూతన వస్త్రాలు పంపిణీ చేసి శుభాకాంక్షలు తెలిపారు. రూ.20 లక్షల వ్యయంతో నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించిన మంత్రి, ఈ భవనం ద్వారా గ్రామ ప్రజలకు పరిపాలన సేవలు మరింత సులభంగా అందుబాటులోకి వస్తాయని చెప్పారు.గ్రామీణాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో ఎలాంటి లోటు ఉండదని మంత్రి స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, గృహ నిర్మాణ శాఖ పీడీ లోకిలాల్, అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# పవన్ కళ్యాణ్ క్షమాపణ చెప్పాలి

పొన్నం ప్రభాకర్



**హుస్నాబాద్, జూన్ 1( సమయం న్యూస్) :** తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా గతంలో చేసిన వ్యాఖ్యలకు పవన్ కళ్యాణ్ తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పిన తర్వాతే "నవ నిర్మాణ సభ" నిర్వహించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు.తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం రోజున సభ నిర్వహించడం అభ్యంతరకరమని, బీజేపీ ఎజెండాతో తెలంగాణలో విద్వేషాలు రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఇచ్చిన బాధ్యతలను అక్కడే నిర్వర్తించాలని, తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని అవమానించే వ్యాఖ్యలను సహించబోమని స్పష్టం చేశారు. తెలంగాణ ఏర్పాటుకు వ్యతిరేకంగా చేసిన వ్యాఖ్యలపై పవన్ కళ్యాణ్ సమాధానం చెప్పాలని మంత్రి కోరారు.

# జిల్లా కలెక్టర్‌ను కలిసిన జీడబ్ల్యూఎంసీ అడిషనల్ కమిషనర్ ఇసంపెల్లి జోనా



**హన్మకొండ, జూన్ 1( సమయం న్యూస్) :** ఇటీవల జరిగిన బదిలీల్లో హన్మకొండ మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్‌గా పనిచేస్తూ జీడబ్ల్యూఎంసీ అడిషనల్ కమిషనర్‌గా బదిలీ అయిన ఇసంపెల్లి జోనా సోమవారం హన్మకొండ జిల్లా కలెక్టర్, జీడబ్ల్యూఎంసీ ప్రత్యేకాధికారి చాహత్ బాజ్‌పాయ్‌ను కలెక్టరేట్ లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇసంపెల్లి జోనాకు కలెక్టర్ శుభాకాంక్షలు తెలియజేసి, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సమర్థవంతంగా విధులు నిర్వహించాలని సూచించారు. నగరాభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంలో చొరవతో పనిచేయాలని ఆకాంక్షించారు.

# గోలేటిలో 'అమ్మ మాట-అంగన్వాడి బాట' కార్యక్రమం ఘనంగా నిర్వహణ



**గొలేటి జూన్ 01:( సమయం న్యూస్) :**కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలం గోలేటి గ్రామంలోని అంగన్వాడి కేంద్రం-4లో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లా పర్యటన సందర్భంగా విచ్చేసిన రాష్ట్ర మంత్రులు సీతక్క, జూపల్లి కృష్ణారావులు 'అమ్మ మాట -- అంగన్వాడి బాట' కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.వేసవి సెలవుల అనంతరం అంగన్వాడి కేంద్రాలు పునఃప్రారంభమైన సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో మంత్రి సీతక్క మాట్లాడుతూ చిన్నారులను సంపూర్ణ నైపుణ్యాలతో తీర్చిదిద్దడంలో అంగన్వాడి కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. నిరుపేద కుటుంబాలు అధిక మొత్తంలో డబ్బులు ఖర్చు చేసి ప్రైవేట్ పాఠశాలలకు పంపించకుండా ప్రభుత్వ అంగన్వాడి కేంద్రాల్లోనే పిల్లలను చేర్పించాలని సూచించారు.ప్రస్తుతం అంగన్వాడి కేంద్రాలను ప్రైవేట్ పాఠశాలలకు ఏమాత్రం తీసిపోకుండా ఆధునిక సౌకర్యాలతో నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. త్వరలోనే అన్ని అంగన్వాడి కేంద్రాలకు పక్కా భవనాలు నిర్మించనున్నట్లు తెలిపారు. అంగన్వాడి కేంద్రాల్లో ప్రాథమిక విద్యను మరింత బలోపేతం చేస్తున్నామని, పిల్లలకు 'అమ్మ ముద్ద' పేరుతో అల్పాహారం అందించే పైలట్ ప్రాజెక్టుకు ఆదిలాబాద్ జిల్లాను ఎంపిక చేసినట్లు వెల్లడించారు.అలాగే అంగన్వాడి కేంద్రాల్లో ఉన్న ఖాళీలను త్వరలో భర్తీ చేసి, ఉపాధ్యాయులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి వారి వేతనాల పెంపు దిశగా కూడా చర్యలు చేపడుతున్నట్లు మంత్రి సీతక్క తెలిపారు.అనంతరం ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ నిరుపేద కుటుంబాలకు పిల్లలే నిజమైన ఆస్తి అని అన్నారు. చిన్ననాటి నుంచే పిల్లలను ప్లే స్కూళ్లు, అంగన్వాడి కేంద్రాల్లో చేర్పించి మంచి అలవాట్లు నేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. ప్రభుత్వ భాగస్వామ్యంతో పాటు ప్రజల భాగస్వామ్యం కూడా అభివృద్ధికి ఎంతో అవసరమని పేర్కొన్నారు.ఇక జిల్లాలోని రెండు నియోజకవర్గాల గిరిజన కుటుంబాలకు చెందిన సుమారు వెయ్యి మందికి హైదరాబాద్ నగరాన్ని సందర్శించే అవకాశం కల్పిస్తామని మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రకటించారు. ఎన్నడూ హైదరాబాద్ చూడని గిరిజనులకు ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు.ఈ సందర్భంగా చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించడంతో పాటు అన్నప్రాసన కార్యక్రమాలు చేపట్టారు. విద్యార్థులకు ఏకరూప దుస్తులు, ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేసి చిన్నారులను ఆశీర్వదించారు.ప్రజాప్రతినిధులు, అధికారులు, అంగన్వాడి సిబ్బంది, తల్లిదండ్రులు మరియు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.మొదటగా జిల్లా కలెక్టర్ శ్రీమతి శ్రీ హరిత మేడం గారు అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించి చిన్నారులతో, అంగన్వాడి టీచర్స్ తో మాట్లాడారు, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ శ్వేత శుక్ల, గోలేటి సర్పంచ్ అజ్మీరా బాబురావు, ఆసిఫాబాద్ జిల్లా కాంగ్రెస్ ఇంచార్జి శ్యాం నాయక్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ కాంబ్లే అనిల్, మార్కెట్ కమిటీ ఇరుకుల్ల మంగ, తెలంగాణ రాష్ట్ర గిరిజన కార్పోరేషన్ చైర్మన్ తిరుపతి, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి స్వరూపారాణి, అంగన్వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు

# తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ పరేడ్ రిహార్సల్స్‌ను పరిశీలించిన ఎస్పీ





**వికారాబాద్, జూన్,01(సమయం న్యూస్) :** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని జూన్ 2వ తేదీన జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించబోయే అధికారిక కార్యక్రమాల కోసం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న పరేడ్ యొక్క రిహార్సల్స్‌ను వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఐపీఎస్ సోమవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా పరేడ్ ప్రదర్శనను దగ్గరుండి గమనించిన ఎస్పీ వేడుకలను అత్యంత ప్రతిష్టాత్మకంగా, క్రమశిక్షణతో నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని, విధుల్లో ఎలాంటి అలసత్వాన్ని సహించేది లేదని స్పష్టం చేశారు.రిహార్సల్స్ అనంతరం ఎస్పీ మాట్లాడుతూ "తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం అనేది రాష్ట్ర ప్రజలందరికీ ఎంతో పవిత్రమైన, గర్వకారణమైన రోజు. ఈ వేడుకల్లో పోలీస్ శాఖ తరఫున నిర్వహించే పరేడ్ అత్యంత ఆకర్షణీయంగా,గౌరవప్రదంగా ఉండాలి. కవాతులో పాల్గొనే ప్రతి ఒక్క పోలీస్ అధికారి, సిబ్బంది తమ వృత్తిపరమైన నైపుణ్యాన్ని, క్రమశిక్షణను ప్రదర్శించాలి. సమయపాలన పాటిస్తూ, అంకితభావంతో పనిచేసి పరేడ్‌ను విజయవంతం చేయాలి. వికారాబాద్ జిల్లా పోలీస్ పక్షాన ఈ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని రకాల బందోబస్తు ఏర్పాట్లు పూర్తి చేశాం" అని పేర్కొన్నారు.అనంతరం వేదిక పరిసర ప్రాంతాలను, ట్రాఫిక్ నియంత్రణ మార్గాలను పరిశీలించిన ఎస్పీ అధికారులకు పలు కీలక సూచనలు జారీ చేశారు. వేడుకలకు వచ్చే ప్రజాప్రతినిధులు, విఐపిలు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాలని, వాహనాల పార్కింగ్ విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపినారు.తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణాలర్పించిన అమరవీరులకు నివాళులర్పించే అమరవీరుల స్తూపం వద్దకూ ప్రముఖులు, ప్రజాప్రతినిధులు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్నందున, కట్టుదిట్టమైన, బందోబస్తు ఏర్పాటు చేయాలని ఎస్పీ అధికారులను ఆదేశించారు. అక్కడ ఎలాంటి ఇబ్బంది కల్గకుండా బారికేడ్లను ఏర్పాటు చేయాలని సూచించారు. బందోబస్త్ తో పాటు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని తెలిపినారు.ఈ కార్యక్రమం లో వికారాబాద్ డీఎస్పీ అంజయ్య,ఏఆర్ డీఎస్పీ వీరేష్, వికారాబాద్ టౌన్ ఇన్స్పెక్టర్ రఘు కుమార్, RI నాగరాజు, ఇతర అధికారులు పాల్గొనడం జరిగింది.

# ఆన్‌లైన్ బెట్టింగ్ ముఠాపై సీఐడీ భారీ ఆపరేషన్

- **11 మంది అరెస్ట్.. 46 బ్యాంకు ఖాతాలు సీజ్.. 108 బెట్టింగ్ యాప్‌లపై చర్యలు**



**హైదరాబాద్, జూన్ 1:( సమయం న్యూస్) :** తెలంగాణలో ఆన్‌లైన్ బెట్టింగ్, గేమింగ్ ముఠాలపై సీఐడీ చేపట్టిన ప్రత్యేక ఆపరేషన్‌లో కీలక పురోగతి సాధించింది. కరీంనగర్‌లో నమోదైన "డాఫా బెట్" కేసును ఛేదించిన సీఐడీ అధికారులు ఢిల్లీ, గుజరాత్, పంజాబ్ రాష్ట్రాల్లో నిర్వహించిన పాన్-ఇండియా ఆపరేషన్‌లో 11 మంది నిందితులను అరెస్ట్ చేశారు. సీఐడీ చీఫ్ చారు సిన్హా మీడియాతో మాట్లాడుతూ, ఆన్‌లైన్ బెట్టింగ్ నియంత్రణ కోసం తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక సిట్ ఏర్పాటు చేసిందని తెలిపారు. సిట్ నుంచి సీఐడీకి బదిలీ అయిన కేసులపై లోతైన దర్యాప్తు చేపట్టామని చెప్పారు.ఈ కేసులో నిందితులు రోజుకు రూ.8 నుంచి రూ.10 లక్షల వరకు అక్రమంగా సంపాదిస్తున్నట్లు విచారణలో వెల్లడైందన్నారు. 40 మంది అధికారులతో కూడిన బృందం 15 రోజుల పాటు ప్రత్యేక ఆపరేషన్ నిర్వహించి నిందితులను పట్టుకున్నట్లు తెలిపారు. నిందితుల నుంచి మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు సహా బెట్టింగ్ నిర్వహణకు వినియోగించే పరికరాలను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.ఈ అంతర్జాతీయ బెట్టింగ్ నెట్‌వర్క్‌కు సంబంధించిన 46 మ్యూల్ బ్యాంక్ ఖాతాలను సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. "డాఫా బెట్"కు సంబంధించి దేశవ్యాప్తంగా 8 రాష్ట్రాల్లో 225 ఫిర్యాదులు, 73 క్రిమినల్ కేసులు నమోదైనట్లు తెలిపారు.రాష్ట్రవ్యాప్తంగా ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లపై 414 కేసులు నమోదు చేసినట్లు సీఐడీ వెల్లడించింది. 108 బెట్టింగ్ యాప్‌లను గుర్తించి కేంద్ర ప్రభుత్వానికి బ్లాకింగ్ ప్రతిపాదనలు పంపినట్లు తెలిపింది. అలాగే ఇంటర్నెట్ సర్వీస్ ప్రొవైడర్ల సహకారంతో 37 యాప్‌లపై తెలంగాణలో మాత్రమే అందుబాటును నిలిపివేసేలా జియో-ఫెన్సింగ్ అమలు చేసినట్లు పేర్కొంది.ఆన్‌లైన్ బెట్టింగ్‌ను ప్రచారం చేసిన 25 మంది సెలబ్రిటీలు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లకు కౌన్సెలింగ్ నిర్వహించినట్లు చారు సిన్హా తెలిపారు. వారికి ఒక అవకాశం ఇచ్చామని, భవిష్యత్తులో మళ్లీ ఇటువంటి ప్రచారం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


# వర్షాకాల సన్నద్ధతపై సీఎం సమీక్ష

**ప్రాజెక్టుల నిర్వహణ పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశం**



**హైదరాబాద్, జూన్ 1( సమయం న్యూస్) :** వర్షాకాల సన్నద్ధతపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. వ్యవసాయ, నీటిపారుదల, పట్టణాభివృద్ధి, పంచాయతీరాజ్, ఆరోగ్య, హోంశాఖ, హైడ్రా, విపత్తు నిర్వహణ, అగ్నిమాపక శాఖల ఉన్నతాధికారులు సమావేశానికి హాజరయ్యారు.ఈ సందర్భంగా నైరుతి రుతుపవనాల ప్రభావం, వర్షపాతం అంచనాలు, ఎల్‌నినో పరిస్థితులు తదితర అంశాలపై వాతావరణ శాఖ అధికారులు ప్రజెంటేషన్ ఇచ్చారు. వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సీఎం సూచించారు. తక్కువ నీరు వినియోగించే పంటలు, పంటల మార్పిడి, పంటల వైవిధ్యంపై రైతులకు విస్తృతంగా తెలియజేయాలని ఆదేశించారు.రాష్ట్రంలోని ప్రాజెక్టుల నిర్వహణ పనుల పురోగతిపై ఆరా తీసిన ముఖ్యమంత్రి, గేట్లు మరియు ఇతర నిర్వహణ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అవసరమైన నిధులను వెంటనే విడుదల చేయాలని సూచించారు. విపత్తు నిర్వహణ శాఖ వద్ద ఉన్న రూ.1,000 కోట్ల నిధులను నిబంధనల ప్రకారం సమర్థంగా వినియోగించాలని సీఎం స్పష్టం చేశారు. వర్షాల కారణంగా దెబ్బతిన్న రహదారులు, కూలిపోయిన వంతెనల పునర్నిర్మాణానికి అవసరమైన నిధులను తక్షణమే విడుదల చేయాలని ఆదేశించారు.విపత్తుల సమయంలో ప్రాణ, ఆస్తి, పశు నష్టం సంభవించిన వెంటనే అధికారులు స్పందించి సహాయక చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు.

# కాళేశ్వరంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



**కాళేశ్వరం జూన్01( సమయం న్యూస్) :** సరస్వతి అంత్య పుష్కరాల సందర్భంగా సోమవారం రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్, జగిత్యాల జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంఘంబట్ల దినేష్ సరస్వతి అంత్యపుష్కరాల సందర్భంగా త్రివేణి సంగమంలో పుష్కర స్నానం ఆచరించారు. సరస్వతి నది తీరంలో పుణ్యస్నానం ఆచరించిన అనంతరం మంత్రి శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి వారి ఆలయానికి చేరుకున్న మంత్రికి ఆలయ ఈఓ మహేష్ మరియు అర్చకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు.అనంతరం స్వామివారికి ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించి దర్శనం చేసుకున్నారు. తదుపరి శుభానంద అమ్మవారి ఆలయంలో కూడా ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల అనంతరం ఆశీర్వచన మండపంలో అర్చకులు వేద ఆశీర్వచనం అందించగా, ఆలయ ఈఓ మహేష్ ఆధ్వర్యంలో స్వామివారి శేష వస్త్రాలతో సన్మానించి జ్ఞాపికలను అందజేశారు.ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ రాబోయే గోదావరి పుష్కరాలను బాసర నుండి భద్రాచలం వరకు ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. సరస్వతి పుష్కరాలు ఘనంగా నిర్వహించేలా రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేయడం పట్ల ముఖ్యమంత్రికి, మంత్రి శ్రీధర్ బాబు కి ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర ప్రజలందరూ సుఖ శాంతులతో ఆయురారోగ్యాలతో ఉండాలని సరస్వతి అమ్మవారిని, కాళేశ్వర ముక్తీశ్వర స్వామిని వేడుకున్నట్లు మంత్రి తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు

# ఆహార భద్రతా తనిఖీలను ముమ్మరం చేయాలి

జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక



**నారాయణపేట, జూన్,01(సమయం న్యూస్) :** జిల్లా వ్యాప్తంగా ఆహార భద్రత తనిఖీలను మరింత ముమ్మరం చేయాలని, నిబంధనలు ఉల్లంఘిస్తున్న ఆహార వ్యాపార సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు అవసరమైన చోట జరిమానాలు విధించాలని కలెక్టర్ ప్రియాంక స్పష్టం చేశారు. సోమవారం కలెక్టరేట్ లో తన ఛాంబర్ లో జరిగిన జిల్లా స్థాయి సలహా కమిటీ (District Level Advisory Committee - DLAC)సమావేశానికి కలెక్టర్ అధ్యక్షత వహించారు.సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ రెసిడెన్షియల్ పాఠశాలలు, గురుకులాలు, హాస్టళ్లలో ఆహార భద్రత ప్రమాణాలను ఖచ్చితంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు అందిస్తున్న ఆహారం నాణ్యత, పరిశుభ్రత, నిల్వ విధానాలపై ప్రత్యేక తనిఖీలు చేపట్టాలని ఆమె సూచించారు.ప్రస్తుతం మామిడి పండ్ల సీజన్ కొనసాగుతున్న నేపథ్యంలో కృత్రిమ పక్వానికి (Artificial Ripening) పాల్పడే వ్యాపారులపై ప్రత్యేక నిఘా ఉంచాలని అధికారులకు సూచించారు. కాల్షియం కార్బైడ్ వంటి నిషేధిత రసాయనాలను ఉపయోగించి పండ్లను పక్వానికి తెచ్చే వారిపై తనిఖీలు నిర్వహించి, నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మున్సిపల్ అధికారుల సమన్వయంతో పట్టణంలోని పండ్ల గోదాములను తనిఖీ చేయాలన్నారు. వినియోగదారులకు సురక్షితమైన పండ్లు అందేలా ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించాలని సూచించా రు.అదేవిధంగా, ఆహార వ్యాపార సంస్థల యజమానులు తప్పనిసరిగా FSSAI లైసెన్స్ లేదా రిజిస్ట్రేషన్ పొందాలని కలెక్టర్ తెలిపారు. ఈ మేరకు ప్రతి నెల ఫుడ్ సేఫ్టీ కార్యాలయం లో లైసెన్స్/రిజిస్ట్రేషన్ మేళా నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. అర్హులైన ఆహార వ్యాపారులు కార్యాలయాన్ని సందర్శించి లైసెన్స్ లేదా రిజిస్ట్రేషన్ కోసం దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు.ఈ సందర్భంగా ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ మౌనిక నారాయణపేట జిల్లాలో ఆహార భద్రత అమలు, నిర్వహించిన తనిఖీలు, సేకరించిన నమూనాలు, ఆహార వ్యాపార సంస్థలపై తీసుకున్న చర్యలు, ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు, భవిష్యత్ కార్యాచరణ ప్రణాళిక గురించి కలెక్టర్‌కు క్లుప్తంగా వివరించారు.అలాగే జిల్లాలో ఆహార భద్రతను మరింత బలోపేతం చేసేందుకు చేపడుతున్న చర్యలను సమావేశంలో వివరంగా తెలియజేశారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు, కమిటీ సభ్యులు, సంబంధిత విభాగాల ప్రతినిధులు జిల్లా ప్రజలకు సురక్షితమైన, నాణ్యమైన ఆహారం అందించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని నిర్ణయిం చారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీను, డీ డబ్ల్యు ఓ రాజేందర్ గౌడ్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి జయ చంద్రమోహన్, జిల్లా విద్యా శాఖ అధికారి గోవింద రాజులు పాల్గొన్నారు.

## నేడు ప్రపంచ పాల దినోత్సవం

**హైదరాబాద్, జూన్ 1( సమయం న్యూస్) :** ప్రపంచవ్యాప్తంగా పాల ప్రాధాన్యతను చాటిచెప్పేందుకు ప్రతి ఏడాది జూన్ 1న ప్రపంచ పాల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఐక్యరాజ్యసమితి ఆహార, వ్యవసాయ సంస్థ (ఫీుూ) 2001లో ఈ దినోత్సవాన్ని ప్రారంభించింది.ఈ ఏడాది ప్రపంచ పాల దినోత్సవం థీమ్ లి"మహిళా రైతుల సేవలకు వందనం"లిగా నిర్ణయించారు. పాడి పరిశ్రమ, స్థిరమైన వ్యవసాయం, ఆర్థికాభివృద్ధి, ఆహార భద్రతలో మహిళా రైతులు పోషిస్తున్న కీలక పాత్రను గుర్తించి ఈ అంశాన్ని ఎంపిక చేశారు.భారత శ్వేత విప్లవ పితామహుడు డాక్టర్ వర్గీస్ కురియన్ పాల ఉత్పత్తి రంగాన్ని సామాజిక, ఆర్థిక మార్పులకు సాధనంగా అభివర్ణించారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం, రైతుల ఆదాయ వృద్ధిలో పాల ఉత్పత్తి రంగం కీలక పాత్ర పోషిస్తోందని నిపుణులు పేర్కొంటున్నారు.పొలం నుంచి ప్రజల గ్లాసు వరకు చేరే ప్రతి పాల బొట్టు ఆరోగ్యాన్ని కాపాడటమే కాకుండా, దేశ ఆహార భద్రతకు బలమైన పునాదిగా నిలుస్తోందని ఈ సందర్భంగా అధికారులు తెలిపారు.

## నేటి నుండిహాజరత్ నౌషా బాలే సాహెబ్ ఉరుస్ ఉత్సవాలు

**యాలాల మండలం, జూన్,01(సమయం న్యూస్)** :హజరత్ నౌషా బాలే సాహెబ్ ఉరుసు ఉత్సవాలు - యాలాల మండల కేంద్రం లో మూడు రోజుల ఉరుసు జరగనుంది. ఉరుసు ముబారక్ మొదటి రోజు: 2-6-2026 సందల్ (గందాలు)రెండవ రోజు: 3-6-2026బి చిరాగాన్ ....మూడవ రోజు: 4-6-2026బి జియారత్ మహబ్బత్ ఉన్న అందరినీ పాల్గొనవలసిందిగా కోరుతున్నాము

అల్లాహ్ దయతో ఉరుసు షరీఫ్ ఉత్సవాలు క్షేమంగా, ఘనంగా జరగాలి మీరందరూ పెద్ద సంఖ్యలో పాల్గొనవలసిందిగా విజ్ఞప్తి చేయుచుంన్నాము:దర్గా కమ్యూటీ అధ్యక్షులు గంతల్ మొయినుద్దీన్, సభ్యులు గఫార్ భాయ్,దర్గా ఆరిఫ్ ,కారణకోట్ రజాక్, అక్రమ్,ఖాజా బేగ్, హాసన్ ఖాన్ సాబ్ ,తదితరులు

## కొత్త బస్సు సర్వీస్ ను ప్రారభించిన కడియం శ్రీహరి



**స్టేషన్ ఘనపూర్ జూన్1( సమయం న్యూస్) :** వేలేరు నుండి హైదరాబాద్ వెళ్లే కొత్త ఎక్స్ ప్రెస్ బస్సు సర్వీస్ కు వేలేరు మండల కేంద్రంలో మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి గారు జెండా ఊపి ప్రారంభించారు. ఈ కొత్త బస్సు సర్వీస్ వేలేరులో ఉదయం 4:00గంటలకు బయలుదేరి కమ్మరిపేట, బండ తండా, నారాయణగిరి, ముప్పారం, సాయిపేట, క్యాతంపల్లి, పెద్దపెండ్యాల, కరుణాపురం మీదుగా సికింద్రాబాద్ జూబ్లీ బస్టాండ్ కు ఉదయం 8:00 గంటలకు చేరుకుంటుంది అని తెలిపారు. తిరిగి సాయంత్రం 04:00 గంటలకు సికింద్రాబాద్ నుండి బయలుదేరి రాత్రి 08:00 గంటలకు వేలేరు కు చేరుకుంటుందని తెలిపారు. ప్రయాణికులు ఈ బస్సు సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ ఎక్స్ ప్రెస్ సర్వీస్ ద్వారా మహిళలు ఉచిత ప్రయాణ సదుపాయాన్ని పొందవచ్చని అన్నారు. జూన్ 2నుండి వేలేరు వరకు వచ్చే బస్సులను గొల్లకిష్టంపల్లి వరకు పొడిగించునున్నట్లు ప్రకటించారు. ఈ బస్సు సర్వీస్ వెళ్లే ఆయా గ్రామాల ప్రజలు, ప్రయాణికులు ఆర్టీసీ సిబ్బందికి సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జనగామ ఆర్టీసీ డిపో మేనేజర్, వేలేరు, ధర్మసాగర్ మండలాల సర్పంచులు, తహసీల్దార్లు, ఎంపిడివోలు, ఇతర ప్రజా ప్రతినిధులు, అధికారులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


## రాష్ట్ర అవతరణ దినోత్స వేడుకల ఏర్పాట్లను పరిశీలించిన సిపి



**హన్మకొండ జూన్1( సమయం న్యూస్) :** తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవానికి సంబంధించి రేపు వరంగల్ కమిషనరేట్ పరేడ్ మైదానంలో జరిగే వేడుకలకు సంబంధించి ఏర్పాట్లను వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బంది పరేడ్ నిర్వహణ, ఈ వేడుకలను వచ్చే అతిధులకు భద్రత కోసం చేస్తున్న భద్రత ఏర్పాట్లపై సంబంధిత పోలీస్ అధికారులను అడిగి తెలుసుకోవడంతో పాటు, కార్యక్రమము సజావు కోనసాగేందుకుగాను తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పోలీస్ కమిషనర్ అధికారులు పలు సూచనలను చేసారు.

## తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల రిహార్సల్స్ పరిశీలించిన..

అదనపు ఎస్పీ (డీఏఆర్) ఎం.డి. రియాజ్ హుల్ హక్



**నారాయణపేట, జూన్,01(సమయం న్యూస్) :** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించనున్న జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమానికి సంబంధించి సెర్మోనియల్ గార్డ్ రిహార్సల్స్‌ను అదనపు ఎస్పీ (డీఏఆర్) ఎం.డి. రియాజుల్ హక్ సోమవారం పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన సెర్మోనియల్ గార్డ్ సిబ్బంది నిర్వహించిన కవాతును, గౌరవ వందనం ప్రక్రియను నిశితంగా పరిశీలించి పలు సూచనలు చేశారు. రాష్ట్ర అవతరణ దినోత్సవం తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీక అని, ఈ వేడుకలను అత్యంత గౌరవప్రదంగా, క్రమశిక్షణతో నిర్వహించాల్సిన బాధ్యత పోలీసు శాఖపై ఉందన్నారు.గార్డ్ ఆఫ్ ఆనర్‌లో పాల్గొనే సిబ్బంది సమయపాలన, ఏకరూపత, క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలని సూచించారు. జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఎలాంటి లోటుపాట్లు లేకుండా విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంటీవో, ఆర్ఐ, విజయ్ భాస్కర్, ఆర్ఎస్ఐ శివశంకర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ఓవర్సీస్ స్కాలర్ షిప్ కోసం దరఖా స్తుల ఆహ్వానం

ఎం.సుధీర్ మైనారిటీ సంక్షేమ అధికారి (ఇంచార్జి)వికారాబాద్ జిల్లా



**వికారాబాద్,జూన్,01(సమయం న్యూస్) :** మైనారిటీ విద్యార్థుల కోసం చీఫ్ మినిస్టర్ ఓవర్సీస్ స్కీమ్ స్కాలర్షిప్ కింద ఆన్లైన్ దరఖాస్తులు చేసుకోవాలని మైనార్టీ సంక్షేమ అధికారి (ఇంచార్జి) ఎం. సుధీర్ ఒక ప్రకటనలో తెలిపారు.జూన్ 1వ తేది నుండి 30వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ నిర్వహించిన చీఫ్ మినిస్టర్ ఓవర్సీస్ స్కాలర్షిప్ పథకం ఫాల సీజన్ 2026 కింద, విదేశాలలో ఉన్నత విద్య (పోస్ట్ గ్రాడ్యుయేట్/పీహెచ్) చదువుతున్న మైనారిటీ విద్యార్థుల నుండి ఆన్లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. అమెరికా, యుకె, ఆస్ట్రియా, కెనడా, సింగపూర్, జర్మనీ, దక్షిణ కొరియా, జపాన్, ఫ్రాన్స్, న్యూజిలాండ్ వంటి విదేశీ దేశాల గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయా లలో జూన్ 1 నుండి 30 వరకు పోస్ట్ గ్రాడ్యుయేట్ లేదా పిహెచి అధ్యయనాలలో ప్రవేశం పొందిన ప్రభుత్వ అర్హత నియమాలన్నింటినీ నెరవేర్చిన అర్హతగల అభ్య ర్థులు తమ దరఖాస్తులను వెబ్సైట్లో (డబ్ల్యూ డబ్ల్యూ. తెలంగాణ ఈపాస్. సిజిజి. జిఓవి. ఇన్) సమర్పించవచ్చని తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 30 సాయంత్రం 5.00 గంటల వరకు ఆన్లైన్లో దరఖాస్తులను సమర్పించవచ్చని తెలిపారు. తరువాత, దరఖాస్తు హార్డ్ కాపీ మరియు అవసరమైన పత్రాలు/ధృవపత్రాలను 31-07-2026 సాయంత్రం 5.00 గంటలలోపు జిల్లా అధికారి, మైనారిటీ సంక్షేమ శాఖ, వికారాబాద్ కు సమర్పించండి.ఈ పథకం కింద ఎంపికైన విద్యార్థులకు రూ.20 లక్షలు మరియు రూ.60,000 వన్-వే విమాన ఛార్జీ (లేదా వాస్తవ ఛార్జీ, ఏది తక్కువైతే అది) ఇవ్వబడుతుందని ఆయన చెప్పారు.పత్రాల పరిశీలన సమయంలో నకిలీ సర్టిఫికెట్లు ఉంటే అభ్యర్థులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.వయస్సు, విద్యార్హత, వార్షిక ఆదాయం, ఇతర ముఖ్యమైన వివరాలతో సహా పథకం యొక్క అన్ని వివరాల కోసం, వెబ్సైట్ను సందర్శించాలని వికారాబాద్ లో అర్హులైన మైనారిటీ విద్యార్థులు ఈ సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## రామగుండం యురియా తెలంగాణకే కేటాయించాలని కేంద్రానికి లేఖ: సీఎం



హైదరాబాద్, జూన్ 1: రామగుండం ఫెర్టిలైజర్స్ ఫ్యాక్టరీలో ఉత్పత్తి అయ్యే యురియా మొత్తాన్ని తెలంగాణ రాష్ట్రానికే కేటాయించాలని కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. రాష్ట్ర రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ మేరకు కేంద్రాన్ని కోరనున్నట్లు వెల్లడించారు.వర్షాకాల సన్నద్ధత, పరిపాలనా సమన్వయంపై నిర్వహించిన సమీక్షలో సీఎం కీలక ఆదేశాలు జారీ చేశారు. జిల్లా స్థాయిలో కలెక్టర్లు, ఎస్పీలు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. నిర్ణీత వ్యవధిలో సమీక్ష సమావేశాలు నిర్వహించి సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.అదేవిధంగా క్యూర్ (జఖ=జు) పరిధిలోని మూడు నగర కార్పొరేషన్ల కమిషనర్లు, పోలీస్ కమిషనర్లు సమన్వయంతో ముందుకు సాగాలని సీఎం స్పష్టం చేశారు. అభివృద్ధి పనులు, ప్రజా సేవల అమలులో శాఖల మధ్య సమన్వయం పెంచి మెరుగైన ఫలితాలు సాధించాలని సూచించారు.

## 'ఖేత్ బచావో అభియాన్'కు జూన్ 1న శ్రీకారం

**న్యూ డిల్లీ జూన్ 1( సమయ్దం న్యూస్) :**రైతులు, వ్యవసాయ భూముల పరిరక్షణ లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం 'ఖేత్ బచావో అభియాన్'ను జూన్ 1న మధ్యప్రదేశ్‌లోని రైసెన్ నుంచి ప్రారంభించనుంది. కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఈ కార్యక్రమాన్ని జాతీయ ప్రజా ఉద్యమంగా మార్చాలని పిలుపునిచ్చారు. సమతుల ఎరువుల వినియోగం, ప్రకృతి వ్యవసాయం ప్రోత్సాహం, నకిలీ ఎరువులు--విత్తనాలపై కఠిన చర్యలు ఈ కార్యక్రమంలో ప్రధాన అంశాలుగా ఉంటాయని తెలిపారు. కృషి విజ్ఞాన కేంద్రాలు, ఐసీఏఆర్ సంస్థలు, వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, రాష్ట్ర వ్యవసాయ వ్యవస్థలు ఈ కార్యక్రమంలో భాగస్వాములు కానున్నాయి.దేశంలోని అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులతో మాట్లాడి ఈ కార్యక్రమంలో పాల్గొనాలని శివరాజ్ సింగ్ చౌహాన్ కోరారు. ప్రచారంలో భాగంగా ఆయన వివిధ రాష్ట్రాల్లోని గ్రామాలను సందర్శించి రైతులతో నేరుగా మాట్లాడనున్నారు. "భూమాత గౌరవాన్ని కాపాడటం మన అందరి బాధ్యత" అని కేంద్ర మంత్రి పిలుపునిచ్చారు.

## త్రివేణి సంగమంలో మంత్రి వివేక్, ఎంపీ వంశీకృష్ణ పుష్కర స్నానం



**కాళేశ్వరం:జూన్01( సమయం న్యూస్) :** రాష్ట్ర మైనింగ్, కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్, ఎంపీ గడ్డం వంశీకృష్ణ సోమవారం గోదావరి--ప్రాణహిత--సరస్వతి నదుల త్రివేణి సంగమంలో పుష్కర స్నానం ఆచరించారు. అనంతరం శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామిని దర్శించుకున్నారు.ఈ సందర్భంగా మంత్రి వివేక్ మాట్లాడుతూ గోదావరి పుష్కరాలను వచ్చే సంవత్సరం ఘనంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమవుతోందన్నారు. ఇందుకోసం సుమారు రూ.1000 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. గోదావరి పరివాహక జిల్లాల్లో విస్తృత ఏర్పాట్లు చేపట్టి, భక్తులకు మెరుగైన రహదారులు, మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.కాలేశ్వరం దేవాలయ అభివృద్ధికి మంత్రి శ్రీధర్‌బాబు కృషి చేస్తున్నారని, ముఖ్యమంత్రి ఇప్పటికే అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారని పేర్కొన్నారు. బాసర దేవాలయ అభివృద్ధికి కూడా రూ.170 కోట్లతో పనులు చేపడుతున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని ప్రముఖ ఆలయాలను పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.ఎంపీ గడ్డం వంశీకృష్ణ మాట్లాడుతూ త్రివేణి సంగమంలో పుష్కర స్నానం ఎంతో పవిత్రమని అన్నారు. సరస్వతి అమ్మవారి, శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆశీర్వాదంతో ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖశాంతులు కలగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, దేవాలయ చైర్మన్ మోహన్ శర్మ, అర్చకులు పాల్గొన్నారు.

## జిల్లా వ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్ అమలు

జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS



**నారాయణపేట, జూన్,01(సమయం న్యూస్) :** శాంతి భద్రతల పరిరక్షణ దృష్ట్యా నారాయణపేట జిల్లా వ్యాప్తంగా ఈ నెల రోజుల పాటు "30 పోలీస్ ఆక్ట్" అమల్లో ఉంటుందని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ... 30 పోలీస్ ఆక్ట్, జూన్ నెల 30 వరకు అమల్లో ఉన్నందున జిల్లాలో పోలీసు అధికారుల అనుమతులు లేకుండా ఎలాంటి ర్యాలీలు, సమావేశాలు, ఊరేగింపులు, ధర్నాలు, ఫంక్షన్ హాల్లో కార్యక్రమాలు, బహిరంగ సభలు, ప్రజలు గుమ్మిగుడి ఉండే విధంగా కార్యక్రమాలు నిర్వహించడానికి సన్నాహాలు చేయరాదని తెలిపారు. అనుమతులు లేకుండా పై కార్యక్రమాలు నిర్వహించిన నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తప్పవని తెలిపారు. ప్రజా జీవనానికి ఇబ్బంది కలిగించేందుకు దారి తీసే సమావేశాలు, జన సమూహం చేయడం పూర్తిగా నిషేధమని తెలిపారు. సోషల్ మీడియా నందు అనవసరమైన విషయాలను, మతాల మధ్య చిచ్చు పెట్టే అంశాలను వ్యాప్తి చేసిన వారిపై కేసులను నమోదు చేయబడతాయని తెలిపారు. చట్టపరంగా జారీ చేసిన ఆదేశాలను ఎవరైనా ఉల్లంఘించినట్లయితే 30 పోలీస్ ఆక్ట్ ప్రకారం శిక్ష అర్హులవుతారని తెలిపారు. నిషేధం లో ఉన్న నిబంధనలు తప్పనిసరిగా అందరూ పాటించాలని ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించాలన్న ముందస్తు దరఖాస్తు చేసుకునే అనుమతులు తీసుకోవాలని ఎస్పీ కోరారు.



# అవార్డులతో కోట్ల వర్షం

## వైభవ్ ఖాతాలో రూ.2.5 కోట్లకు పైగా

**అహ్మదాబాద్, జూన్ 1:** భారత యువ క్రికెట్ సంచలనం వైభవ్ సూర్యవంశీ ఐపీఎల్ 2026 సీజన్‌లో తన అద్భుత బ్యాటింగ్‌తో అభిమానులను మంత్రముగ్ధులను చేశాడు. కేవలం 15 ఏళ్ల వయసులోనే టోర్నీ మొత్తాన్ని శాసించిన ఈ యువ ఆటగాడు పరుగుల వరద పారించడమే కాకుండా భారీ మొత్తంలో నగదు బహుమతులు కూడా సొంతం చేసుకున్నాడు. ఈ సీజన్‌లో మ్యాచ్ ఫీజులు, అవార్డులు, నగదు బహుమతులు కలిపి అతని ఆదాయం రూ. 2.5 కోట్లకు పైగా చేరినట్లు సమాచారం. ఈ సీజన్‌లో రాజస్థాన్ రాయల్స్ తరఫున ఆడిన వైభవ్ 776 పరుగులు చేసి అత్యధిక పరుగులు సాధించిన ఆటగాడిగా నిలిచాడు. గత సీజన్ వేలంలో రూ. 1.10 కోట్లకు అతడిని కొనుగోలు చేసిన రాజస్థాన్ జట్టు ఈసారి కూడా అతడిని కొనసాగించింది. జట్టు ఫైనల్‌కు చేరకపోయినా, వ్యక్తిగత ప్రదర్శనతో వైభవ్ ప్రత్యేక గుర్తింపు సంపాదించాడు. సీజన్ ముగింపు సందర్భంగా అతడికి పలు ప్రతిష్ఠాత్మక అవార్డులు లభించాయి. అత్యంత విలువైన ఆటగాడిగా ఎంపికై రూ. 15 లక్షలు అందుకోగా, అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా రూ. 10 లక్షల నగదు బహుమతి దక్కింది. అత్యుత్తమ దూకుడు బ్యాటర్‌గా ఎంపికై మరో రూ. 10 లక్షలతో పాటు ఒక కారు కూడా సొంతం చేసుకున్నాడు. సీజన్‌లో అత్యధిక సిక్సర్లు బాదిన ఆటగాడిగా మరో రూ. 10 లక్షలు, ఉత్తమ యువ ఆటగాడిగా మరో రూ. 10 లక్షలు అందుకున్నాడు. ఇక మ్యాచ్ ఫీజుల రూపంలో కూడా వైభవ్ భారీ మొత్తాన్ని ఆర్జించాడు. మొత్తం 16 మ్యాచ్‌లు ఆడిన అతడికి ఒక్కో మ్యాచ్‌కు రూ. 7.5 లక్షల చొప్పున సుమారు రూ. 1.20 కోట్లు లభించాయి. అదనంగా మ్యాచ్‌లో అత్యుత్తమ ఆటగాడు, అత్యధిక సిక్సర్లు, వేగవంతమైన ఇన్నింగ్స్ వంటి విభాగాల్లో కూడా పలు నగదు బహుమతులు గెలుచుకున్నాడు. మొత్తంగా జట్టు ఒప్పందం, మ్యాచ్ ఫీజులు, వ్యక్తిగత అవార్డులు, ప్రత్యేక బహుమతులు అన్నీ కలిపి వైభవ్ సూర్యవంశీ ఈ సీజన్‌లో రూ. 2.5 కోట్లకు పైగా ఆర్జించినట్లు అంచనా. కేవలం 15 ఏళ్ల వయసులోనే ఇంతటి విజయాన్ని సాధించిన ఈ యువ క్రికెటర్ భవిష్యత్తులో భారత క్రికెట్‌కు కీలక ఆటగాడిగా ఎదుగుతాడనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



# ట్రోఫీ గెలిచిన ఆనందంలో అనుష్క, దినేశ్ కార్తిక్ ఎమోషనల్ హగ్..


## విరాట్ రియాక్షన్ మామూలుగా లేదుగా.!



ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026 సీజన్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మరోసారి తమ ఆధిపత్యాన్ని చాటుకుంది. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో జరిగిన ఫైనల్లో గుజరాత్ టైటాన్స్‌ను 5 వికెట్ల తేడాతో ఓడించి వరుసగా రెండోసారి ఐపీఎల్ ట్రోఫీని కైవసం చేసుకుంది. గత సీజన్‌లో పంజాబ్ కింగ్స్‌ను ఓడించి తొలి టైటిల్ సాధించిన ఆర్సీబీ, ఇప్పుడు మరోసారి విజేతగా నిలిచి తమ జోరును కొనసాగించి గుజరాత్ టైటాన్స్‌పై విజయం సాధించి ట్రోఫీని కైవసం చేసుకుంది. ఫైనల్ మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్ నిర్దేశించిన 156 పరుగుల లక్ష్యాన్ని ఆర్సీబీ ఛేదించింది. ఈ విజయంతో జట్టు శిబిరంలో సంబరాలు అంబరాన్నంటాయి. ఆటగాళ్లు, కోచింగ్ సిబ్బంది, అభిమానులు ఆనందంలో మునిగిపోయారు. విజయానంతరం జరిగిన సెలబ్రేషన్లకు సంబంధించిన వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ వేడుకల్లో విరాట్ కోహ్లీ భార్య అనుష్క శర్మ కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. జట్టు సభ్యులు, సపోర్ట్ స్టాఫ్‌తో కలిసి ఆమె విజయాన్ని ఘనంగా జరుపుకున్నారు. ముఖ్యంగా ఆర్సీబీ బ్యాటింగ్ కోచ్, మెంటర్ దినేశ్ కార్తిక్‌ను అనుష్క హత్తుకున్న వీడియో అభిమానులను ఆకట్టుకుంటోంది. ఆ సమయంలో పక్కనే నిలబడి ఉన్న విరాట్ కోహ్లీ కూల్ రియాక్షన్ కూడా సోషల్ మీడియాలో చర్చనీయాంశమైంది.

# మహిళల టీ20ల్లో చరిత్ర సృష్టించిన ఐర్లాండ్

## పాకిస్తాన్‌కు భారీ షాక్



**డబ్లిన్, జూన్ 1 :** మహిళల అంతర్జాతీయ టీ20 క్రికెట్ చరిత్రలో ఐర్లాండ్ జట్టు అరుదైన ఘనత సాధించింది. పాకిస్తాన్ నిర్దేశించిన 176 పరుగుల భారీ లక్ష్యాన్ని విజయవంతంగా ఛేదించి, మహిళల టీ20ల్లో అత్యధిక పరుగుల లక్ష్యాన్ని ఛేదించిన జట్టుగా కొత్త చరిత్ర సృష్టించింది. మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన పాకిస్తాన్ మహిళల జట్టు నిర్ణీత 20 ఓవర్లలో భారీ స్కోరు నమోదు చేసి ఐర్లాండ్ ముందు 176 పరుగుల లక్ష్యాన్ని ఉంచింది. లక్ష్యం కఠినంగా కనిపించినప్పటికీ, ఐర్లాండ్ బ్యాటర్లు ఆరంభం నుంచే దూకుడుగా ఆడుతూ మ్యాచ్‌పై పట్టు సాధించారు. క్రీజులో నిలకడగా రాణించిన ఆమీ హంటర్ 56 పరుగులతో జట్టుకు బలమైన ఆరంభం అందించింది. మరోవైపు రెబెకా స్టాకెల్ అద్భుత బ్యాటింగ్‌తో 60 పరుగులు చేసి చివరి వరకు అజేయంగా నిలిచింది. వీరిద్దరి అర్ధశతకాలతో ఐర్లాండ్ జట్టు లక్ష్యాన్ని కేవలం 19.1 ఓవర్లలోనే మూడు వికెట్లు మాత్రమే కోల్పోయి చేరుకుంది. ఈ విజయంతో మహిళల టీ20 అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యధిక పరుగుల లక్ష్యాన్ని విజయవంతంగా ఛేదించిన జట్టుగా ఐర్లాండ్ రికార్డు సృష్టించింది. పాకిస్తాన్ బౌలర్లు భారీ స్కోరు సాధించినప్పటికీ, ఐర్లాండ్ బ్యాటర్ల ధాటికి నిలువలేకపోయారు. చారిత్రాత్మక విజయంతో ఐర్లాండ్ మహిళల జట్టు ప్రపంచ క్రికెట్ దృష్టిని ఆకర్షించగా, ఆమీ హంటర్, రెబెకా స్టాకెల్ ఇన్నింగ్స్‌లు జట్టు విజయానికి ప్రధాన కారణాలుగా నిలిచాయి. ఈ విజయాన్ని మహిళల ఐర్లాండ్ క్రికెట్ చరిత్రలో ఒక మైలురాయిగా క్రీడా విశ్లేషకులు అభివర్ణిస్తున్నారు.

# ఐపీఎల్ 2026 అత్యుత్తమ జట్టు ప్రకటింపు

## ఆర్సీబీ ఆటగాళ్ల హవా



**అహ్మదాబాద్, జూన్ 1 :** ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026 సీజన్ ముగియడంతో టోర్నీలో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన ఆటగాళ్లతో కూడిన అత్యుత్తమ తుది జట్టుపై చర్చలు జోరందుకున్నాయి. ఈ సీజన్‌లో ఛాంపియన్‌గా నిలిచిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు పూర్తి ఆధిపత్యం చాటుతూ అత్యుత్తమ జట్టులో ఏకంగా ఐదుగురు ఆటగాళ్లను నిలబెట్టడం విశేషంగా మారింది. ఈ సీజన్‌లో 776 పరుగులు చేసి అత్యధిక పరుగుల వీరుడిగా నిలిచిన 15 ఏళ్ల సంచలనం వైభవ్ సూర్యవంశీకి ఓపెనర్‌గా స్థానం లభించింది. అతడితో పాటు గుజరాత్ టైటాన్స్ బ్యాటర్ సాయి సుదర్శన్ మరో ఓపెనర్‌గా ఎంపికయ్యాడు. మూడో స్థానంలో విరాట్ కోహ్లీ చోటు దక్కించుకోగా, మధ్య వరుసలో హెన్రిచ్ క్లాసెన్, రజత్ పటీదార్, కృనాల్ పాండ్యా స్థానం సంపాదించారు. ఈ జట్టుకు కెప్టెన్‌గా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు సారథి రజత్ పటీదార్‌ను ఎంపిక చేశారు. వరుసగా రెండోసారి జట్టును టైటిల్ విజేతగా నిలబెట్టడంలో అతడి నాయకత్వం కీలకంగా నిలిచింది. ఆల్‌రౌండర్ విభాగంలో రషీద్ ఖాన్‌కు చోటు దక్కగా, బౌలింగ్ విభాగంలో జోఫ్రా ఆర్చర్, భువనేశ్వర్ కుమార్, కగిసో రబాడ, రసిఖ్ సలామ్ దార్ ఎంపికయ్యారు. ఈ సీజన్‌లో 29 వికెట్లు తీసి అత్యధిక వికెట్ల బౌలర్‌గా నిలిచిన కగిసో రబాడ పర్పుల్ క్యాప్‌ను సొంతం చేసుకున్నాడు.

### అత్యుత్తమ తుది జట్టు:

లి వైభవ్ సూర్యవంశీ , సాయి సుదర్శన్ , విరాట్ కోహ్లీ , హెన్రిచ్ క్లాసెన్ , రజత్ పటీదార్ (కెప్టెన్), కృనాల్ పాండ్యా , రషీద్ ఖాన్ , జోఫ్రా ఆర్చర్ , భువనేశ్వర్ కుమార్ , కగిసో రబాడ , రసిఖ్ సలామ్ దార్ అదనపు ప్రభావవంతమైన ఆటగాళ్లుగా ఇషాన్ కిషన్, ప్రిన్స్ యాదవ్, శుభ్‌మన్ గిల్‌లను ఎంపిక చేశారు. సీజన్ మొత్తం నిలకడగా రాణించిన ఆటగాళ్లకు ఈ జట్టులో ప్రాధాన్యం దక్కగా, ఆర్సీబీ మరియు గుజరాత్ టైటాన్స్ ఆటగాళ్లు ఆధిపత్యం చాటారు.



# ఫిఫా వరల్డ్‌కప్ ప్రసార హక్కులు జీ సొంతం

**ముంబై, జూన్ 1 :** భారత ఫుట్‌బాల్ అభిమానులకు జీ ఎంటర్‌టైన్‌మెంట్ శుభవార్త అందించింది. ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మక ఫుట్‌బాల్ టోర్నమెంట్ అయిన ఫిఫా వరల్డ్‌కప్‌కు సంబంధించిన ప్రసార హక్కులను జీ గ్రూప్‌కు చెందిన యునైటెడ్8 స్పోర్ట్స్ దక్కించుకుంది. ఈ ఒప్పందం ప్రకారం 2026, 2030 ఫిఫా వరల్డ్‌కప్‌లతో పాటు పలు ప్రధాన ఫిఫా టోర్నీలు 2034 వరకు జీ నెట్‌వర్క్‌లో ప్రసారం కానున్నాయి. టెలివిజన్ ప్రేక్షకులు యునైటెడ్8 స్పోర్ట్స్ ఛానళ్లలో మ్యాచ్‌లను వీక్షించగలుగుతారు. డిజిటల్ వేదికలో జీ5 ద్వారా ప్రత్యక్ష ప్రసారాలు అందుబాటులో ఉండనున్నాయి. పురుషుల వరల్డ్‌కప్‌తో పాటు మహిళల వరల్డ్‌కప్, అండర్-17, అండర్-20 ప్రపంచకప్‌లు, ఫుట్‌సాల్ ప్రపంచకప్ వంటి ప్రధాన అంతర్జాతీయ టోర్నీల హక్కులు కూడా ఈ ఒప్పందంలో భాగంగా జీ నెట్‌వర్క్‌కు లభించాయి. హిందీ ప్రసారాలు యునైటెడ్8 స్పోర్ట్స్ 1, యునైటెడ్8 స్పోర్ట్స్ 1 హెచ్‌డీ ఛానళ్లలో అందుబాటులో ఉండగా, ఇంగ్లీష్ ప్రసారాలు యునైటెడ్8 స్పోర్ట్స్ 2, యునైటెడ్8 స్పోర్ట్స్ 2 హెచ్‌డీ ఛానళ్లలో ప్రసారం కానున్నాయి. ఈ హక్కుల కోసం మరో ప్రముఖ మీడియా సంస్థ కూడా పోటీపడినప్పటికీ, ఆర్థిక అంశాల్లో ఏకాభిప్రాయం కుదరకపోవడంతో చివరకు జీ నెట్‌వర్క్‌కే అవకాశం దక్కింది. 2026 ఫిఫా వరల్డ్‌కప్ అమెరికా, కెనడా, మెక్సికో దేశాల్లో జరగనున్న నేపథ్యంలో మ్యాచ్‌లు భారత కాలమానం ప్రకారం అర్ధరాత్రి, తెల్లవారుజామున ప్రసారమయ్యే అవకాశం ఉంది. ఈ సందర్భంగా జీ ఎంటర్‌టైన్‌మెంట్ ప్రధాన కార్యనిర్వాహక అధికారి పునిత్ గోయెంకా ఆనందం వ్యక్తం చేశారు. ప్రపంచంలో అత్యధిక మంది వీక్షించే క్రీడా మహాసంగ్రామాన్ని భారత ప్రేక్షకులకు అందించడం గర్వకారణమని, ఫుట్‌బాల్ అభిమానులకు అత్యుత్తమ వీక్షణ అనుభవాన్ని అందించేందుకు కట్టుబడి ఉన్నామని తెలిపారు. క్రీడా ప్రసార రంగంలో చాలా ఏళ్ల విరామం తర్వాత జీ నెట్‌వర్క్ మళ్లీ భారీ స్థాయిలో అడుగుపెడుతుండటం పరిశ్రమ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. 2026 ఫిఫా వరల్డ్‌కప్ జూన్ 11 నుంచి ప్రారంభం కానుంది.

# ఆర్సీబీ విజయాల వెనుక అసలైన శిల్పి ఆండీ ఫ్లవర్

**అహ్మదాబాద్, జూన్ 1 :** వరుసగా రెండోసారి ఇండియన్ ప్రీమియర్ లీగ్ టైటిల్‌ను సొంతం చేసుకున్న రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు విజయాల వెనుక ప్రధాన పాత్ర పోషించిన వ్యక్తిగా ప్రధాన కోచ్ ఆండీ ఫ్లవర్ పేరు మార్మోగుతోంది. ఎన్నో ఏళ్లుగా స్టార్ ఆటగాళ్లతో నిండినప్పటికీ ట్రోఫీకి దూరంగా నిలిచిన బెంగళూరునుఛాంపియన్ జట్టుగా తీర్చిదిద్దడంలో ఫ్లవర్ కీలక పాత్ర పోషించాడు. ఆగస్టు 2023లో ప్రధాన కోచ్ బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆండీ ఫ్లవర్ జట్టులో సమూల మార్పులకు శ్రీకారం చుట్టాడు. వ్యక్తిగత ప్రతిభ కంటే జట్టు సమష్టి ప్రదర్శనకు ప్రాధాన్యం ఇవ్వాలనే సిద్ధాంతంతో ముందుకు సాగాడు. స్టార్ ఆటగాళ్లపై ఆధారపడే సంస్కృతిని మార్చి, ప్రతి ఆటగాడి పాత్రకు విలువ ఇచ్చే విధానాన్ని అమలు చేశాడు. బెంగళూరును గతంలో తీవ్రంగా ఇబ్బంది పెట్టిన బౌలింగ్ సమస్యను పరిష్కరించడంపై ప్రత్యేక దృష్టి సారించాడు. అనుభవజ్ఞుడైన భువనేశ్వర్ కుమార్‌ను జట్టులోకి తీసుకురావడంతో పాటు యువ ఆటగాడు రసిఖ్ సలామ్‌కు అవకాశాలు కల్పించాడు. ఈ ఇద్దరూ గత రెండు సీజన్లలో జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించారు. తుది జట్టులో ఉన్న ఆటగాళ్లతో పాటు బెంచ్‌పై ఉన్న వారికీ సమాన ప్రాధాన్యం ఇవ్వడం ఫ్లవర్ ప్రత్యేకతగా నిలిచింది. జట్టు సంస్కృతిని మార్చిన కోచ్‌గా ఆండీ ఫ్లవర్‌ను కెప్టెన్ రజత్ పటీదార్ ప్రశంసించాడు. ప్రతి ఆటగాడితో వ్యక్తిగతంగా మాట్లాడి ఆత్మవిశ్వాసాన్ని పెంచే కోచ్‌గా ఆయనను అభివర్ణించాడు. యువ ఆటగాళ్లకు స్పష్టమైన మార్గనిర్దేశం చేసి వారిలో నమ్మకాన్ని పెంపొందించడంలో ఫ్లవర్ పాత్ర అమూల్యమని పేర్కొన్నాడు. గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన ఫైనల్లో బెంగళూరు విజయంతో మరోసారి ఆండీ ఫ్లవర్ వ్యూహాలు ఫలించాయి. మైదానంలో ఆటగాళ్లు రాణించినప్పటికీ, తెంవెనుక విజయానికి బాటలు వేసింది ఫ్లవర్ రూపొందించిన ప్రణాళికలేనని క్రీడా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఫైనల్ విజయానంతరం బెంగళూరు ఆటగాళ్లు ఐస్ క్యూబ్‌లతో నిండిన బకెట్‌ను ఆండీ ఫ్లవర్‌పై కుమ్మరించి ఆనందం పంచుకోవడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. జట్టులో ఆయనకు ఉన్న గౌరవం, అభిమానానికి అది నిదర్శనంగా మారింది. జింబాబ్వే క్రికెట్ చరిత్రలో అత్యుత్తమ ఆటగాళ్లలో ఒకరిగా గుర్తింపు పొందిన ఆండీ ఫ్లవర్, టెస్ట్ క్రికెట్‌లో 4,794 పరుగులు, వన్డేల్లో 6,786 పరుగులు సాధించాడు. వికెట్ కీపర్‌గా కూడా అద్భుతమైన రికార్డులు నమోదు చేశాడు. ఆటగాడిగా ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందిన ఫ్లవర్, ఇప్పుడు కోచ్‌గా కూడా తన ప్రత్యేక ముద్ర వేస్తూ బెంగళూరును విజయపథంలో నడిపిస్తున్నాడు. ఇప్పుడు బెంగళూరు అభిమానుల చూపంతా వచ్చే సీజన్‌పైనే ఉంది. వరుసగా రెండు టైటిళ్లు గెలిచిన జట్టు, మూడోసారి కూడా విజేతగా నిలిచి చరిత్ర సృష్టించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఆ కలను నిజం చేసే బాధ్యత మరోసారి ఆండీ ఫ్లవర్ భుజాలపైనే ఉంది.





# అవకాశాల కోసం రుహానీ శర్మ పోరాటం



హైదరాబాద్, జూన్ 1: ప్రస్తుతం సినీ పరిశ్రమలో కొత్త కథానాయికల హవా కొనసాగుతున్న నేపథ్యంలో పలువురు యువ నటీమణులు తమ ప్రతిభను నిరూపించుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. అలాంటి వారిలో నటి రుహానీ శర్మ ఒకరు. వరుసగా సినిమాలు చేస్తున్నప్పటికీ ఆశించిన స్థాయిలో విజయాలు దక్కకపోవడంతో ఆమె కెరీర్ ఇంకా స్థిరపడే దశలోనే ఉంది. రుహానీ శర్మ తెలుగు చిత్రసీమలోకి 'చి.ల.సౌ' చిత్రంతో కథానాయికగా పరిచయమైంది. తొలి చిత్రంతోనే తన సహజ నటన, అందంతో ప్రేక్షకులను ఆకట్టుకుని మంచి గుర్తింపు సంపాదించింది. ఆ సినిమా విజయంతో ఆమెపై మంచి అంచనాలు ఏర్పడ్డాయి. అయితే ఆ తర్వాత వచ్చిన చిత్రాలు పెద్దగా విజయాలు సాధించకపోవడంతో కెరీర్ ఆశించిన వేగంతో ముందుకు సాగలేదు. 'హిట్', 'డర్టీ హరి', 'నూటొక్క జిల్లాల అందగాడు', 'హర్', 'సైంధవ్', 'ఆపరేషన్ వాలెంటైన్', 'శ్రీరంగనీతులు' వంటి చిత్రాల్లో నటించిన రుహానీ శర్మకు వాటిలో 'చి.ల.సౌ', 'హిట్' చిత్రాలు మాత్రమే వాణిజ్యపరంగా మంచి విజయాలు అందించాయి. మిగతా చిత్రాలు ఆశించిన ఫలితాలు ఇవ్వలేకపోయాయి.


తెలుగుతో పాటు హిందీ చిత్రాల్లో కూడా అవకాశాలు అందిపుచ్చుకునేందుకు ప్రయత్నిస్తున్న రుహానీ శర్మ, నటనకు ప్రాధాన్యం ఉన్న పాత్రలను ఎంచుకుంటూ ముందుకు సాగుతోంది. కెరీర్ ప్రారంభంలో సాధారణ, సహజమైన పాత్రల్లో కనిపించిన ఆమె, ఇటీవల ఆధునిక ఫోటోషూట్లతో సామాజిక మాధ్యమాల్లోనూ చురుకుగా ఉంటూ అభిమానులను ఆకట్టుకుంటోంది. సినిమాల్లో పెద్ద విజయాల కోసం ఎదురుచూస్తున్న రుహానీ శర్మకు రాబోయే ప్రాజెక్టులు కీలకంగా మారనున్నాయి. సరైన కథ, బలమైన పాత్ర దొరికితే ఆమె మరోసారి ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించే అవకాశాలు ఉన్నాయని సినీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# పొలాచ్చిలో చిరు మూవీ షూటింగ్



కథానాయకుడు చిరంజీవి.. దర్శకుడు బాబీ కలయికలో ఓ సినిమా రూపొందుతోంది. 'వాల్తేరు వీరయ్య' విజయం తర్వాత వీళ్లిద్దరి నుంచి రానున్న రెండో చిత్రమిది. కేవీఎన్ ప్రొడక్షన్స్ పతాకంపై వెంకట్ కె. నారాయణ నిర్మిస్తున్నారు. అనస్వర రాజన్ కీలక పాత్ర పోషిస్తోంది. ఈ సినిమా పొల్లాచ్చిలో కొత్త షెడ్యూల్‌ను ప్రారంభించుకోనుందని తెలిసింది. దాదాపు రెండు వారాలకు పైగా సాగే ఈ షెడ్యూల్‌లో చిరుపై కీలక సన్నివేశాలు తెరకెక్కించనున్నట్లు సమాచారం. ఇది మాస్ అంశాలతో నిండిన పవర్‌ఫుల్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా సిద్ధమవుతోంది. దీంట్లో చిరంజీవి పాత్ర రెండు కోణాల్లో కనిపించే అవకాశమున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమాకి తమన్ సంగీతమందిస్తుండగా.. విజయ్ కార్తీక్ కన్నన్ ఛాయాగ్రాహకుడిగా వ్యవహరిస్తున్నారు.

# 'మగధీర' సెట్స్‌లో చరణ్ అల్లరి.. ఆసక్తికర విషయం చెప్పిన కాజల్



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్, నటి కాజల్ అగర్వాల్ జంటగా నటించిన 'మగధీర' చిత్రం తెలుగు సినీ చరిత్రలో ప్రత్యేక స్థానం సంపాదించుకుంది. దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి తెరకెక్కించిన ఈ చిత్రం భారీ విజయాన్ని అందుకుని అనేక రికార్డులు సృష్టించింది. తాజాగా ఈ సినిమా చిత్రీకరణ సమయంలో జరిగిన సరదా సంఘటనలను కాజల్ అగర్వాల్ అభిమానులతో పంచుకున్నారు. ఒక ఇంటర్వ్యూలో మాట్లాడిన కాజల్, 'మగధీర' చిత్రీకరణ రోజుల్లో రామ్ చరణ్ తనను సరదాగా ఆటపట్టించేవాడని గుర్తు చేసుకున్నారు. సినిమాలో గుర్రపు స్వారీ సన్నివేశాలు కీలకంగా ఉండటంతో రామ్ చరణ్ తన సొంత గుర్రం 'బదల్'ను చిత్రీకరణకు తీసుకువచ్చేవాడని తెలిపారు. చిత్రీకరణ విరామ సమయంలో తనను ఆ గుర్రంపై కూర్చోబెట్టి తిప్పేవాడని, అనంతరం అదే గుర్రం పేరును పదేపదే పిలుస్తూ సరదాగా అల్లరి చేసేవాడని కాజల్ వెల్లడించారు. తాను ఎక్కడ కనిపించినా "బదల్... బదల్..." అంటూ గట్టిగా పిలిచి అందరినీ నవ్వించేవాడని చెప్పారు. ఆ రోజుల జ్ఞాపకాలు ఇప్పటికీ తనకు ఎంతో ప్రత్యేకంగా అనిపిస్తాయని, రామ్ చరణ్ చేసిన సరదా చేష్టలు మరచిపోలేనివని కాజల్ పేర్కొన్నారు. 'మగధీర' చిత్రీకరణ సమయంలో ఏర్పడిన అనుబంధం ఇప్పటికీ తన మనసులో నిలిచిపోయిందని తెలిపారు. ఇదిలా ఉండగా, రామ్ చరణ్ ప్రస్తుతం తన తాజా చిత్రం 'పెద్ది' ప్రచార కార్యక్రమాలతో బిజీగా ఉన్నారు. భారీ అంచనాల మధ్య రూపొందిన ఈ చిత్రం జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. సినీ అభిమానులు ఈ సినిమాపై ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# మోడ్రన్ లుక్‌లోనూ మెరిసిన ఐశ్వర్య మీనన్



ఓటీటీ ప్రేక్షకులను నవ్వులతో ముంచెత్తిన ప్రముఖ హాస్య ధారావాహిక 'సేవ్ ది టైగర్స్'ఇప్పుడు మూడో సీజన్‌తో మరోసారి ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇప్పటికే రెండు భాగాలతో విశేష ఆదరణ పొందిన ఈ సిరీస్, ఈసారి మరింత వినోదం, కొత్త కథా మలుపులు, ఊహించని ఫాంటసీ అంశాలతో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది. జూన్ 19 నుంచి ప్రముఖ డిజిటల్ వేదికలో ప్రసారం కానున్న ఈ సిరీస్‌కు సంబంధించిన ప్రచార చిత్రాన్ని తాజాగా విడుదల చేయగా, అది సామాజిక మాధ్యమాల్లో మంచి స్పందనను సొంతం చేసుకుంటోంది. ప్రచార చిత్రం ప్రారంభం నుంచే వినోదభరితంగా సాగుతుంది. పెళ్లి తర్వాత తమ జీవితాలు ఎలా మారిపోయాయో ముగ్గురు స్నేహితులు సరదాగా చెప్పుకునే సన్నివేశాలు ఆకట్టుకుంటాయి. కుటుంబ జీవితంలో ఎదురయ్యే చిన్న చిన్న సంఘటనలను హాస్యంతో మేళవిస్తూ కథను ముందుకు తీసుకెళ్లిన విధానం ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. గత రెండు సీజన్లలో మాదిరిగానే ఈసారి కూడా భార్యాభర్తల మధ్య జరిగే సరదా సంఘటనలు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నా యి. అయితే ఈ సీజన్‌లో ప్రత్యేకత ఏమిటంటే ఫాంటసీ అంశాల కలయిక. ఒక సందర్భంలో స్వర్గలోకంలోని దేవేంద్రుడి పాత్రలో ప్రముఖ హాస్య నటుడు వెన్నెల కిషోర్ కనిపించడం కథకు కొత్త మలుపును తీసుకువచ్చింది. అతని ప్రవేశం తర్వాత ముగ్గురు స్నేహితుల జీవితాలు పూర్తిగా మారిపోతాయి. సాధారణ జీవితాన్ని గడుపుతున్న వారు ఒక్కసారిగా సమాజంలో ఉన్న త స్థానాలకు చేరుకోవడం కథలో ప్రధాన ఆసక్తికర అంశంగా మారింది. ఒకరు ప్ర జా ప్ర తి ని ధి గా ఎదగగా, మరొకరు ప్రముఖ రచయితగా గుర్తింపు పొందుతారు. ఇంకొకరు భారీ సంస్థకు ప్ర ధాన కార్యనిర్వాహక అధికారిగా బాధ్యతలు చేపడతారు. ఈ మార్పులు నిజంగానే జరిగాయా? లేక దైవకృపతో వచ్చిన అద్భుత పరిణామాలా? అన్న ప్రశ్నలకు సమాధానంగా కథ సాగనున్నట్లు ప్రచార చిత్రం ద్వారా తెలుస్తోంది. హాస్యంతో పాటు భావోద్వేగాలు, కుటుంబ బంధాలు, సామాజిక వ్యంగ్యం కూడా ఈసారి కథలో చోటు చేసుకున్నాయి. ప్రధాన పాత్రల్లో నటించిన ప్రియదర్శి, అభినవ్ గోమటం, చైతన్య కృష్ణ మరోసారి తమ సహజ నటనతో ఆకట్టుకున్నారు. వీరి భార్యల పాత్రల్లో నటించిన పావని గంగిరెడ్డి, జోర్దార్ సుజాత, దేవియాని శర్మలు కూడా కథకు బలంగా నిలిచారు. గత సీజన్లలో వీరి పాత్రలకు ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ లభించగా, ఈసారి మరింత బలమైన పాత్రలతో కనిపించనున్నట్లు తెలుస్తోంది.

# విమల్ థియేటర్‌లో 'స్పిరిట్' సందడి

## ప్రభాస్ రాకతో అభిమానుల్లో ఉత్సాహం!




భారతీయ సినీ రంగంలో అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రాల్లో ఒకటైన 'స్పిరిట్' షూటింగ్ హైదరాబాద్‌లో కొత్త షెడ్యూల్‌ను ప్రారంభించింది. దర్శకుడు సందీప్ రెడ్డి వంగా తెరకెక్కిస్తున్న ఈ భారీ యాక్షన్ చిత్రం ఇప్పటికే దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఇందులో ప్రభాస్ శక్తివంతమైన పోలీసు అధికారి పాత్రలో కనిపించనున్నట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి. తాజా షెడ్యూల్ కోసం చిత్రబృందం హైదరాబాద్‌లోని బాలానగర్ ప్రాంతంలో ఉన్న ప్రసిద్ధ విమల్ థియేటర్‌ను ఎంపిక చేసింది. నాలుగు దశాబ్దాలకుపైగా చరిత్ర కలిగిన ఈ థియేటర్ నగరంలోని ప్రముఖ సింగిల్ స్క్రీన్ థియేటర్లలో ఒకటిగా గుర్తింపు పొందింది. ఎన్నో విజయవంతమైన చిత్రాలకు వేదికగా నిలిచిన ఈ ప్రదేశంలో ఇప్పుడు 'స్పిరిట్'కు సంబంధించిన కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. ప్రభాస్ ఈ షెడ్యూల్‌లో పాల్గొంటున్నారనే సమాచారం బయటకు రావడంతో అభిమానులు పెద్ద సంఖ్యలో థియేటర్ పరిసర ప్రాంతాలకు చేరుకుంటున్నారు. అభిమానుల రద్దీ పెరగడంతో చిత్ర యూనిట్ ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేసింది. పోలీసుల సహకారంతో షూటింగ్ ప్రాంతంలో కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేసినట్లు సమాచారం. ఈ చిత్రాన్ని దర్శకుడు సందీప్ రెడ్డి వంగా తన కెరీర్‌లోనే అత్యంత ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌గా రూపొందిస్తున్నారు. యాక్షన్, భావోద్వేగాలు, నేర పరిశోధన అంశాల కలయికతో కథ సాగనున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా ప్రభాస్‌ను ఇప్పటివరకు కనిపించని కొత్త కోణంలో ఈ సినిమాలో చూపించబోతున్నారనే ప్రచారం అభిమానుల్లో మరింత ఆసక్తిని పెంచుతోంది. ఈ చిత్రంలో కథానాయికగా త్రిప్తి దిమ్రి నటిస్తోంది. అలాగే వివేక్ ఒబెరాయ్ ప్రతినాయకుడి పాత్రలో కనిపించనున్నారు. ఇతర ముఖ్య పాత్రల్లో పలువురు ప్రముఖ నటీనటులు నటిస్తున్నారు. ప్రస్తుతం శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటున్న 'స్పిరిట్' చిత్రం 2027 మార్చి 5న ప్రపంచవ్యాప్తంగా భారీ స్థాయిలో విడుదల కానుంది. ఈ చిత్రంపై ప్రభాస్ అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.

Printed, Published by **Mohammed Murthuza.** Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net Mobile No. **7036644111, 9490140565**

# పేటలో ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించిన జిల్లా కలెక్టర్ సీ. హెచ్ ప్రియాంక



**నారాయణపేట, జూన్,01(సమయం న్యూస్) :** నారాయణ పేట జిల్లా కేంద్రంలో నిర్మాణాలు పూర్తయిన మూడు ఇందిరమ్మ ఇండ్లను సోమవారం జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక ప్రారంభించారు. పేట మున్సిపాలిటీ పరిధిలోని 3 వ వార్డులో ఉజ్జెల్లీ నర్సమ్మ, 4 వ వార్డులో వరలక్ష్మి, 9వ వార్డులో దాసరి కమల శ్రీ లకు చెందిన ఇందిరమ్మ ఇండ్లను జిల్లా కలెక్టర్ పుర చైర్ పర్సన్ కొండా శ్వేతా సత్య యాదవ్ తో కలిసి ప్రారంభించారు. లబ్ధిదారులు కలెక్టర్ తో పాటు అతిథులను శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నూతన ఇంటి యజమానులకు శుభాకాంక్షలు తెలిపారు. కొత్త ఇంటి ప్రవేశం చేసిన వేళ లబ్ధిదారులకు కలిగిన అనుభూతి, వారి పిల్లలు, చదువు, కుటుంబ సభ్యుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ శంకర్ నాయక్, పుర వైస్ చైర్ పర్సన్ మంజుల, వార్డు కౌన్సిలర్లు మహేశ్, గొల్ల రవితేజ యాదవ్, రాజేష్ ఘట్, హౌసింగ్ ఏ ఈ గౌస్, వార్డు ఆఫీసర్ దేవరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# రైతు బిడ్డ అగ్నివీర్ జవాన్



**దౌల్తాబాద్ మండలం, జూన్,01(సమయం న్యూస్** :తండ్రి రైతు దేశానికి అన్నం పెడితే కొడుకు అగ్ని వీర్ జవాన్ గా దేశ సేవకు వెళుతున్నాడు వ్యవసాయ కుటుంబం నుంచి అగ్నివీర్ జవాన్ కు సెలెక్ట్ అయిన కార్తీక్ తండ్రి వల్యానాయక్ తల్లి బుజ్జి బాయి వ్యవసాయం చేసుకుంటూ తన ఇద్దరు కుమారులు చదువుకుంటూ వ్యవసాయం లో తండ్రికి సాయం చేస్తూ ఉండేవారు అగ్నివీర్ నియామకం లో దౌల్తాబాద్ మండలం నంద నాయక్ తండా గ్రామపంచాయతీ భాగ్య తండా కు చెందిన కార్తీక్ ఉత్తీర్ణుడైనాడు. దేశ సేవ చేయడానికి గొప్ప అవకాశం లభించింది అని కుటుంబ సభ్యులు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

# ప్రజావాణికి 23ఫిర్యాదులు

**ప్రజావాణి కార్యక్రమానికి ప్రధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి -జిల్లా కలెక్టర్ సీ. హెచ్ ప్రియాంక ఐఏఎస్**



**నారాయణపేట, జూన్,01(సమయం న్యూస్) :** ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ ప్రియాంక అధికారులకు సూచించారు. ప్రజావాణి సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 23 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ తో పాటు అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీను,లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డి . ఆర్. ఓ. రాజేశ్వరి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్



**వికారాబాద్, జూన్,01(సమయం న్యూస్) :** తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకులకు సంబంధించి ఏర్పాట్ల ను పరిశీలించిన జిల్లా కలెక్టర్ దీపక్ తివారి. సోమవారం సాయంత్రం కలెక్టర్ ఏర్పాట్ల ను పరిశీలించి, ఘనంగా ఏర్పాట్లు పూర్తి చేయాలనీ అధికారులకు ఆదేశించారు. కలెక్టర్ తో పాటు జిల్లా అదనపు కలెక్టర్ లు ఉమా శంకర్ ప్రసాద్, వెంకటాచారి, ఆర్ డి ఓ వాసు చంద్ర, తహసీల్దార్ లక్ష్మి నారాయణ, మున్సిపల్ కమిషనర్ విక్రమ్ సింహ రెడ్డి, ఎ ఓ , ఫర్హీన బేగం సంబంధిత అధికారులు ఉన్నారు.

# నేడు పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి పర్యటన



**పరిగి మున్సిపల్, (మం)జూన్,01(సమయం న్యూస్) :** నేడు తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు దినోత్సవం సందర్భంగా ఉదయం 9.00 గంటలకు పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి నివాసంలో, జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొంటారు... పరిగి నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో, బీఆర్ఎస్ పార్టీ కార్యాలయల్లో, జాతీయ జెండాను బీఆర్ఎస్ పార్టీ జెండాను, ఆవిష్కరించలని, పార్టీ నాయకులకు, కార్యకర్తలకు పిలుపును ఇచ్చిన పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి

# తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జిల్లాలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు

- **జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్**
- **అనుమానాస్పద వస్తువులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి.**



**నారాయణపేట, జూన్,01(సమయం న్యూస్) :** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జిల్లాలో శాంతిభద్రతలు పరిరక్షించేందుకు నారాయణపేట జిల్లా పోలీసులు విస్తృత భద్రతా చర్యలు చేపట్టారు. ముందస్తు భద్రత చర్యల్లో భాగంగా సోమవారం నారాయణపేట జిల్లా కేంద్రంలోని ముఖ్య ప్రాంతాల్లో బాంబ్ స్క్వాడ్ బృందం, పోలీసు జాగిలాల సహాయంతో సమగ్ర తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో భాగంగా జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణ, బస్టాండ్, ప్రధాన చౌరస్తా, జనసమ్మర్ధం అధికంగా ఉండే ప్రాంతాలు మరియు ఇతర ముఖ్య ప్రభుత్వ కార్యాలయాల పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. పేలుడు పదార్థాలు లేదా ఇతర అనుమానాస్పద వస్తువులు ఉన్నాయా అనే కోణంలో ప్రతి ప్రాంతాన్ని ప్రత్యేక పరికరాలతో తనిఖీ చేశారు. జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఖూూ మాట్లాడుతూ, తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా జిల్లా పోలీసు శాఖ అన్ని అవసరమైన చర్యలు చేపట్టిందని తెలిపారు. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని, ఎక్కడైనా అనుమానాస్పద వస్తువులు, బ్యాగులు, సంచులు లేదా వాహనాలు కనిపించినట్లయితే వాటిని తాకకుండా వెంటనే సమీప పోలీసు అధికారులకు లేదా డయల్-100కు సమాచారం అందించాలని సూచించారు. అలాగే ప్రజలు వదంతులను నమ్మవద్దని, సామాజిక మాధ్యమాల్లో నిర్ధారణ లేని సమాచారాన్ని ప్రచారం చేయవద్దని కోరారు. ప్రజల సహకారంతోనే శాంతిభద్రతల పరిరక్షణ సాధ్యమవుతుందని, తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను అందరూ సంతోషంగా, బాధ్యతాయుతంగా జరుపుకోవాలని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు. ఈ తనిఖీలలో బాంబ్ స్క్వాడ్ సిబ్బంది, డాగ్ స్క్వాడ్ బృందం మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# పర్యావరణ వారోత్సవాల పోస్టర్ ను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్-దీపక్ తివారి

- **"ప్రజా పాలన -ప్రగతి ప్రణాళిక" 99 రోజుల కార్యక్రమంలో భాగంగా**
- **జిల్లా అటవీ శాఖ ఆధ్వర్యంలో పర్యావరణ వారోత్సవాలు**
- **జెండా ఊపి అవగాహన బైక్ ర్యాలీని ప్రారంభించిన అదనపు కలెక్టర్ - ఉమాశంకర్ ప్రసాద్**



**వికారాబాద్, జూన్,01(సమయం న్యూస్) :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న "ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక" 99 రోజుల కార్యక్రమంలో భాగంగా జిల్లా అటవీ శాఖ ఆధ్వర్యంలో పర్యావరణ వారోత్సవాలు -- 2026 కార్యక్రమాలను సోమవారం ప్రారంభించారు. ఈ వారోత్సవాలు జూన్ 01 నుండి జూన్ 12, 2026 వరకు జిల్లా వ్యాప్తంగా నిర్వహించబడనున్నాయి. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దీపక్ తివారి, ఐఏఎస్ పర్యావరణ వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించి కార్యక్రమాలను ప్రారంభించారు. అనంతరం అదనపు కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, ఐఏఎస్ జెండా ఊపి అవగాహన బైక్ ర్యాలీని ప్రారంభించారు. ఈ బైక్ ర్యాలీ వికారాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయం నుండి కోట్‌పల్లి రిజర్వాయర్ వరకు నిర్వహించబడింది. పర్యావరణ పరిరక్షణ, అటవీ సంపద సంరక్షణ, జీవవైవిధ్య పరిరక్షణ మరియు వృక్షారోపణ ప్రాముఖ్యతపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఈ ర్యాలీ నిర్వహించబడింది. కార్యక్రమంలో కె. శ్యామ్ కుమార్, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్, వికారాబాద్, శ్రీనివాస్, డీఆర్డీఓ, వికారాబాద్, నంద కుమార్, జెడ్పి సీఈఓ, వికారాబాద్, రఘుకుమార్, వికారాబాద్, శ్రీదేవి సరస్వతి, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్, తాండూరు, జి. ప్రతిమ, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్, పరిగి, పి. నాగేశ్వరరావు, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్, వికారాబాద్‌తో పాటు అటవీ శాఖకు చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# యాద్గార్ పూర్‌లో ఘనంగా గ్రామదేవతల ఆలయ ప్రథమ వార్షికోత్సవాలు



**కోటగిరి, జూన్ 1, (సమయం న్యూస్ ) :** నిజామాబాద్ జిల్లా కోటగిరి మండలం యాద్గార్పూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామదేవతల ఆలయాల ప్రథమ వార్షికోత్సవ వేడుకలు మూడు రోజుల పాటు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా రెండవ రోజైన నేడు మహాలక్ష్మి ఆలయంలో పూజారి శివ శాస్త్రి ఆధ్వర్యంలో గణపతి పూజ, నవగ్రహ పూజ, హోమం, అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు, పూర్ణాహుతి కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం గ్రామంలోని ఆడపడుచులు మంగళహారతులతో స్థానిక చెరువు కట్ట వద్ద గల గంగమ్మ ఆలయం వరకు డిజె పాటల నడుమ ఉత్సాహంగా ర్యాలీ నిర్వహించి, గంగమ్మ తల్లికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా మహాలక్ష్మి, నల్ల పోచమ్మ, పెద్ద పోచమ్మ, గంగమ్మ ఆలయాల్లో గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేయగా, గ్రామ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు భారీ అన్నదానం ఏర్పాటు చేశారు. భక్తిమార్గం, ఐకమత్యం ద్వారానే గ్రామం సుభిక్షంగా ఉంటుందని పూజారి శివ శాస్త్రి ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ వేడుకల్లో గ్రామ సర్పంచ్ షేక్ గౌస్, మాజీ సర్పంచ్ కృష్ణ, ఉపసర్పంచ్ లాలయ్య, గ్రామ పెద్దలు ఫుల్కంటి కిష్టయ్య, మెత్రి సాయిలు, గైని గంగారాం, సంఘం సంజీవ్, దాదుసాబ్, సయ్యద్, ఆంజనేయులు, శ్యామ్, ఆనంద్, శ్రీధర్ మరియు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రజావాణి ద్వారా వచ్చిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

అధికారులకు ఆదేశించిన- జిల్లా కలెక్టర్ దీపక్ తివారి



**వికారాబాద్, జూన్,01(సమయం న్యూస్) :** జిల్లా లో నిర్వహించే ప్రజావాణిలో వచ్చిన దరకాస్తులను తరితగతిన పూర్తి చేయాలనీ జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అధికారులకు ఆదేశించారు. సోమవారము కల్లెక్టరేట్ కార్యాలయ సమావేశము హాలు నందు ఏర్పాటు చేసిన "ప్రజావాణి" కార్యక్రమంలో అధికారులను ఉద్దేశించి జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.... ప్రజావాణి ద్వార వచ్చిన దరఖాస్తు లను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అధికారులకు ఆదేశించారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు తమ సమస్యలు విన్నవిస్తూ దరఖాస్తు లు సమర్పించా రని కలెక్టర్ తెలిపారు. ఆర్ డి ఓ మరియు తహసిల్దార్ ల పరిదిలో స్వీకరించిన దరకాస్తులను పెండింగ్ ఉంచకుండా సత్వరమే పరిష్కరించాలని , ప్రతి ఫిర్యాదు పై తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులకు ఆదేశించారు. ముఖ్యంగా భూసంబంధిత సమస్యలు, ఆసరా పెన్షన్లు , రేషన్ కార్డులు, గృహనిర్మాణము, వ్యవసాయం, ఉపాధి, జిల్లా పంచాయతి, భూ సర్వే వివిధ అంశాలపై వచ్చిన దరఖాస్తు లపై దృష్టి పెట్టాలన్నారు. ప్రజావాణి కార్యక్రమం ద్వారా 110 దరఖాస్తులు వచ్చాయని, ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని వేగంగా పరిష్కరించెందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమం లో అదనపు కలెక్టర్ వెంకటాచారి, అదనపు కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్ . జడ్ పి సి ఇ ఓ సుధీర్, డి. ఆర్. డి.ఎ. శ్రీనివాస్, వివిధ శాఖ ల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో లక్కీ డీప్ ద్వారా ఎంపికైన విధ్యార్థులు



- **లాటరీ ద్వారా విద్యార్థులను ఎంపిక చేసిన అడిషనల్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ (ఐఏఎస్)**

**వికారాబాద్, జూన్,01(సమయం న్యూస్) :** 2026-27 సంవత్సరమునకు వికారాబాద్ జిల్లా లో ఎస్సీ విద్యార్థులకు హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ కు 1వ తరగతి లో ప్రవేశము కొరకు లక్కీ డీప్ ద్వారా విధ్యార్థులను జిల్లా అడిషనల్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్,(ఐఏఎస్) లాటరీ ద్వారా విధ్యార్థులను ఎంపిక చేయడం జరిగింది. 1.మళ్ళా చరణ్ తండ్రి మాలా గోవింధప్ప, గ్రామం మిట్టబాస్పల్లి, మండలం తాండూర్, వికారాబాద్ జిల్లా. 2తలరి తేజస్విని తండ్రి తలరి జగన్, గ్రామం యాంకతల, మండలం మొమింపేట్, వికారాబాద్ జిల్లా. జిల్లా నుండి ఇద్దరు విధ్యార్థులను జిల్లా అడిషనల్ కలెక్టర్, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి , జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి మరియు జిల్లా వెనుక బడిన తగతుల అభివృద్ధి అధికారి పాల్గొన్నారు.

# కరీంనగర్ ఎంఐఎంలో కోల్డ్ వార్

**రెండు వర్గాలుగా చీలిక!**

## ఈద్ మిలాప్ వేదికగా బహిర్గతమైన అంతర్గత విభేదాలు

### మాజీ డిప్యూటీ మేయర్ వైపే పాత కేడర్..

- ఇద్దరు కార్పొరేటర్ల మద్దతూ వారికే?
- కొత్తగా వచ్చిన వారికే పదవులా?
- ప్రస్తుత టౌన్ ప్రెసిడెంట్‌పై పాత కార్యకర్తల తిరుగుబాటు
- ఒకప్పుడు 7 గురు.. ఇప్పుడు ఇద్దరే
- ప్రస్తుత నాయకత్వ వైఫల్యంపై చర్చ
- అధిష్టానం తక్షణమే జోక్యం చేసుకోకుంటే రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో పార్టీకి భారీ నష్టం తప్పదా?



**సమయం న్యూస్, కరీంనగర్:** కరీంనగర్ జిల్లా కేంద్రంలో ఆల్ ఇండియా మజ్లిస్-ఎ-ఇత్తెహాదుల్ ముస్లిమీన్ (ఏఐఎంఐఎం) పార్టీలో గత కొంతకాలంగా అంతర్గతంగా సాగుతున్న "కోల్డ్ వార్" ఇప్పుడు ఒక్కసారిగా రోడ్డున పడింది. పార్టీలో ఉన్న విభేదాలు కేవలం కార్యాలయాలకే పరిమితం కాకుండా బహిరంగంగా కనిపించడం ప్రారంభమైంది. తాజాగా నగరంలో జరిగిన ఈద్ మిలాప్ వేడుకలు ఇందుకు వేదికగా మారాయి. ఈ కార్యక్రమంలో పార్టీకి చెందిన రెండు వేర్వేరు వర్గాల రాజకీయ బలం, మద్దతు స్పష్టంగా బయటపడటంతో జిల్లా రాజకీయాల్లో ఈ వ్యవహారం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది.

### మాజీ నాయకత్వానికే పాత కేడర్ జై..

పార్టీకి చెందిన పాత, నమ్మకమైన కార్యకర్తలు ఇప్పటికీ మాజీ టౌన్ ప్రెసిడెంట్ మరియు మాజీ డిప్యూటీ మేయర్ వర్గానికే బలంగా మద్దతుగా నిలుస్తున్నట్లు ఈద్ మిలాప్ కార్యక్రమంలో స్పష్టమైంది. ముఖ్యంగా ఇటీవల మున్సిపల్ ఎన్నికల్లో గెలిచిన ఇద్దరు కార్పొరేటర్లు కూడా ప్రస్తుత కమిటీతో అంటీముట్టనట్లుంటూ.. మాజీ నాయకత్వ వర్గానికే దగ్గరగా ఉన్నారని పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ప్రజాప్రతినిధులు కూడా పాత వర్గం వైపే మొగ్గు చూపడంతో కరీంనగర్ మజ్లిస్ పార్టీలో రాజకీయ ఉద్రిక్తత మరింత పెరిగింది.

### పాత కార్యకర్తలకు అవమానం.. కొత్తవారికే అగ్రాసనమా?

మరోవైపు, ప్రస్తుత టౌన్ ప్రెసిడెంట్ ఒంటెద్దు పోకడలపై పార్టీ సీనియర్లు, పాత కార్యకర్తలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కాలంలో పార్టీలో చేరిన కొత్త ముఖాలకు కీలక పదవులు కట్టబెడుతూ.. ఏళ్ల తరబడి పార్టీ జెండా మోసి, కష్టకాలంలో నిలబడిన పాత కార్యకర్తలను పూర్తిగా పక్కన పెడుతున్నారని ఆరోపిస్తున్నారు. "పార్టీ కోసం రక్తం చిందించిన మమ్మల్ని కాదని, నిన్న కాక మొన్న వచ్చిన వారికి అగ్రాసనం వేస్తారా?" అంటూ కార్యకర్తలు అంతర్గత సమావేశాల్లో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.




### నాడు ఏడుగురు.. నేడు ఇద్దరే!

కరీంనగర్ రాజకీయ వర్గాల్లో ప్రస్తుతం మజ్లిస్ పార్టీ గత వైభవానికి, ప్రస్తుత పరిస్థితికి ఉన్న వ్యత్యాసంపై జోరుగా చర్చ సాగుతోంది. ఒకప్పుడు కరీంనగర్ కార్పొరేషన్‌లో ఏఐఎంఐఎం పార్టీకి బలమైన 7 గురు కార్పొరేటర్లు ఉండేవారని, కానీ ప్రస్తుత నాయకత్వ వైఫల్యాల వల్ల ఆ బలం కేవలం ఇద్దరు కార్పొరేటర్లకే పరిమితమైందని విమర్శలు వస్తున్నాయి. ఆ మిగిలిన ఇద్దరు కార్పొరేటర్లు కూడా ప్రస్తుత టౌన్ ప్రెసిడెంట్ వర్గంలో లేకపోవడం గమనార్హం. ఈద్ మిలాప్ వంటి పవిత్ర పండుగ వేడుకల్లో సైతం రెండు వర్గాలు విడివిడిగా వ్యూహాలు ప్రదర్శిస్తూ, తమ బలాన్ని నిరూపించుకునే ప్రయత్నం చేయడంతో మద్దతుదారుల మధ్య కూడా స్పష్టమైన వర్గీకరణ జరిగిపోయింది.

### అధిష్టానం స్పందించకుంటే మునిగిపోవడం ఖాయం!

రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం, కరీంనగర్ ఎంఐఎంలోని ఈ అంతర్గత కుమ్ములాటలు ముదిరి పాకాన పడ్డాయి. పార్టీ అధిష్టానం (హైదరాబాద్) తక్షణమే స్పందించి ఈ అంతర్గత 'కోల్డ్ వార్' కు ఫుల్‌స్టాప్ పెట్టకపోతే.. రాబోయే మున్సిపల్ కార్పొరేషన్ మరియు ఇతర స్థానిక సంస్థల ఎన్నికల్లో కరీంనగర్ నగర పరిధిలో పార్టీ భారీ మూల్యాన్ని చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నారు. పాత, కొత్త వర్గాల మధ్య సమన్వయం కుదర్చకపోతే క్యాడర్ పూర్తిగా చెల్లాచెదురయ్యే ప్రమాదం ఉందని విశ్లేషిస్తున్నారు.

# 'యోగాంధ్ర-2026'కు రాష్ట్రం సిద్ధం

- కోటి మంది భాగస్వామ్యమే లక్ష్యం!
- ఈనెల 21న అమరావతి కృష్ణా నది వంతెనపై 25 వేల మందితో రాష్ట్ర స్థాయి వేడుకలు.. సీఎం చంద్రబాబు హాజరు
- ఏపీ యోగా ప్రచార పరిషత్ ఏర్పాటుకు ముఖ్యమంత్రి ఆమోదముద్ర.. 3 ప్రాంతీయ కార్యాలయాల ఏర్పాటు
- ఈనెల 7 నుంచి రెండు వారాల పాటు యోగాంధ్ర కార్యక్రమాలు.. లేపాక్షిలో ప్రారంభోత్సవం
- సమన్వయం కోసం 'వార్ రూం'..
- వివరాలు వెల్లడించిన మంత్రి సత్యకుమార్ యాదవ్




**అమరావతి, జూన్ 1:** రాష్ట్రంలో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను 'యోగాంధ్ర-2026' పేరుతో అపూర్వంగా, అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు కూటమి ప్రభుత్వం భారీ ఏర్పాట్లు చేస్తోందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. 'యోగా ఫర్ హెల్తీ ఏజింగ్' అనే విశిష్ట నినాదంతో ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన పెంచేలా ఈనెల 21న 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని జరపనున్నట్లు తెలిపారు. యోగాను కేవలం ఒక రోజు ఈవెంట్‌లా కాకుండా, ప్రతి ఒక్కరి దైనందిన జీవితంలో భాగం చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. సోమవారం సచివాలయంలో వైద్యారోగ్య శాఖ సెక్రటరీ సౌరభ్ గౌర్, కమిషనర్ జి.వీరపాండియన్, యోగా-ప్రకృతి వైద్య సలహాదారు డాక్టర్ మంతెన సత్యనారాయణరాజుతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి ఈ వివరాలను వెల్లడించారు.

ఏపీ యోగా ప్రచార పరిషత్‌కు సీఎం గ్రీన్ సిగ్నల్

రాష్ట్రంలో యోగాసనాల ప్రాధాన్యతను నిరంతరం పర్యవేక్షించేందుకు ప్రత్యేకంగా 'ఏపీ యోగా ప్రచార పరిషత్' ఏర్పాటుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆమోదముద్ర వేశారని మంత్రి సత్యకుమార్ తెలిపారు. ఇందుకు సంబంధించిన ఫైలు ప్రస్తుతం ఆర్థిక శాఖ పరిశీలనలో ఉందని, త్వరలోనే ఉత్తర్వులు రానున్నాయని చెప్పారు. ఈ పరిషత్ పరిధిలో 3 ప్రాంతీయ కార్యాలయాలు ఏర్పాటవుతాయన్నారు. గత ఏడాది రికార్డు స్థాయిలో నిర్వహించిన కార్యక్రమాలకు 2 గిన్నిస్ బుక్ రికార్డులు, 21 వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డులతో పాటు స్కోచ్ అవార్డు కూడా దక్కిందని గుర్తు చేశారు. విద్యార్థి దశ నుంచే యోగాపై అవగాహన కల్పించేందుకు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఇప్పటికే పాఠశాల బోధనలో యోగాను అంతర్భాగం చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారని మంత్రి పేర్కొన్నారు. కాగా, ఈ పనుల నిరంతర పర్యవేక్షణ కోసం మంగళగిరిలోని ఎపిఐఐసిలో ప్రత్యేక 'వార్ రూం' ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈనెల 21న రాజధాని అమరావతిలో కృష్ణా నదిపై నిర్మించిన వంతెనపై 25 వేల మందితో రాష్ట్ర స్థాయి ప్రధాన యోగా కార్యక్రమం జరగనుందని, ఇందులో సీఎం చంద్రబాబు నాయుడు స్వయంగా పాల్గొంటారని మంత్రి తెలిపారు. అదే రోజు అన్ని జిల్లా కేంద్రాల్లో 3 వేల మందితో, గ్రామ/వార్డు సచివాలయాల పరిధిలోని పార్కులు, పాఠశాలల్లో భారీగా ప్రదర్శనలు ఉంటాయన్నారు. మొత్తంగా రాష్ట్రవ్యాప్తంగా మహిళలు, రైతులు, విద్యార్థులు, యువజన సంఘాలతో కలిపి సుమారు కోటి మందిని ఇందులో భాగస్వాములను చేయనున్నట్లు వివరించారు. ఈసారి కూడా డాక్టర్ మంతెన సత్యనారాయణ రాజు ఆధ్వర్యంలో రూపొందించిన యోగా వీడియోలను ఉచితంగా ప్రజలకు అందుబాటులోకి తెస్తున్నట్లు చెప్పారు. ఈనెల 7 నుంచి 20 వరకు రాష్ట్రవ్యాప్తంగా వివిధ కేటగిరీల్లో 4 స్థాయిల్లో యోగా పోటీలు (గ్రామ స్థాయి: జూన్ 7-9, మండల స్థాయి: జూన్ 10-12, జిల్లా స్థాయి: జూన్ 14-16, రాష్ట్ర స్థాయి (గ్రాండ్ ఫినాలే: జూన్ 18-20 విజయవాడలో) నిర్వహించనున్నారు. ఆసనాలు, ప్రాణాయామం, గ్రూప్ యోగాతో పాటు క్విజ్, వ్యాసరచన పోటీలు ఉంటాయని, విజేతలను అమరావతి ముఖ్యమంత్రి కార్యక్రమానికి ఆహ్వానిస్తామని తెలిపారు. రాష్ట్రంలోని 28 జిల్లాల్లో 28 ప్రత్యేక థీమ్‌లతో (ఉదాహరణకు: ఎన్టీఆర్ జిల్లాలో పోలీసులు, కోనసీమలో రైతులు, కృష్ణాలో ఆటో లారీ అసోసియేషన్లు, తిరుపతిలో సెలబ్రిటీలు, విశాఖలో మాజీ సైనికోద్యోగులు) ఈ వేడుకలు జరగనున్నాయి. అలాగే ప్రతి జిల్లాలో రెండేసి చొప్పున మొత్తం 56 ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లో (గుంటూరు ఉండవల్లి గుహలు, నంద్యాల శ్రీశైలం-మహానంది, నెల్లూరు మైపాడు బీచ్ వంటి చోట్ల) రోజుకు 4 ప్రదేశాల చొప్పున కనీసం 500 మందితో యోగా ప్రదర్శనలు నిర్వహిస్తామన్నారు. ఈనెల 7న యోగాంధ్ర ప్రారంభ కార్యక్రమాన్ని శ్రీ సత్యసాయి జిల్లా లేపాక్షిలో నిర్వహించాలని సూత్రప్రాయంగా నిర్ణయించినట్లు మంత్రి వెల్లడించారు.



## మేలో రికార్డు స్థాయిలో తిరుమలకు భక్తులు

**శ్రీవారిని దర్శించుకున్న 25,46,168 మంది భక్తులు**

**రూ.120.28 కోట్ల ఆదాయం సమకూరినట్లు టిటిడి వెల్లడి**

**తిరుమల, జూన్ 1:** తిరుమలలో మే నెలలో రికార్డు స్థాయిలో భక్తులు కలియుగదైవం శ్రీవేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఈ యేడాది ప్రపంచవ్యాప్తంగా ఉన్న భక్తులు దర్శనం కోసం తిరుమలకు వచ్చారు. మే మాసంలో రికార్డు స్థాయిలో తిరుమల శ్రీవారిని భక్తులు దర్శించుకున్నారు. వేసవి సెలవులు కావడం, విద్యాసంస్థలకు విరామం రావడంతో దేశవిదేశాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. టీటీడీ విడుదల చేసిన తాజా గణాంకాల ప్రకారం, ఈ ఏడాది మే నెలలో తిరుమలలో రికార్డు స్థాయి దర్శనాలు, కానుకలు, తలనీలాలను భక్తులు సమర్పించారు. మే మాసంలో తిరుమల శ్రీవారిని 25,46,168 మంది భక్తులు దర్శించుకున్నారు. సాధారణ రోజులతో పోలిస్తే వేసవిలో తిరుమలకు వచ్చే భక్తుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ఈ ఏడాది మే నెలలో ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నప్పటికీ, స్వామివారిపై ఉన్న భక్తి శ్రద్ధలతో భక్తులు భారీగా తిరుమలకు తరలి వచ్చారు. భక్తుల రద్దీకి అనుగుణంగా టీటీడీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. సర్వదర్శనం భక్తులకు గంటల తరబడి వేచి ఉండే పని లేకుండా కంపార్ట్‌మెంట్‌లలో నిరంతరం తాగునీరు, పాలు, అన్నప్రసాదాల పంపిణీని నిరంతరాయంగా కొనసాగించారు. శ్రీవారిపై భక్తులు తమకున్న అపారమైన భక్తిని కానుకల రూపంలో చాటుకున్నారు. మే నెలలో స్వామివారికి రూ.120.28 కోట్ల ఆదాయం లభించింది. తిరుమల చరిత్రలో ఒకే నెలలో ఈ స్థాయి ఆదాయం రావడం భక్తుల అచంచల విశ్వాసానికి నిదర్శనంగా నిలుస్తోంది. నగదు రూపంలోనే కాకుండా భక్తులు పెద్దఎత్తున బంగారం, వెండి ఆభరణాలను కూడా హుండీలో సమర్పించారు. స్వామివారికి భక్తులు తలనీలాలు సమర్పించారు. మే నెలలో 12,29773 మంది భక్తులు తలనీలాలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ప్రతిరోజు వేలాది మంది భక్తులు.. స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటున్నారు. స్వామి వారి దర్శనానికి ముందుగా భక్తులు తలనీలాలు సమర్పిస్తారు. ఈ ఏడాది తలనీలాలను భక్తులు రికార్డు స్థాయిలో సమర్పించారు. మే మాసంలో 12,43,063 మంది భక్తులు స్వామి వారికి తలనీలాలు ఇచ్చారు. మే 1 నుంచి మే 27వ తేదీ వరకు శ్రీవారికి మొక్కుల రూపంలో భక్తులు తననీలాలు సమర్పించుకున్నారు. ఈ మేరకు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) వెల్లడించింది. గతంలో ఉన్న రికార్డులను ఇది అధిగమించిందని తెలిపింది. 2024 మే నెలలో 10.65 లక్షల మంది, 2025, మే మాసంలో 10.18 లక్షల మంది భక్తులు స్వామి వారికి తలనీలాలు సమర్పించారని గణాంకాలతో సహా టీటీడీ వివరించింది. మే 18 నుంచి 23వ తేదీ వరకు ప్రతి రోజు 50 వేల మంది భక్తులు తలనీలాలు ఇచ్చారని చెప్పింది. అయితే మే 23వ తేదీ ఒక్క రోజే.. 57,580 మంది భక్తులు తమ మొక్కుల కింద తలనీలాలు ఇచ్చారని పేర్కొంది. ఇటీవల కాలంలో అత్యధికంగా తలనీలాలు సమర్పించినది మే 23వ తేదీ అని టీటీడీ స్పష్టం చేసింది. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని తిరుమలలో కళ్యాణకట్టతోపాటు 11 తలనీలాల కేంద్రాలు ఏర్పాటు చేశామని టీటీడీ వివరించింది. తలనీలాల కోసం 1,150 మంది మంగలి వారిని ఏర్పాటు చేశామంది. వారిలో 269 మంది మహిళలు కూడా ఉన్నారని చెప్పింది. మొక్కుల రూపంలో భక్తులు ఇచ్చిన తలనీలాలను విదేశాలు.. చైనా, ఇటలీ, అమెరికా, బ్రెజిల్ తదితర దేశాలకు ఎగుమతి చేస్తామని టీటీడీ పేర్కొంది. అలాగే ఇటీవల కాలంలో తలనీలాలను వేలంపాటు వేయడం ద్వారా వస్తున్న ఆదాయం కూడా గణనీయంగా పెరిగిందని తెలిపింది. తలనీలాల ద్వారా 2020-21 ఆర్థిక సంవత్సరంలో రూ. 67 కోట్లు వచ్చిందని వివరించింది. ఇలా ప్రతి ఏడాది తలనీలాల ద్వారా టీటీడీకి భారీగా ఆదాయం పెరుగుతుందని స్పష్టం చేసింది. ఈ ఆర్థిక సంవత్సరం తలనీలాల ద్వారా రూ.200 కోట్ల ఆదాయం వచ్చే అవకాశం ఉందని టీటీడీ పేర్కొంది. వేసవి సెలవులతోపాటు వారాంతం సెలవుల కారణంగా భక్తుల రద్దీ గణనీయంగా పెరిగిందని తిరుమల తిరుపతి దేవస్థానం వివరించింది. స్వామివారికి హుండీ, విరాళాలతోపాటు తలనీలాల రూపంలో కూడా ఆదాయం వస్తుంది. ఇలా వచ్చిన ఆదాయాన్ని భక్తుల సేవకు టీటీడీ వినియోగిస్తున్న సంగతి తెలిసిందే.

## నెల్లూరులో చైన్‌స్నాచర్ల బీభత్సం

**ఒకేరోజు ముగ్గురు మహిళల మెడగొలుసులు చోరీ**



**నెల్లూరు, జూన్ 1:** నెల్లూరు నగరంలో చైన్ స్నాచర్లు బీభత్సం సృష్టించారు. ఒకే రోజు ముగ్గురు మహిళల మెడల్లో బంగారు గొలుసులను అపహరించడం తీవ్ర కలకలం రేపింది. జేమ్స్ గార్డెన్, పడరుపల్లి, చిల్డన్స్ పార్క్ ప్రాంతాల్లో దుండగులు బరితెగించారు. ఒంటరిగా వెళ్తున్న మహిళలే లక్ష్యంగా చోరీలు సాగాయి. మొత్తం 9 సవర్ల బంగారు గొలుసులు చోరీకి గురైనట్లు పోలీసులు తెలిపారు. బాధిత మహిళల ఫిర్యాదు మేరకు నవాబుపేట, వేదాయపాలెం, బాలాజీనగర్ పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదు అయ్యాయి. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు చైన్ స్నాచర్లను పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. చోరీ జరిగిన ప్రాంతాల్లో సీసీటీవీ ఫుటేజీల ఆధారంగా నిందితుల కోసం పోలీసులు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. ఒకే రోజు మూడు ప్రాంతాల్లో దుండగులు చోరీకి పాల్పడటం స్థానికులను తీవ్ర భయాందోళనకు గురిచేసింది. చైన్ స్నాచర్లను వెంటనే పట్టుకోవాలని వారు కోరుతున్నారు.